www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 69

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: తదియ రా. 1.23 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 3.54 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా.7.40-9.10; దుర్ముహూర్తం: మ.12.43-1.35, మ.3.20 తదుపరి 4.12; అమృతఘడియలు: ఉ.9.48-11.20; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.48

విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


RANKED AMONG
TOP 25
SELF FINANCED INSTITUTES
IN THE COUNTRY IN
ARIIA 2020
ATAL RANKING OF INSTITUTIONS ON INNOVATION ACHIEVEMENTS
BY MINISTRY OF HRD, GOVT. OF INDIA
EVERYONE COUNTS
BEST PACKAGE
AMAZON WOW 29 LAKHS
INDUSTRY CERTIFICATIONS
MICROSOFT, GOOGLE, AMAZON...
INDUSTRY OFFERED INTERNSHIPS
CENTERS OF EXCELLENCE
VIRTUSA, COGNIZANT, EPAM
INDUSTRY ACADEMIC PARTNERSHIPS
FOR CURRICULUM INTEGRATION
WIPRO, SALESFORCE, INFOSYS
NANO MASTERS
PROGRAM IN ASSOCIATION WITH
GERMAN UNIVERSITIES
No.1
Private Engineering College in Andhra Pradesh
by Times Rankings 2022
పిల్లలపై అత్యంత ప్రేమగల తల్లిదండ్రులు
వివిఐటిని
ఎలా కాదనగలరు ?
THE RIGHT PATH
VVIT
VASIREDDY VENKATADRI INSTITUTE OF TECHNOLOGY
NAAC
NBA
NOBODY DOES IT BETTER
SIEMENS Centre of Excellence
Google Developers Codelabs
NAMBUR, GUNTUR, A.P, INDIA - 522 508. ✆: 99510 23336, 91003 05336, 77029 43336. WWW.VVIT.NET, EAMCET CODE: VVIT

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Vishakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

నేటి నుంచి 18వ లోక్‌సభ సమావేశాలు

ఉదయం 11 గంటలకు మోదీ ప్రమాణం

తొలి రోజు ఏపీ, రెండో రోజు తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారం

26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

జూలై 3 వరకు సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ లోక్‌సభ సమావేశాల్లో తొలి రోజు ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు మొత్తం 280 మంది లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరితో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయిస్తారు. స్పీకర్ ఎన్నిక జరిగే వరకు ప్రొటెం స్పీకర్‌కు సహాయంగా సురేష్ కోడికున్నిల్, టీఆర్ బాలు, రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే, సుదీప్ బందోపాధ్యాయ వ్యవహరిస్తారు. రెండో రోజు 264 మంది ఎంపీలు ప్రమాణ

మిగతా 6వ పేజీలో...



తాడేపల్లి వైసీపీ ఆఫీసు యజమాని రాంకీ సంస్థ అని పేర్కొంటున్న మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ నివేదిక

తాడేపల్లిలో వైసీపీ అక్రమంగా కడుతున్న కార్యాలయాన్ని అధికారులు కూల్చేశారు. జగన్ రోత పత్రిక సైతం ఆ విషయాన్ని 'పార్టీ ఆఫీసు కూల్చేశారు' శీర్షికన ప్రచురించింది. కానీ కాస్త తరచి చూస్తే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా కడుతున్న ఆఫీసుల వెనుక పెద్ద లోగుట్టే ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. ఎందుకంటే వైసీపీ కట్టే ఆఫీసులకు అయితే ఆ పార్టీ యజమానిగా ఉండాలి. కాదూ కూడదంటే ఆ పార్టీని రిప్రజెంట్ చేసే అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డో లేదా సంబంధిత మరో వ్యక్తో ఉండాలి. కానీ శనివారం కూల్చిన ఆ భవనానికి యజమాని వైసీపీ కానీ, జగన్ కానీ కాదు.. దాని యజమాని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్. జగన్ హయాంలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ రూపొందించిన తనిఖీ నివేదికలో స్వయంగా పొందుపరిచిన వాస్తవం ఇది. అలా ఎలా సాధ్యం అంటే.. అదంతే! అక్కడే సిసలైన జగన్మాయ దాగి ఉంది!! జగన్ హయాంలో అడ్డగోలుగా జరిగిన సవాలక్ష అక్రమాల్లో ఇది మరో మహా మాయ!! వైసీపీ కార్యాలయాల పేరిట అడ్డదారిన నామమాత్రపు లీజుకు కోట్ల రూపాయల విలువైన భూములు పొందారు. వాటిలో రాజమహళ్ల వంటి భవనాలు నిర్మిస్తున్నారు. వైసీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ సంస్థ వాటి నిర్మాణంలో పోషిస్తున్న పాత్రను చూస్తే మరో భారీ 'క్విడ్ ప్రో కో' స్కాం ఉందని తేలుతుండటం అసలు విశేషం!



9

నలుచెరగులా భారీ ప్యాలెస్‌లు..

కొల్లగొట్టి.. కట్టేశారు!

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఒకటిన్నర ఎకరా ప్రభుత్వ స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మించారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఇది ఉంటుంది. ఇక్కడ ఎకరం ధర రూ.15 కోట్ల పైమాటే. దాదాపు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వం అప్పనంగా కేటాయించింది. ఏడాదికి ఎకరాకు రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్లకు కేవలం రూ.49,500 లీజు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీ ఉరఫ్ రాంకీ!

పార్టీ ఆఫీసుల వెనుక జగన్మాయ!

మున్సిపల్ నివేదిక సాక్షిగా వెల్లడైన నిజం

అత్యధిక నిర్మాణాలు చేపట్టింది రాంకీనే

తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి

రికార్డుల్లో లేని కాంట్రాక్టు ఒప్పందాలు

లెక్కల్లో చూపని వ్యయం వివరాలు

అయినా ఆ సంస్థ ఫ్రీగా ఎందుకు కడుతున్నట్టు?

జగన్ ఆఫీసుకు ఓనర్ రాంకీ సంస్థ

తెర వెనుక భారీ 'క్విడ్ ప్రో కో' ఆరోపణలు

జగన్ ప్రభుత్వంలో మేళ్లు పొందిన కంపెనీలు సొంత డబ్బుతో రాంకీ ద్వారా నిర్మాణాలు?

అనుమతుల్లేకుండానే మహళ్ల నిర్మాణం

900 కోట్ల భూములు కారుచౌకగా లీజుకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ కార్యాలయాల నిర్మాణాల వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. భూముల కేటాయింపు నుంచి నిర్మాణాల వరకు అడ్డగోలుగా వ్యవహరించారని స్పష్టమవుతోంది. నిబంధనల ఉల్లంఘనే గాక తెర వెనుక సాగిన 'క్విడ్ ప్రో కో' అంశం కూడా తెర మీదకు వస్తోంది. తాడేపల్లిలో

మిగతా 7వ పేజీలో...

తాడేపల్లిలో వైసీపీ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)





7

బిల్లుల కోసం మళ్లీ రగడ

జగన్, భారతి ఉక్కిరిబిక్కిరి

అప్పులు తెచ్చి పనులు చేశామంటూ పులివెందుల కౌన్సిలర్ల గగ్గోలు

బిల్లులు రాకపోతే ఇబ్బందులేనని నిలదీత

ఇదేం తలనొప్పి: మాజీ సీఎం అసహనం

నీ వల్లే వైఎస్ కుటుంబానికి ఈ గతి!

ఎంపీ అవినాశ్‌పై తిరగబడ్డ అభిమానులు

1) రన్‌వేపై పుష్పక్ ల్యాండింగ్.. 2) చినూక్ హెలికాప్టర్ నుంచి పుష్పక్ ప్రయోగం





పుష్పక్ హ్యాట్రిక్

పునర్వినియోగ రాకెట్ పరీక్ష సక్సెస్

ఎల్ఈఎక్స్ సిరీస్‌లో ఇస్రో మూడో విజయం

సురక్షితంగా ల్యాండయిన ఆర్ఎల్‌వీ

అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో ముందడుగు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో భాగంగా ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను తిరిగి భూమి మీదికి తీసుకొచ్చే ప్రక్రియలో 'హ్యాట్రిక్' విజయాన్ని సాధించినట్టు ఇస్రో వెల్లడించింది. దీనికోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికల్ (ఆర్ఎల్‌వీ)కు ఇప్పటికే రెండుసార్లు ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ (ఎల్ఈఎక్స్) పూర్తిచేసిన ఇస్రో.. ఈసారి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దీన్ని విజయవంతంగా పరీక్షించింది. విమానం రెక్కల తరహాలో రూపొందించిన ఈ పునర్వినియోగ రాకెట్ (ఆర్ఎల్‌వీ)కు ఇస్రో 'పుష్పక్' అని పేరు పెట్టింది. ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్‌లో భాగంగా చివరిదైన

మిగతా 6వ పేజీలో...

జగన్ రాసిచ్చారు.. బాబు ఏం చేస్తారు?

అస్మదీయులకు హైడల్ ప్రాజెక్టులు సహా వేల ఎకరాల కేటాయింపు



కేంద్ర సర్కారు నిబంధనలు బుట్టదాఖలు

రైతులను వేధించి మరీ భూములు స్వాధీనం

అప్పట్లోనే తీవ్రంగా నిరసించిన చంద్రబాబు

ఇప్పుడు వీటిని తిరిగి వెనక్కి తీసుకుంటారా?

విద్యుత్తు సమీక్షలో సీఎం నిర్ణయంపై ఉత్కంఠ

అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వనరులను ముఖ్యమంత్రి హోదాలో జగన్ తన వారికి అడ్డగోలుగా రాసిచ్చేశారు. కీలకమైన పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుల పేరిట ప్రధాన జలాశయాలు.. లక్షల ఎకరాల భూములను దోచిపెట్టారు. రిజర్వాయర్లు, వాటికి ఆనుకుని ఉన్న విలువైన భూములను కూడా తన అస్మదీయులకు అప్పగించేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను కూడా తుంగలో తొక్కారు. బహిరంగ వేలం విధానంలో కాకుండా.. పెట్టుబడుల ఆకర్షణ పేరిట సహజ వనరులన్నింటినీ అస్మదీయులకు జగన్ కట్టబెట్టడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తాయి. తన అనుయాయులకు ప్రభుత్వ సంపదను దోచిపెట్టడంపై ఎన్ని విమర్శలు.. ఆరోపణలు వచ్చినా జగన్ వెనక్కు తగ్గలేదు. మీడియాకు సైతం ఏనాడూ వివరణ ఇవ్వలేదు. 2019 ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది లోక్‌సభ సభ్యులను గెలుచుకున్న తనను ప్రశ్నించేదెవరు? అన్నట్లుగా జగన్ వ్యవహరించారు. పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రజాధనంతో నిర్మించిన రిజర్వాయర్లు, విలువైన

మిగతా 7వ పేజీలో...



పట్నాలోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత నిందితుల తరలింపు

సగం మందే హాజరు

1563 మందికి మళ్లీ నీట్ పరీక్ష పెడితే రాసింది 813 మందే.. అక్రమాలపై సీబీఐ ఎఫ్ఐఆర్

పట్నా, గోద్రాలో.. ప్రత్యేక బృందాల దర్యాప్తు

బిహార్‌కు వెళ్లిన బృందంపై గ్రామస్థుల దాడి

కాపాడిన పోలీసులు.. 200 మందిపై కేసు

నీట్ పేపర్.. 30 మందికి అమ్మారు!

బిహార్‌లో అరెస్టైన ముగ్గురు నిందితుల వెల్లడి

మరో 17 మంది డిబార్.. ఐదుగురి అరెస్ట్

న్యూఢిల్లీ, పట్నా, ముంబై, జూన్ 23: గ్రేస్ మార్కులు ఇచ్చిన 1563 మందికి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆదివారం మళ్లీ నీట్ పరీక్ష నిర్వహిస్తే.. వారిలో 813 (52 శాతం) మందే హాజరయ్యారు. మిగతా 750 మందీ డుమ్మా కొట్టేశారు. మేఘాలయ, హరియాణా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, చండీగఢ్‌లోని పరీక్షా కేంద్రాల్లో ఈ ఎగ్జామ్

మిగతా 6వ పేజీలో...

నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత

మల్లికార్జున ఖర్గే ధ్వజం

యువత భవిష్యత్తును మాఫియా చేతుల్లో పెట్టిన కేంద్రం

ప్రియాంక విమర్శ

అమెరికాలో పేలిన తూటా..

బాపట్ల యువకుడి బలి



ఉపాధి కోసం 9 నెలల క్రితమే అమెరికాకు పయనం

డల్లాస్‌లోని సూపర్‌మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్

10

దుండగుడు జరిపిన కాల్పుల్లో గాయపడి దుర్మరణం

ఇసుకపై అదే బాణీ!



తవ్వకాలపై కౌంటింగ్ తర్వాతా కలెక్టర్ల నివేదిక

జగన్ సర్కారుకు సానుకూలంగా రాతలు.. గనుల శాఖలోని కీలక అధికారి పాత్ర

నివేదికలు సుప్రీంకు.. వచ్చే నెల 15న విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సేమ్ టు సేమ్. నాడు హైకోర్టుకు చెప్పినట్టుగానే ఇటీవల సుప్రీంకోర్టుకూ అలాగే చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని జిల్లా కలెక్టర్లు నివేదించారు. ఇందులో ప్రభుత్వ స్థాయిలోని గనుల శాఖ కీలక అధికారి పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా జగన్ సర్కారును కాపాడేలా జిల్లా కలెక్టర్లతో ఆయన సానుకూల నివేదికలు ఇప్పించినట్లు తెలిసింది. "ప్రస్తుతానికి ఎలాంటి తవ్వకాలూ జరగడం లేదు. అక్రమ తవ్వకాల ఆనవాళ్లు లేవు" అని కలెక్టర్ల నుంచి ఒకే విధమైన నివే దికను తెప్పించుకొని సుప్రీంకోర్టుకు పంపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జూలై 15న ఈ నివేదికలపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. అక్రమ తవ్వకాలపై గతంలోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ విచారణ చేపట్టి 2021-2023 వరకు ఇసుక తవ్వకాల టెండర్ దక్కించుకున్న జేపీ వెంచర్స్‌కు కోట్లాది రూపాయల పెనాల్టీ విధించింది. దీనిపై ఆ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించగా

మిగతా 7వ పేజీలో...



చెవిరెడ్డి చేతికి ఆర్టీసీ స్థలాలు!

లీజు పేరుతో 17 ప్రాంతాల్లో కట్టబెట్టిన అధికారులు

రాష్ట్రంలో 70 ప్రాంతాల్లో టెండర్లు

భాస్కరరెడ్డికి కీలక ప్రాంతాలు

వైసీపీ హయాంలోనే తతంగం

పేరుకే టెండర్లు.. అధిక ధరకు కోట్ చేసిన వారికి బెదిరింపులు

ఒంగోలు బస్సు డిపో ఆవరణలో పనులు ప్రారంభించిన వైసీపీ నేత

అడ్డుకున్న జనసేన నేత రియాజ్

లీజులు రద్దు చేయిస్తాం: టీడీపీ



ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 23: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ భూములపై కన్నేశారు. ఓ ప్రైవేటు మాల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఆయన పక్కా ప్రణాళికతో ముందుకు సాగారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని వ్యవహారాన్ని నడిపారు. టెండర్ల ప్రక్రియను అపహాస్యం చేశారు. తనకన్నా ఎక్కువ ధర కోట్ చేసిన వారిని బెదిరించడంతోపాటు, వారిపై

మిగతా 7వ పేజీలో...



6

మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

ఇప్పటికే లైంగిక దౌర్జన్యాల కేసులో జైలు పాలైన ప్రజ్వల్ రేవణ్ణ

బొమ్మలు: అక్బర్



సమాంతర రేఖలు

1
ఎక్కడో ఆగిపోతారు వాళ్ళు
ఆ పాత సంగతులనే దుక్కీ దున్ని
పొడవు వెడల్పులను కత్తిరించి
అరచేతి పరిమాణానికి ప్రపంచాన్ని కుదించి

2
మనిషి సంకుచితాలన్నీ
అభ్యంతరాలుగా రూపుదిద్దుకుంటాయి!
సాకులని చంకనపెట్టుకుని
ప్రపంచం ఎప్పుడూ కుంటుతూనే ఉంటుంది!

3
ఏ ఇదమిత్థాలలో లేని లోకమా,
బహుశా ప్రేమ బానిసత్వమన్న నెపం వేసి
ఏ దయను తాకవనుకుంటా

4
వ్యాపిస్తున్నట్లుగా కనిపిస్తూ
కుంచించుకుపోవటం నీకు తెలిసిన విద్య
విస్తరించే ప్రతిసారి
గాయాలతో లోపలికి తెరుచుకోవటం
నేను తప్పించుకోలేని బలహీనత!

5
సంకోచ వ్యాకోచాలకి
ఎవరికి అర్థాలు వారే ఇచ్చుకునే
ఆత్మ సంతృప్త జీవులు మనుషులు!

ఓ ప్రపంచమా
అందుకేనేమో..
నువ్వు చెప్పే మరణాలు నావి కాదు
నేను చెప్పే మరణాలు నీవి కాదు!

6
దేని ప్రత్యేకత దానిదే
అన్న వాస్తవాన్ని విస్మరించటం వల్లనేమో
సమాంతర రేఖలుగా మిగిలి
ఇన్ని రాద్ధాంతాలలోకి లాగబడుతున్నాం!

రాళ్ళబండి శశిశ్రీ
74163 99396

కవితాసంపుటాల ఆహ్వానం

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి పురస్కారం - 2024 కొరకు 2023లో ముద్రితమైన కవితా సంపుటాలు మూడు ప్రతులను జులై 10 లోపు పంపాలి. కవి వయస్సు 35కు మించ రాదు. చిరునామా: ఇబ్రహీం నిర్గుణ్, 15.5. 112/1/బి, స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్య నగర్, ఖమ్మం-507002. ఫోన్: 90636 96968.

ఇబ్రహీం నిర్గుణ్

గీతమ్ పురస్కారం

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్తమ కవితా సంపుటాలు, కథా సంపుటాల పోటీకి 2016 - 2024 మధ్య విడుదలైన పుస్తకాలు మూడు ప్రతులను జులై 5 లోగా పంపాలి. అత్యుత్తమ సంపుటికి రూ.10116/- నగదు, జ్ఞాపికతో పురస్కారం ఉంటుంది. చిరునామా: ఓలేటి వెంకటేశ్వర రావు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450. వివరాలకు: 98483 98240.

ఓలేటి వెంకటేశ్వర రావు

వర్తన సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అయిదవ సమావేశం జూన్ 25 సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ సమావేశంలో 'తెలంగాణ నాటకం తీరుతెన్నులు' అనే అంశంపై తాటి కొండాల నరసింహారావు ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'రేపటి మైదానం' కవితా సంపుటి

ఎన్. గోపీ 75వ జన్మదినం సందర్భంగా తాజా కవితాసంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ జూన్ 25 సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో జరుగుతుంది. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు. వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. సభలో రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, సూర్యా ధనంజయ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్. రఘు, వంగల హర్షవర్ధన్ ఎస్. జతిన్ కుమార్, పుప్పాల శ్రీరామ్, జె. నీరజ పాల్గొంటారు.

కుడికాల వంశీధర్

పరిణత వాణి ప్రసంగం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో కవి, అనువాదకులు వై. ముకుంద రామారావు తమ జీవితం సాహిత్యంపై ప్రసంగించే 'పరిణతవాణి' కార్యక్రమం జూన్ 24 సాయంత్రం 5.30 నిమిషాలకు దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తిలక్ రోడ్, హైదరాబాద్‌లో జరుగుతుంది.


జె. చెన్నయ్య

శ్రీనాథ సాహిత్యంపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 113వ సమావేశం అల్లి మోహనరావు అధ్యక్షతన జూన్ 30 ఉదయం 10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో విద్యా నికేతన్ పాఠశాలలో జరుగుతుంది. 'శ్రీనాథ సాహిత్య విహంగ వీక్షణం' అంశంపై నేతేటి గణేశ్వరరావు ముఖ్య ప్రసంగం చేస్తారు.

గార రంగనాథం

సమతావాది కవిత్వోపనిషత్తు



ఈ ఏడు డా. ఎన్ గోపీ గారికి డెబ్బై నాలుగేళ్ళు నిండి డెబ్బై ఐదు వస్తుంది. పదిహేడేళ్ళ ప్రాయంలో తొలి కవిత వ్రాసిన ఈ కవి తన 29వ కవితా సంపుటి ('రేపటి మైదానం') ఆవిష్కరించబోతున్నాడు. జీవితంలో ఇంత కాలం సుసంపన్నమైన కవిత్వం రాయడం పట్ల వర్తమాన భవిష్యత్తరాలు సంభ్రమాశ్చర్యాలతో కళ్ళప్పగించి చూస్తాయనడంలో అతిశయోక్తి లేదు. కవిత్వంతోబాటు విమర్శ, పరిశోధన, అనువాదాలు, యాత్రా చరిత్రలు, పాఠ్యగ్రంథాలు, వ్యాఖ్యానాలు, సభలు, సమావేశాలు- ఒక మానవ మాత్రుడికి ఇంత వ్యాపకం ఎలా సాధ్యపడింది? తెలుగు వచన కవిత్వ చరిత్రలో ఈ సృజనకారుడి స్థానమేమిటి?

ఏ కవైనా తొలినాళ్ళకీ, తదనంతర జీవన దశలకూ ఖచ్చితంగా మార్పు చెందుతాడు. ఒక అరవై ఏళ్ళ గోపీ కవిత్వాన్ని పుస్తకాలవారీ విభజించి చూసినా, అవి ప్రచురించిన కాల ప్రాధాన్యంలో పేర్చినా, మనకు కొంత చిక్కు వచ్చే ప్రమాదమే ఎక్కువ ఉంది. అత్యంత చలన శీలత గలిగిన గోపీ కవిత్వ పరిణామాల్ని ఒక దశకీ, చట్రానికీ లోబడి చూడటం కష్టం. ఏ పుస్తకంలో కవిత ఏలాంటి గొంతుతో పలికింది? ఎటువంటి భావాన్ని ఎంత సాంద్రంగా విప్పి చెప్పింది? అది గోపీ రాసిన ఆయా కాలపు కల్లోలాల్ని, సంఘర్షణని సరిగ్గా ప్రతిబింబించిందా లేదా? వస్తుశిల్పాల సమన్వయం ఎటువంటిది? భాషలో విశేషణాలను ఈ కవి నిజంగానే పరిహరించాడా? వంటి రకరకాల సందేహాలు వస్తాయి. డెబ్బై-ఎనభైల విప్లవ పోరాట ప్రభావం, తదనంతర అస్తిత్వవాద విచారమూ ఈ కవిలో సూచ్యంగా ప్రదర్శిత మైనాయి. గోపీ సాహిత్య స్వభావం వాదాలకు భిన్నంగా స్వతంత్రంగానే ఉన్నది. ఈతని కవిత్వంలో 'ఉద్ధృతమైన' తెలంగాణ ఉద్యమ ధోరణి కన్నా నిలకడగా అక్కడి జీవన రూపం ఎక్కువ ప్రతిబింబించింది. ఉద్రేక పూరితంగా గాక మృదువైన నిరసన కలిగి ఉంది. కవిది స్థూలంగా ఆర్ద్రత నిండిన ఆలోచనాత్మక స్వరం కావటాన ఎక్కువగా ఆ నేలపై జన ధనస్వామ్యాల ప్రభావ (ఉద్యమం వర్సెస్ రాజకీయం) వివరం చెబుతాడు. 'శాపగ్రస్త తెలంగాణ', 'గుర్తుకొస్తున్నారు', 'సమరంలో అమరం', 'సారాంశం', 'నిప్పును లేపకండి' కవితల్లో తెలంగాణ ప్రాంత సంవేదన, సంస్కృతి నిండి ఉంటుంది. 'రండి, రెండు రాష్ట్రాలను ఆశీర్వదిద్దాం, రెంటికీ మధ్య పూలకంచెను నిర్మిద్దాం, ఏం పరవాలేదు' (మరో సంకల్పం) అన్న గోపీ సమతా, సామరస్యవాది.

గోపీ సామాన్య జన జీవన మూలాన్ని 'పల్లెసూక్తం'గా ప్రవచించాడు. సైప్రస్ వెళ్ళినా, నయాగరాలో తడిచినా, 'పల్లె నా జ్ఞాపకాల ముల్లె, ఎప్పటికీ తరగని పరిమళాల మల్లె' అని తన పల్లె మట్టిని కళ్ళకద్దుకున్నాడు. ఏ శక్తీ నిలువరించలేకపోయిన ప్రపంచీకరణ, నగరీకరణ పరిణామ దశల్ని కార్యకారణ సహితంగా గోపీ కవిత్వంలో చూడవచ్చు.

గోపీ కవిత్వ దృక్పథం 'మానవ స్వేచ్ఛా కాంక్ష' కలిగినది. కలిసిన మనుషులూ, తిరిగిన ప్రదేశాల ప్రస్తావన కవితల్లో చాలా ఎక్కువ. ఒక సామాన్యుడు, అందునా మధ్యతరగతి మూలాలున్న పల్లెటూరివాడవటం చేత, మనిషి అంతశ్చేతనపై ఆయా వెలుపలి శక్తుల ప్రమేయాన్ని గోపీ సరిగ్గా పసిగట్టాడు. శ్రీలంక, కాశ్మీరు, లండన్, హైదరాబాద్, ఈశాన్య భారతం వంటి ప్రదేశాలపై రాసిన కవితల్లో అక్కడి మతతత్వ, రాజకీయ, పెట్టుబడిదారీ ప్రతిఫలనాలున్నాయి. ప్రయాణ కవిత్వ పరిశీలనలో కవి ముఖ్యంగా 'సౌందర్యాన్వేషి'. యాత్రా చిత్రణ స్వభావం చాలావరకూ ఆనందకారకమై ఉంటుంది. పర్యటించిన ప్రదేశం అతనిలోకి ప్రవేశించి రాగద్వేషరహితుణ్ణి చేస్తుంది. ప్రదేశాలకు ఉండే ఉదాత్తమైన చారిత్రక ప్రేరణల్ని పాఠకుడు తనలో తానే వెతుక్కునేట్టు చేస్తాడు. కవిత్వానుభవానికీ, సంచార గుణానికీ లంకె వేస్తాడు. కవి చతురతకు ప్రయాణ కవితలు కరదీపికలు.

గోపీ పట్టణ ప్రాంత మధ్యతరగతి జీవన దౌర్బల్యాల్ని వ్యవహార భాషలో కవిత్వీకరించాడు. అతనిలో నిర్వచనాలకి, అనుప్రాసాదులకు ప్రాధాన్యం ఉన్నది. పదవైచిత్రిని మరువలేడు. ఉపమాలోలత్వం జాస్తి. అభివ్యక్తి సుందరి మృదుస్పర్శకి దాసుడు. అతని నాస్టాల్జియాలోని ఉద్వేగానికి కొంత వర్గ లక్షణమూ (వడ్ల గిర్నీ), సామాజిక చైతన్యమూ (మా ఊరి చెరువు, మేస్త్రీ కొడుకు) ఉండటం చేత అవి కేవలం తలపోతగానో వలపోతగానో మాత్రమే మిగిలిపోలేదు. ఆ విలక్షణత వలనే గోపి రచనలు పలు భాషల్లోకి వెళ్ళి ప్రజల ఆమోదం పొందాయి. గోపీ కవితలే కాదు ఎవ్వరి రచనలైనా సామాన్యుడికి చేరడం అన్నింటికన్నా ముఖ్యమైన విజయం. బహుశా 'ప్రజా కవి వేమన' పరిశోధక రచనవల్ల గోపి కవిత్వ దృక్పథం సామాన్యుడి జీవితంలోకి మరింత తొంగి చూడగలిగింది. సామాజిక వ్యవస్థని సూక్ష్మతరంగా పరిశీలించిన వేమన కవిత్వం నీతి ప్రబోధకమైనది. సరళ పద్యరూపంలో ఉన్నది. గోపీ, అదే భావాంశ సమర్థనని, సందేశాత్మక రీతిని (మరీ ముఖ్యంగా నానీలలో), గుణప్రాధాన్యంగా వచన కవిత్వంలో సాధన చేశారు.

కవిత్వానికి కాబట్టని విషయమేలేదన్న గోపీ మాట 'కాదేదీ కవితకనర్హం' అన్న శ్రీశ్రీని జ్ఞాపకానికి తెస్తుంది. అయినప్పటికీ కంటబడిన ప్రతిదాన్నీ కవితామయం చేయడం వైవిధ్యమనిపించుకోదు. కవి నిరంకుశత్వానిక్కూడా కొంత 'అదుపు' (restrain) తప్పనిసరి. ప్రతి కవికీ అనుభూతి అతిరేకత నుంచి తప్పించుకునే ఎగ్జిట్ బోర్డులూ ఉండితీరాలి. పిన్నీసు, అంగి, జల్లెడ, పార, బొంత, చెంబు, టెలిఫోన్, స్కూల్ గంట, నిచ్చెన, అద్దం వంటివాటిపై కవితల్ని చూస్తే గోపీ జీవితంలోంచి కవిత్వాన్ని వేరు చేయలేని మమకారమూ, అశక్తతా ఉన్నాయి. అది బలహీనతగా కొంతమంది, బలముగా మరికొంతమంది నిర్ణయించి ఉన్నారు. రారా తిలక్ భావుకత్వ లక్షణం పట్ల వ్యాఖ్యానిస్తూ కించిత్ ప్రేరణకు కూడా చలించిపోగల సుకుమార హృదయ స్పందన శక్తి అందుకు కారణమంటాడు. పరిణతి చెందిన కవికి తన కవిత్వేతివృత్తం పట్ల ప్రేమాభిమానాలు సరే, సముచిత గౌరవం, పట్టింపూ తప్పనిసరిగా ఉంటాయి. గోపీ అనేక ఉదాత్తమైన కవితా వస్తువులతోబాటు కొన్ని అప్రధాన వస్తువులనూ స్వీకరించారనిపిస్తుంది. అయితే ఎటువంటి వస్తువునైనా గొప్పగా నిర్వహించగల శిల్పచాతుర్యం గోపీ ప్రత్యేకత. అనుభవం అసలు సంపద. వచన కవిత్వానికి సంప్రదాయబద్ధమైన నియమ రాహిత్యాన్ని, వచన కవికి లక్షణ నిర్దేశం లేని సౌలభ్యాన్ని గోపీ చాకచక్యంగా వినియోగించుకున్నారు. అన్నింటికన్నా గోపీ కవిత్వాశయం (main idea) గొప్పదై ఉండటం చేత అతని 'విరివి' సమకాలికుల నుండి నేర్పుగా విడివడి విమర్శను తట్టుకున్నది. లోకజ్ఞత (commonsense), చమత్కృతి (conceit) వలన అత్యంత పాఠకాదరణ చూరగొన్నది.

సినారె కవితా లక్షణాలైన శబ్దప్రేమ, వర్ణనాధిక్యత, భాషా పటిమ, భావ నిగ్రహములలో కొన్ని గోపీ వంటి 'రసరమ్య' కవులక్కూడా అబ్బినాయంటే అతిశయోక్తి కాదు. (స్మృతికవితల్లో మరింతగా) లయను గమనించవచ్చు. గోపీది కూడా తిలక్ వలె కరుణరస ప్రధానమైన కవిత్వమైనప్పటికీ అది కేవలం 'అందమైన కరుణరసం' కాదు. సత్యతగల (verity) కరుణ. అందుకు నేత కార్మికుల వలస దీనత్వాన్ని చిత్రించిన 'ఓ రాజయ్య కథ' (1991) సాక్ష్యము. గోపీ కాళోజీ, బాలగోపాల్, చేరా, వంటి వాళ్ళపై ఎన్నో స్మృతి కవితలు వ్రాసినప్పటికీ వాళ్ళమ్మాయి గురించిన 'మా అమ్మాయి', 'మృత్యు దుఃఖం' కవితలు మనకి ఊపిరాడనివ్వవు. గోపీ కవిత్వం మరింత మానవీకరణ చెందడంలో వాళ్ళమ్మాయి మృతి వేదన (1996), పరితాపము అంతర్లీనంగా ఉన్నాయి. "నరనరాల్లో ప్రసరించే సూదిలాగ, మా అమ్మాయి మరణం బాధారుణ సంగీతంలా తరుముతుంది. చివరి శ్వాస దాకా అదే నా నేపథ్య శృతి" అంటాడు. అతని భరింపరాని వ్యక్తిగత వేదన రస ప్రాధాన్యంగా, విషయ సంగ్రహంగా నిర్మాణాత్మక పద్యంలోకి బదిలీ అవుతుంది. ఉపనిషత్సమానమైన జ్ఞాన సారాంశాన్ని, ఆధునిక జీవన వేద రహస్యాలను వివేకవంతంగా గోపీ కవిత్వీకరించాడు. నానీలు (1997), జలగీతం (2002), వృద్ధోపనిషత్ (2019) ప్రపంచీకరోనా (2020) వంటి కావ్యాలు, కావ్య రూపాలు అందుకే చాలా విజయవంతమైనాయి.

> గోపీ సామాన్య జన జీవన మూలాన్ని 'పల్లెసూక్తం'గా ప్రవచించాడు. సైప్రస్ వెళ్ళినా, నయాగరాలో తడిచినా, 'పల్లె నా జ్ఞాపకాల ముల్లె, ఎప్పటికీ తరగని పరిమళాల మల్లె' అని తన పల్లె మట్టిని కళ్ళకద్దుకున్నాడు. ఏ శక్తీ నిలువరించలేకపోయిన ప్రపంచీకరణ, నగరీకరణ పరిణామ దశల్ని కార్యకారణ సహితంగా గోపీ కవిత్వంలో చూడవచ్చు.


గోపీ కవిత్వం, వినిమయలోకపు విచిత్ర పోకడలతో రాజీలేని సంఘర్షణ పడ్డది. ఈ కవి ప్రతీకల రహస్యాన్ని అనాయాసంగా దొరకబుచ్చుకున్నాడు. గోపీకి బ్లాగ్ లేదు. వెబ్‌సైట్ ఊసూ తెలియదు. కానీ ఆధునిక కవిత్వ మాంత్రికతకి మాత్రం సాఫ్ట్‌వేర్ కనుగొన్నాడు. క్లుప్తతకన్నా అధికంగా ప్రభావశీలతని, గుప్తతని, అంతకుమించి ఆప్తతని పొదవుకుని కవిత్వాన్ని జీవన భాషగా పలికించిన సిద్ధుడు గోపీ. తంగేడుపూలు సంపుటికి ముందుమాట రాస్తూ 'నేను కవిత్వంలో గుణాన్నే కాకుండా, పరిమాణాన్ని కూడా చూస్తాను' అన్నారు కుందుర్తి. ఈ డెబ్బై ఐదేళ్ళ కుర్రాడు పెద్దాయన మాటని మర్చిపోలేదు.


(జూన్ 25 ఎన్. గోపీ 75వ జన్మదినోత్సవం)

శ్రీరామ్ పుప్పాల
99634 82597

ఉద్యమాల భూమిలో యుద్ధగీతిక

ఆధునిక సామాజిక, రాజకీయ ఉద్యమాలను చూస్తే పాట నిర్వహించిన చరిత్రకు ప్రశస్తమైన పాత్ర ఉన్నది. జాతీయోద్యమ కాలాన బంకిం చంద్ర చటోపాధ్యాయ రాసిన 'వందేమాతరం', బంగ్లాదేశ్ ఆవిర్భావంలో టాగూరు రాసిన 'సోనార్ బంగ్లా' పాటలు చారిత్రాత్మకమైన పాత్ర నిర్వహించాయి. సరిగా అదే పరంపరలోనిదే గాయకుడు, కవి అందెశ్రీ రాసిన పాట 'జయ! జయ! జయహే తెలంగాణ!' అన్నది. అది తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా యుద్ధగీతమై నిలిచింది. ఈ నేపథ్యంలో అందెశ్రీ తెలంగాణ సమాజం చవి చూసిన ఉద్యమాల భూమికలో వెలువడిన పాటల సంకలనాన్ని కూర్చి తానే సంపాదకత్వం వహించి నిప్పులవాగు (1940-2014) పేరుతో 1307 పేజీలతో బృహత్తర గ్రంథరాజాన్ని వెలువరించాడు. తెలంగాణ, తెలుగు సాహిత్యచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఈ గ్రంథానికి ముందు మాటలు రాసిన వారిలో ప్రముఖవిమర్శకులు అంబటి సురేంద్రరాజు, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె. శ్రీనివాస్ ఉన్నారు.





తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆధునిక కవితా సంకలనాలు తెలంగాణ నుంచి వెలువడ్డాయి. నిజాం కాలం నాటి తెలంగాణలో గోలకొండ కవుల సంచిక వెలురించి సురవరం ఆనాటి కాలపు పురిటి నొప్పులను గ్రంథస్థం చేస్తే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం చవి చూసిన భిన్న ఆలోచనా స్రవంతులను, వైవిధ్యమైన అభివ్యక్తి రూపాలను, అందులో ప్రచలితమైన ఆశయాలను, ఆదర్శాలను, ఆశ నిరాశ విషాదాలను ఈ సంకలనం నిక్షిప్తం చేసుకున్నది. పాటలు, వచన కవితల ఎంపికలో చరిత్రాత్మక దృష్టి ఉండడం వల్ల ప్రజాస్వామిక స్ఫూర్తి ప్రతిఫలించింది. ఎందుకంటే అమరుల త్యాగాలను కీర్తించే గీతాలతోపాటు ఉద్యమాన్ని, ఉద్యమ నాయకత్వాన్ని విమర్శనాత్మకంగా చూసిన (నెగేషన్ ఆఫ్ నెగేషన్) గీతాలు కూడ ఈ సంకలనంలో ఉన్నాయి. 1940ల నుంచి రాష్ట్రం ఏర్పాటైన కాలం వరకు తెలంగాణ సమాజంలో పరివ్యాప్తమైన పరిస్థితులను, వైరుధ్యాలను తేటతెల్లం చేసే ఈ గ్రంథం పరిశోధకులకు ఒక కరదీపిక.

సాధారణంగా ఉద్యమ కవితా సంకలనాలలో ద్వేషం, కసి, హింసా ధోరణి ఉన్న రచనలు ఉండడం పరిపాటి. కాని అటువంటి పరిమితులను అధిగమించిన సంకలనమిది. దీనికి కారణం సంపాదకుడైన అందెశ్రీ వ్యక్తిత్వమే. జీవితం పట్ల చాలా సానుకూల దృక్పథం ఉన్న ఆయన సంపాదకత్వం వహించడమే. స్త్రీలతో పాటు గిరిజనులు, ఇతర భిన్నమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉన్న సంకలనమిది. గిరిజనులు, ముస్లింలు తెలుగులిపిని తీసుకుని వారి భాషలో రాసిన పాటలను చేర్చడం ద్వారా అందెశ్రీ తెలంగాణ అనేది బహుళ సాహిత్య, భాషా సంప్రదాయాలున్న సమాజమని తేల్చి చెప్పాడు. తెలంగాణ ఘనకీర్తిని, ప్రకృతి, పల్లెల జన జీవిత సౌందర్యాన్ని చిత్రించిన అందెశ్రీ తాత్వికతను అవగాహన చేసుకుంటే బెంగాల్ సమాజంపై అక్కడి ప్రకృతిని, ప్రశస్తిని విశదం చేస్తూ వందలాది పాటలను రాసిన టాగూరు గుర్తుక రాక మానదు.

సామిడి జగన్ రెడ్డి
85006 32551



బియాండ్ లైన్

ఇదిగో.. ఇప్పుడు
ఇక్కడ తేరగా దొరికే సాంగత్యాన్ని
ఎందుకు నిర్లక్ష్యం చేస్తావో తెలియదు.
ఖాళీ పాత్రలను
వెన్నెలో
వెలుగో
చీకటో పూరించినట్టు
వదిలి వెళ్ళిన జీవితాన్ని
మరేదీ పూరించలేదు.

కావాలనే వదులుకుంటాం
పోనీలే..
మరెప్పుడు కలుసుకుందామో
నువ్వే చెప్పు
ఈ సజీవ క్షణం ఇప్పుడే ముగిసిపోయాక..

ఎండి రాలిపోయి పువ్వుల్ని
కుప్పగా పోసి
నిప్పంటించాక
వాటి పరిమళాలను
ఎవరు తలపోసుకుంటారు
పూల పుట్టుక వనానికి కొత్తేం కాదుకదా..
కాకపోతే పోయిన వాటి లెక్కలే తేల్చమంటాను.

ఇద్దరం
ఒకే కాలరేఖపై నడయాడినా
మనల్ని కలిపే సరళరేఖనే గీసుకోలేకపోయాం
నీలిసముద్రపు తీరంలో
నాకైతే కొన్ని రంగుల గవ్వలు శంఖాలు దొరికాయి
మరి నీవేమి పొందావో నాకు తెలియదు కదా.

నా అరణ్యపు దారిలో
కొంత ఎండ పొడ, పేరు తెలియని చెట్లూ పూలు
లోతు ఎరుగని కొండవాగులు
రెల్లుపూల వసంత కాలాలు
నీడలుగా విస్తరించిన శ్రావణ మేఘాలు
ఉదయసంధ్యల శుకపికాల శ్రావ్యపేయ రాగాలు

కొన్ని మధూదయాలు
అరుదుగా కనిపించిన మహోదయాలు
నేను వేణువవుతాను
నువ్వు విను. లేదూ..
పిట్ట గొంతుగా నువ్వు పాడు
నేను నీలో వాయులీనమవుతాను

మణీందర్ గరికపాటి
99483 26270

మరాఠీ రంగస్థలంపై యువతరం బావుటా

ఇటీవల పూణేలో - మరాఠీ నాటక రంగంలో విశేషమైన విధులను నిర్వహిస్తూన్న రాజేంద్ర ఠాకుర్‌దేశాయ్‌ని కలుసుకొని చర్చించే అవకాశం ఈ వ్యాసకర్తకు లభించింది. రాజేంద్ర ఠాకుర్ దేశాయ్ ఒక బిజీ లాయర్. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా అనుభవం ఉన్నవాడు. ప్రస్తుతం 'మహారాష్ట్రీయ కళోపాసక్' సంస్థకు కార్యదర్శిగా ఉన్నారు. ఈ సంస్థ గత అరవై ఏళ్లుగా 'పురుషోత్తం కరండక్' పేరుతో ప్రతీ ఏటా మహారాష్ట్ర లోని కాలేజీ విద్యార్థులకై ఏకాంకిక నాటికల పోటీని నిర్వహిస్తున్నది. ఆనాటి సంభాషణలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

తెలుగులో మాదిరిగానే మరాఠీ నాటకరంగం కూడా జానపద, పౌరాణిక, సాంఘిక, ఆధునిక, ప్రయోగాత్మక దశల వెంబడే ప్రయాణించింది. అయితే మరాఠీ నాటకరంగానికి కొన్ని నిర్దిష్టతలు ఉన్నాయి.

మరాఠీ నాటకరంగపు మూల శక్తి గ్రామీణ, జానపద రీతుల్లోనూ, మరాఠీలంతా గర్వపడే చారిత్రక గాథల్లోనూ దాగి ఉన్నది. ఇందుకు మంచి ఉదాహరణలు - నేటికీ ఆబాలగోపాలాన్ని అలరించే శివాజీ సాహసగాథలు, పీష్వాల కాలంలో దేశంలోని అత్యధిక ప్రాంతాలకు విస్తరించిన మరాఠా సామ్రాజ్యం, మొఘల్ సామ్రాజ్యంపై విజయాలు, బ్రిటిష్‌వారితో ఓటమి మిగిల్చిన విషాదం - ఇవన్నీ తరతరాల మరాఠీ పండిత, పామర జనాల హృదిలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఇవన్నీ కూడా కళాకారులకు ముడిసరుకుగా మారి, జానపద కళారూపాల్లోనూ, నాటకాల్లోనూ నేటికీ ప్రతిఫలిస్తూనే ఉన్నాయి.

జానపద, పౌరాణిక మూలాల నుండి ఆధునికత వైపు మళ్లుతూన్న దశలో గుజరాతీ, పార్శీ నాటకాల ప్రభావం మరాఠీ నాటకంపై పడింది. అంతకన్నా బలంగా, నిలకడగా, మరాఠీ నాటకాన్ని ప్రభావితం చేసినవి పాశ్చాత్య నాటకాలు. ముఖ్యంగా షేక్‌స్పియర్, మొలియర్, ఇబ్సెన్, చెఖోవ్‌ల నాటకాలు; ఆ మాటకొస్తే ఉత్తమ ప్రపంచ సాహిత్యం మరాఠీ నాటక రచయితలను ఉత్తేజపరచింది. బెంగాల్‌లో కూడా, కలకత్తా కేంద్రంగా ఇదే జరిగిందని కొంతమంది మిత్రులు చెప్పారు.

ప్రభావాలు, ప్రేరణలు ఎన్ని ఉన్నప్పటికీ మరాఠీ నాటకాలేవీ తమ స్థానికతను, విశిష్టతను పోగొట్టుకోలేదనే చెప్పాలి. అదే సమయంలో సాహసోపేతమైన ప్రయోగాలు చెయ్యడంలో, గతకాలపు గాథలకు ఆధునిక వ్యాఖ్యానాలను అందివ్వడంలో మరాఠీ నాటక రచయితలు ముందున్నారు.



> ప్రభావాలు, ప్రేరణలు ఎన్ని ఉన్నప్పటికీ మరాఠీ నాటకాలేవీ తమ స్థానికతను, విశిష్టతను పోగొట్టుకోలేదు. అదే సమయంలో సాహసోపేతమైన ప్రయోగాలు చెయ్యడంలో, గతకాలపు గాథలకు ఆధునిక వ్యాఖ్యానాలను అందివ్వడంలో మరాఠీ నాటక రచయితలు ముందున్నారు.

ఒక వైపు జానపద కళారీతులు, మరోవైపు శాస్త్రీయ సంగీత గాయకులు, వాద్యకారులు మరాఠీ నాటకపు జీవధారలుగా కొనసాగుతున్నారు. సంగీతం వారి నాటకాలలో విడదీయలేని పాయగా పెనవేసుకుపోయింది. ముఖ్యంగా నేపథ్య సంగీతం సృష్టించే ఉద్వేగాల్ని వినియోగించుకుంటూ నాటకీయతను ఉన్నతీకరించడంలో మరాఠీ దర్శకులు సిద్ధహస్తులు. నాటకాన్ని ప్రదర్శించేటప్పుడల్లా మెరుగుపరచవచ్చు; స్థలకాలాలకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చు. ఈ ఎరుకతో మరాఠీ దర్శకులు ప్రతీ ప్రదర్శననీ నిత్యనూతనంగా ఆవిష్కరిస్తారు.

ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతూన్న మరాఠీ నాటకరంగ కృషి, రసజ్ఞులూ విజ్ఞులూ అయిన ప్రేక్షక సమూహాలను పోగు చేసుకున్నది. అయితే అటువంటి ప్రేక్షకులు ఆశించే ప్రమాణాలు చాలా ఉన్నత స్థాయిలో ఉంటాయి. ప్రేక్షకుల ఆకాంక్షలను చేరుకో వడమే కాకుండా ఎప్పటికప్పుడు వాటిని అధిగమించడం మరాఠీ నాటకరంగం నిరంతరంగా ఎదుర్కొనే సవాలు.



మహారాష్ట్రీయ కళోపాసక్ సంస్థ కార్యదర్శి రాజేంద్ర ఠాకుర్‌దేశాయ్ (కుడివైపు) తో వ్యాస రచయిత

బాలీవుడ్, టీవీ సీరియళ్ల ఆకర్షణ మూలంగా మరాఠీ నాటకరంగం నష్టపోతూ వస్తూన్నదనే చెప్పాలి. అయితే బాలీవుడ్ మూలంగా కొంత మంచి కూడా జరిగింది. వాద్యకారులు, ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉంటారు. నాటకరంగ నేపథ్యంతో ఎదిగిన సినీ ప్రముఖులు కొందరు నాటక ప్రదర్శనలు ఇస్తూ, తమ మూలాల ఋణాన్ని తీర్చుకుంటున్నారు.

'మహారాష్ట్రీయ కళోపాసక్' సంస్థ తరఫున అరవై ఏళ్లుగా కాలేజీ విద్యార్థులకై నిర్వహిస్తున్న ఏకాంకిక నాటికల పోటీ 'పురుషోత్తం కరండక్'. ఈ పోటీల మొదటి రౌండ్లు రాష్ట్రంలోని ఐదు పట్టణాల్లో (రత్నగిరి, పూణె, కొల్హాపూర్, నాగపూర్/ అమరావతి, ఔరంగాబాద్/ జల్‌గావ్) నిర్వహించబడతాయి. అక్కడి విజేతలు పూణేలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారు. ప్రతి ఏటా ఒకే ఆడిటోరియంలో ఫైనల్స్ జరుగుతాయి (భరత్ నాట్య మందిర్, సదాశివ్ పేట్, పూణే). మహారాష్ట్రలోని నాలుగు పట్టణాలలో జరిగే పోటీలు, అలాగే పూణేలో జరిగే ఫైనల్స్ - వీటి తేదీలను ముందుగానే ప్రకటిస్తారు గనుక ఆయా విద్యార్థులు, కాలేజీలు ఏర్పాట్లు చేసుకుంటారు. ఫైనల్స్‌కి చేరుకోవడమే వారికొక ఘన విజయం. ప్రతీ ఏడూ జరిగే ఈ ఫైనల్స్‌ని చూడడానికి ప్రేక్షకులు ముందుగానే టిక్కెట్టు కొనుక్కొని సీట్లు రిజర్వ్ చేసుకుంటారు. మీడియాతో సహా అందరూ ఉత్సుకతతో ఈ ప్రదర్శనలకై ఎదురుచూస్తూంటారు. ఈ పోటీల్లో నగదు బహుమతి కేవలం ఐదువేల రూపాయిలు మాత్రమే. కానీ యువ కళాకారులకు లభించే గుర్తింపు అద్వితీయం. గతంలో పురుషోత్తం కరండక్ బహుమతులను గెల్చుకున్నవారు చాలామంది ఇప్పుడు ఉన్నతస్థాయికి చేరుకున్నారు. మహారాష్ట్రలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన వాళ్లల్లో రోహిణీ హత్తంగడి, జబ్బార్ పటేల్, మోహన్ అగాషి వంటి వారు అనేకులు ఉన్నారు.

ప్రభుత్వ విభాగాల, రాజకీయ నాయకుల జోక్యం లేకుండా తమ కార్యకలాపాలను నిర్వహించుకోవాలనేది ఈ సంస్థ కఠిన నియమం. ముగ్గురు కార్యవర్గ సభ్యులు, న్యాయ నిర్ణేతలకు తప్ప వేరెవ్వరికీ ఉచిత ప్రవేశం ఉండదు. వారి కుటుంబ సభ్యులెవరైనా నాటకాలు (ఫైనల్స్) చూడాలనుకుంటే ముందుగా టిక్కెట్లు కొనుక్కోవాల్సిందే. ఎంత పెద్ద అధికారులకైనా రాజకీయ నాయకులకైనా పాస్‌లు ఇచ్చే ప్రసక్తి లేదు. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల నుండి విరాళాలు స్వీకరించే సంప్రదాయం లేదు. స్పాన్సర్‌షిప్‌లకు, వాణిజ్య ప్రకటనలకు ఆమోదం లేదు. రెండు మూడు వారాల ముందుగానే టిక్కెట్లన్నీ అమ్ముడు పోతాయి. మూడవ గంట మ్రోగాక ద్వారాలు మూసేస్తారు. ఏ ఒక్కరికీ ప్రవేశం ఉండబోదు.

కళ నిలద్రొక్కుకోవాలన్నా, వృద్ధిచెందాలన్నా విమర్శ అత్యవసరం. అదృష్టవశాత్తూ మరాఠీ నాటకాలను నిర్మొహమాటంగా విమర్శించే నిష్ణాతులున్నారు. వాళ్ల అభిప్రాయాలకై ఆసక్తిగా ఎదురుచూసే కళాకారులు, దర్శకులు, ప్రేక్షకులు ఉన్నారు. విమర్శలను సహృదయంతో స్వీకరించే సంప్రదాయం ఉంది. అరవై ఏళ్లపాటు అవిరామంగా ఈ పోటీలను ఉన్నత ప్రమాణాలతో, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం సామాన్యమైన విషయం కాదు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల మధ్య, భాషలమధ్య సాంస్కృతిక రంగంలో ఇచ్చిపుచ్చుకోవడాలూ, ఒకరినుండి ఒకరు నేర్చుకోవడం కొనసాగుతూనే ఉండాలి అని బలంగా అనిపించింది. ముఖ్యంగా మరాఠీ, తెలుగు నాటకరంగాల అన్యోన్యత ఈ నాటిది కాదు. 'ధార్వాడు నాటక సమాజం' వారి ప్రదర్శనలు ఆధునిక తెలుగు నాటకరంగానికి అందించిన ప్రేరణతో కందుకూరి వీరేశలింగం, 1880లో మొదటి తెలుగు నాటక ప్రదర్శన చేబట్టారు. మహారాష్ట్ర నుంచి వలస తోలు బొమ్మలాట కళాకారులు, కడప పట్టణానికి సమీపాన ఉన్న సురభి గ్రామానికి వలస వచ్చి, స్థానిక జమీందారు ఆదరణతో 'కీచకవధ'ని నాటకరూపంలో తొలుత 1885లో ప్రదర్శించారట. ఊరూరా తిరుగుతూ, 'ప్రేక్షకుల వద్దకే ప్రదర్శన'ను తీసికెళ్లే ధార్వాడు కంపెనీ సంప్రదాయాన్ని సురభి నాటక సంస్థ అనుసరించింది. ఆ విధంగా వారి ప్రాభవం తెలుగు రాష్ట్రాల నలుచెరగులనూ చేరుకుంది.

'మహారాష్ట్రీయ కళోపాసక్' వంటి స్వచ్ఛంద సంస్థలు మనకి లేకపోలేదు. అజో-విభో-కందాళం సంస్థను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే, యువతరానికై ప్రత్యేకించిన 'పురుషోత్తం కరండక్' స్థాయి పోటీలు లేవు. మనకి నాటకరంగం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులు అనేకులున్నారు. వాళ్లు పూనుకుంటే, మహారాష్ట్రలో సాధ్యమైన విజయాన్ని మనం కూడా ఒక రోజున కళ్లారా చూడగలం. ఏదైన మన దృష్టిని, వనరులను యువతరంపైనే కేంద్రీకరించాలి. వాళ్లే మన ఆశాజ్యోతులు.

(ఈ సంభాషణను 2024, మే 12న పూణేలో స్థానిక సాహిత్యాభిమాని మండపాక లింగమూర్తి నిర్వహించారు.)

ఉణుదుర్తి సుధాకర్
90006 01068





తడిసిన నగరం

2 గంటలపాటు కురిసిన వర్షం

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో ఉన్న నగరం ఒక్కసారిగా చల్లబడింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వర్షం దంచి కొట్టింది. నగరం తడిసి ముద్దయింది. ఈ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. జిల్లావ్యాప్తంగా వాతావరణంలో మార్పులు వచ్చినా విజయవాడలో మాత్రమే వర్షం కురిసింది. - విజయవాడ



అమరావతి రాజధాని రైతులు ఆదివారం కనకదుర్గమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. రాజధాని రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో కాలినడకన ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. తుళ్లూరు నుంచి మహిళలు పొంగళ్లను నెత్తిన పెట్టుకుని వచ్చారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలన్న తమ కోరికను కనకదుర్గమ్మ నెరవేర్చిందని, అందుకే మొక్కులు చెల్లించుకున్నామన్నారు.

మొక్కు తీరింది..



దుర్గమ్మకు మొక్కు తీర్చుకునేందుకు కాలినడకన వెళుతున్న అమరావతి రైతులు

ఘన కార్యాలయాలు

సామాన్యుడు వంద గజాల్లో చిన్న ఇల్లు నిర్మించుకోవాలంటే బిల్డింగ్ ప్లాన్ అనుమతి కోసం నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అనుమతి వచ్చిన తర్వాతే భవన నిర్మాణం చేపట్టాలి. ఇదీ నిబంధన. కానీ, ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ పెత్తందారులకు ఈ నిబంధనలేవీ వర్తించవు. అసలు తామేంటీ.. భవన నిర్మాణాలకు అనుమతి తీసుకోవడమేంటీ.. అనే రీతిలో వైసీపీ పెత్తందారులు వ్యవహరిస్తుంటారు. వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని కానీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు కానీ ఈ పెత్తందారీ పోకడలతోనే వ్యవహరిస్తారు. వీరి ప్రవర్తనతో ఇప్పుడు విజయవాడ, మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయాలు అనధికార కట్టడాలుగా మిగిలిపోనున్నాయి. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అనుమతుల్లేకుండా వైసీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా కార్యాలయ నిర్మాణాలు

- విజయవాడలో 1850 గజాలు కేటాయింపు
- రూ.20 కోట్ల విలువైన స్థలం సమర్పయామి
- ఏడాదికి రూ.400 చెల్లించేలా 33 ఏళ్లకు లీజు
- మచిలీపట్నం నడిబొడ్డున రెండెకరాలు కేటాయింపు
- ఏడాదికి రూ.12 వేల చొప్పున 33 ఏళ్లకు లీజు
- అనుమతుల్లేకుండానే నిర్మాణ పనులు

బందరులోని వైసీపీ కార్యాలయం



తాడేపల్లి ప్యాలెస్‌ను పోలి వైసీపీ కార్యాలయం నిర్మాణం

కృష్ణాజిల్లా వైసీపీ కార్యాలయం కోసం మచిలీపట్నం నడిబొడ్డున గజం రూ.40 వేలు పలికే ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈడేపల్లిలో జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఈ ఖరీదైన స్థలం లీజు ఎంతో తెలుసా? రెండు ఎకరాలకు నెలకు రూ.1,000. అంటే ఏడాదికి రూ.12 వేలు లీజు చెల్లిస్తారన్నమాట. ఇలా 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. పోనీ ఇంత తక్కువకు లీజుకు తీసుకున్న పెద్దమనుషులు ఆ స్థలంలో కట్టే భవనానికైనా నిర్ణీత రుసుం చెల్లించారా అంటే అదీ లేదు. ఐదేళ్లుగా అసలు మమ్మల్ని అడిగేదెవరూ అనే రీతిలో వ్యవహరించిన వైసీపీ నాయకులు ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు లేకుండానే ఆ స్థలంలో ఆగమేఘాలపై ఇంద్రభవనం లాంటి వైసీపీ కార్యాలయాన్ని నిర్మించేశారు. ఈ భవనం తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌ను పోలి ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయాలన్నీ దాదాపు ఇలానే ఉండటం గమనార్హం. వాస్తవానికి జిల్లా పార్టీ కార్యాలయానికి వెయ్యి గజాల స్థలమే ఎక్కువ. అలాంటిది రెండు ఎకరాల ఖరీదైన స్థలం కేటాయించడం ఏమిటన్న విమర్శలు తొలి నుంచీ ఉన్నాయి. తాజాగా అసలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీఎత్తున భవన నిర్మాణం చేయడం ఏమిటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

రంగా పార్కు నిర్మాణాన్ని కాదని..

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయం కోసం విజయవాడలోని విద్యాధరపురం సితారా జంక్షన్ సమీపంలో గజం లక్ష రూపాయలు పలికే స్థలాన్ని కేటాయించారు. సుమారు 1850 చదరపు గజాల స్థలాన్ని కేటాయంచడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. సుమారు రూ.20 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఏడాదికి కేవలం రూ.400 లీజు ప్రాతిపదికన 33 ఏళ్లకు కేటాయిస్తూ 2022, డిసెంబరు 20న గుట్టుచప్పుడు కాకుండా జీవో నెంబరు 2418ను విడుదల చేశారు. ప్రస్తుతం ఇక్కడ సెల్లార్ శ్లాబ్ పూర్తయింది. ఈ భవనానికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేసేస్తున్నారు. వాస్తవానికి ఈ స్థలంలో రంగా పార్కు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కాపు సంఘాల నాయకులు కోరుతున్నారు. ఆ డిమాండ్‌ను కాదని అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆ స్థలాన్ని పార్టీ కార్యాలయానికి కేటాయించేలా చక్రం తిప్పారు. దీనిపై కాపు సంఘాలు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వంగవీటి మోహనరంగా పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విజయవాడలో నిర్మాణంలో వైసీపీ కార్యాలయం



మరో 9 మందికి..

జగ్గయ్యపేటలో ఆగని డయేరియా కేసులు

జగ్గయ్యపేట, జూన్ 23 : జగ్గయ్యపేటలో ఆదివారం కొత్తగా 9 మంది డయేరియా లక్షణాలు ఆస్పత్రిలో చేరారు. వీరిలో ఆదివారం ఉదయం ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విజయవాడకు తరలించారు. పట్టణంలో మంగలి బజార్‌కు చెందిన సయ్యద్ జాన్‌బాషా (24), కాకానినగర్‌కు చెందిన టి.సాత్విక్ (9), డాంగేనగర్‌కు చెందిన ఎం.నాగేశ్వరరావు (41), అమ్మాణి కాలేజీ రోడ్డుకు చెందిన కే.ధనుష్ (10), మిట్టగూడేనికి చెందిన వి.నరసమ్మ (45), కాకానినగర్‌కు చెందిన తల్లి కొడుకులు అన్నపూర్ణ, వేణు గోపాల్‌రెడ్డి, వత్సవాయి మండలం భీమవరానికి చెందిన సీహెచ్ దాసయ్య (43), దేచుపాలేనికి చెందిన ఉదయభార్గవ్ (11) డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్న వత్సవాయికి చెందిన నాగేశ్వరరావు (70), చిల్లకల్లుకు చెందిన బి.హసిని (9)లకు విరేచనాలు అదుపులోకి కాకపోవడంతో విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిని డిశ్చార్జ్ చేశారు. చిల్లకల్లు, మక్కపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక డయేరియా వైద్య శిబిరాల నుంచి ఆదివారం ఒక్క కేసు కూడా రిఫర్ కాలేదని డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని తెలిపారు. జగ్గయ్యపేటలో కేసులు జీరో అయ్యే వరకు ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తానని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 38 మంది ఇన్‌పేషంట్లుగా ఉండి చికిత్స పొందుతున్నారు.



జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

నందిగం సురేష్ సోదరుడి కొడుకుపై కేసు నమోదు

- అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం

విజయవాడ (విద్యాధరపురం), జూన్ 23 : గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెం నుంచి విజయవాడలోని భవానీపురానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడి కుమారుడు మణికంఠ, కనకమహాలక్ష్మి కాటా యజమాని చక్రవర్తి, టిప్పర్ డ్రైవర్ రాంబాబుపై ఆదివారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఉద్దండరాయునిపాలెం నుంచి భవానీపురం బైపాస్ రోడ్డు పక్కన మణికంఠ నిర్వహిస్తున్న స్టాండ్ వద్దకు ఎనిమిది ఇసుక లారీలు వచ్చాయి. విషయం తెలుసుకున్న భవానీపురానికి చెందిన తెలుగు యువత నాయకుడు చరణ్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆ తరువాత పోలీసులు, చరణ్, అతని స్నేహితులు లారీలను వెంబడించారు. పోలీసుల రాకతో ఇసుక లోడుతో ఉన్న ఏడు లారీలు వేగంగా వెళ్లిపోయాయి. ఒక లారీ మాత్రం సితార థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయడం గమనించిన పోలీసులు అక్కడికి వెళ్లి డ్రైవర్ రాంబాబును అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మణికంఠ, చక్రవర్తి, రాంబాబుపై కేసు నమోదు చేశారు.

డయేరియాను కట్టడి చేయండి

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు

గ్రామాల సందర్శన, బాధితులకు పరామర్శ

4లో..



రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు 4లో..

దుర్గమ్మను దర్శించుకున్న శాసనసభ స్పీకర్

కబ్జాకాండ!

రూ.100 కోట్ల భూమి వైసీపీ నేతల ఆక్రమణ

కుష్టు వ్యాధిగ్రస్థుల హాస్పిటల్ స్థలం కబ్జా



కబ్జాకు గురైన స్థలం ఇదే

కుష్టు వ్యాధిగ్రస్తుల వైద్యసేవలకు దాతలు ఇచ్చిన స్థలాన్ని కూడా వైసీపీ నాయకులు వదల్లేదు. అధికారం పోయినా అక్రమాలు ఆపటం లేదు. గన్నవరంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి అభిముఖంగా, 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16) సమీపంలో రూ.100 కోట్లు పలికే 11 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్థానిక వైసీపీ నేత కనుసన్నల్లో ఓ బడాబాబు ఏకంగా పెట్రోల్ బంకు నిర్మాణానికి ఉపక్రమించాడు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. ఈ కబ్జాకాండలో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఆక్రమణలను అడ్డుకుని, నిర్మాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు.

- అధికారుల సహకారంతోనే అక్రమం
- వైసీపీ నాయకుడి కనుసన్నల్లో ఓ బిగ్‌షాట్ ఆక్రమణ
- లెప్రసీ స్థలంలో పెట్రోల్ బంక్ పనులు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తుల వైద్యశాఖ, వారి సేవార్థం 1936లో మీర్జాపురం జమీందారు 11 ఎకరాల భూమిని దానంగా నాటి బ్రిటీష ప్రభుత్వానికి ఇచ్చారు. ఈ భూమిలో నాటి బ్రిటీష ప్రభుత్వం లెప్రసీ వైద్యశాలను కూడా నిర్మించింది. ఈ వైద్యశాలను 1939లో ప్రారంభించారు. కాలక్రమంలో లెప్రసీ హాస్పిటల్ మూత పడింది. అప్పటి నుంచి ఈ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. గతంలో కూడా పలువురు ఈ భూములను ఆక్రమించే ప్రయత్నం చేశారు. అప్పట్లో మీర్జాపురం జమీందారు ఇచ్చిన భూముల్లో ఎకరం భూమిని లెప్రసీ కాలనీకి కేటాయించారు. మిగిలిన భూమిని వైద్యశాల, ఇతర అవసరాల కోసం నిర్మించారు.

● ఆక్రమణకు ప్రయత్నాలు

90వ దశకంలో ఈ భూములను అక్రమించేందుకు కొందరు ప్రయత్నించగా బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. 90వ దశకం నుంచి ఈ లెప్రసీ వైద్యశాల మూత పడింది. లెప్రసీ కాలనీ అయితే ఆ తర్వాత ఓ అర దశాబ్దంపాటు కొనసాగింది. కాలక్రమంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి చెందటం, ఐటీ పార్కులు చుట్టుపక్కల ఏర్పడటంతో కేసరపల్లికి అనూహ్యంగా డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు మేథ ఐటీ పార్క్, హెచ్‌సీఎల్ వంటి వాటితో కేసరపల్లిలో భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు ఈ భూముల ధర రూ.100 కోట్లు ఉంటుంది. దీంతో ఇక్కడి భూములపై మళ్లీ అక్రమార్కుల కన్ను పడింది. గతంలో ఇదే ప్రాంతం దగ్గర్లో పులికుంటను కూడా ఆక్రమించుకున్నారు. పొజిషన్ పట్టాలు ఇచ్చేందుకు గన్నవరం రెవెన్యూ అధికారుల సహకారంతో పెద్ద స్కెచ్ వేశారు. ఈ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటకు తీయటంతో ఆగిపోయింది. ఇప్పటికీ పులికుంటను సాగుదారులకు పట్టాలు ఇప్పించి వారి నుంచి కొనుగోలు చేసేందుకు బడా బిల్డర్ సిద్ధంగా ఉన్నాడు. ఇదే కోవలో వైసీపీ నేత అండతో.. సరిగ్గా ఎన్నికలకు ముందే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు వ్యూహం పన్నారు.

● పెట్రోల్ బంకు నిర్మాణానికి యత్నం

కబ్జాను అధికారికం చేసుకునేందుకు రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. రికార్డుల ట్యాంపరింగ్‌తో దొంగ పట్టాలను సృష్టించినట్టు తెలిసింది. వీటి అండతో.. ఓ బిగ్‌షాట్ ఇక్కడ పెట్రోల్ బంకును నిర్మించేందుకు సన్నద్ధమయ్యాడు. ఈ వివాదాస్పద స్థలంలో పెట్రోల్ బంకుకు అనుమతులు ఎలా వచ్చాయన్నది పెద్ద మిస్టరీగా ఉంది. పెట్రల్ బంకు నిర్మాణం కోసం ముందుగా.. ఆ స్థలంలో నీటి అవసరాల కోసం బోర్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. ఇంత దర్జాగా పనులు జరుగుతున్నా.. ఎవరూ నోరు మెదపటం లేదు. ఈ కబ్జాపై వల్లూరు చక్రవర్తి అనేక స్థానికుడు తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదు. వారం రోజులుగా రెవెన్యూ అధికారులు తూతూ మంత్రపు చర్యలే చేపడుతున్నారు. ఈ భూములకు సంబంధించిన డేటాను తగులబెట్టేయడం మరో సంచలనానికి దారి తీస్తోంది. దీనికి సంబంధించిన రికార్డులను ఎప్పుడు తగల బెట్టారన్నది తేలాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాలయం పరిధిలో రికార్డులను తగులబెట్టినప్పటికీ ఈ రికార్డులను సెటిల్‌మెంట్ రిజిస్టర్ కార్యాలయంలో పొందవచ్చు. కాబట్టి ఈ వ్యవహారంలో అసలు దొంగలెవరో తేలుతుంది. కృష్ణాజిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై తక్షణం విచారణ ప్రారంభించాల్సి ఉంది.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి

- రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం

గన్నవరం : గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న రూ.100 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణలను అడ్డుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రెవెన్యూ అధికారులను ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దారు కనుసన్నల్లో ఈ అక్రమణ జరిగినట్టు ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువెళ్లడంతో స్పందించిన యార్లగడ్డ ఆక్రమణలను అడ్డుకుని నిర్మాణ పనులను ఆపాలని ఆదేశించారు.



స్పీకర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న శాసనసభ స్పీకర్

వన్‌టౌన్, జూన్ 23 : రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం చింతకాయల అయ్యన్నపాత్రుడు తొలిసారిగా కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈవో కేఎస్ రామారావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అయ్యన్నపాత్రుడు ఆయన కుటుంబసభ్యులకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శశానంద దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావుఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించగా.. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సీఎస్ నీరబ్



విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక అర్చనలు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేయగా ఈవో రామారావు నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులకు దుర్గమ్మ శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రావణకుమార్

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనార్థం ఆదివారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్ విచ్చేశారు. అర్చకులు, ఈవో కేఎస్ రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం ఆయనకు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

పశ్చిమ గోదావరి జిల్లా భీమవంలోని జేపీ రోడ్డుకు చెందిన డాక్టర్ శ్రీవాసుదేవ చక్రవర్తి ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి ఏఈవో రమేశ్‌కు చెక్కు రూపంలో రూ.1,01,116 విరాళాన్ని డాక్టర్ వెంకటపతిరాజు పేరిట అన్నవితరణ జరిపేందుకు విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాత కుటుంబానికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా అధికారులు వారికి దుర్గమ్మ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

ఆదివారం నాడు అర్చక బృందం అరుణపారాయణం నిర్వహించింది. సమస్త జనులకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని సంకల్పిస్తూ సూర్యనారాయణమూర్తికి అర్చనలు నిర్వహించారు. అనంతరం తర్పణం సమర్పించారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు దుర్గమ్మ దర్శనార్థం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం దుర్గగుడిలో ధర్మపథం వేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.కుమారి ఆధ్వర్యంలోని శ్రావణి నృత్య కళానిలయ కళాకారుల బృందం కూచిపూడి నృత్యప్రదర్శన చేసి భక్తుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఐదు కీర్తనలకు కళాకారులు అభినయ కౌశలాన్ని ప్రదర్శించారు.



వెంకయ్యనాయుడుతో ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ



వన్‌టౌన్, జూన్ 23 : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఆదివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మర్యాదపూర్వకంగా కలిసారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఢిల్లీ వెళ్లిన చిన్ని వెంకయ్యనాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శివనాథ్‌ను వెంకయ్యనాయుడు అభినందించారు. రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించడంతో పాటు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టే విషయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై వెంకయ్య నుంచి శివనాథ్ సూచనలు పొందారు.

రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు



శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరాలయంలో క్రీ.శ. మూడో శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్లను ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఈ జిల్లాలో వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలన్న అవగాహన కార్యక్రమంలో ఆదివారం ఆయన రామతీర్థంలో పర్యటించారు. ఆలయం వెనుక వైపున ఉన్న శివలింగాల మధ్య పల్నాటి సున్నపురాతి బౌద్ధ స్తంభాన్ని, దానిపై అర్ధచంద్రకార పద్మాన్ని కనుగొన్నారు. ఈ శిల్పం ఇక్ష్వాకుల కాలం నాటిదని గుర్తించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ, వేంగ చాళుక్యుల కాలంలో ఈ స్తంభాన్ని బ్రహ్మసూత్రాలు చెక్కి, శివలింగంగా మార్చి బిగించారని పేర్కొన్నారు. మరో రెండు శివలింగాలు, క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన వీరభద్ర విగ్రహం నిరాదరణకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఉద్యోగుల సత్కారం

వన్‌టౌన్, జూన్ 23 : రవాణా శాఖ మంత్రిగా ఆదివారం సచివాలయంలోని 4వ బ్లాకులో బాధ్యతలు స్వీకరించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ (ఎన్ఎంయూ) అసోసియేషన్ ప్రతినిధులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ఎన్.వి రమణ, కోశాధికారి పి.వి మోహన్, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, మహిళా కార్యదర్శులు సుజాత, భద్రావతి పాల్గొన్నారు.

డయేరియాను కట్టడి చేయండి

- అధికారులతో మంత్రి సత్యకుమార్
- గ్రామాల సందర్శన, బాధితులకు పరామర్శ



ప్రభుత్వాసుపత్రిలో డయేరియా వార్డును పరిశీలించిన ఎంపీ కార్యాలయ ఓఎస్డీ తదితరులు

వత్సవాయి, జూన్ 23 : జగ్గయ్యపేటలో డయేరియా ప్రబలిన మక్కపేట గ్రామాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డయేరియా రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో డయేరియా అదుపు చేసేందుకు పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మండల పరిధిలో 10 మంది వ్యాధి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారని వీరందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు జగ్గయ్యపేట తరలించినట్లు స్థానిక వైద్యులు మంత్రికి వివరించారు. ఆయన వెంట హెల్త్ కమిషనర్ ఎంటీ కృష్ణబాబు, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, సర్పంచ్ మల్లెల శివ ప్రసాద్, మెడికల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

రోజు రోజుకు డయేరియా వ్యాధిగ్రస్థుల సంఖ్య నమోదు కావడంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. పారిశుధ్య పనులతో పాటు తాగునీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. సీహెచ్‌వో మల్లికార్జున్, ఎంపీహెచ్‌వో ఉషారాణి ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక శిబిరంలో వైద్యులు నాగమణి, హర్షిత, సీతారావమ్మ, అలేఖ్యలు రోగులకు సేవలందిస్తున్నారు.

బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎంపీ చిన్ని ఆరా

వన్‌టౌన్ : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగుల ఆరోగ్య పరిస్థితి గురించి ఢిల్లీలో ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆదివారం ఆరా తీశారు. రోగులకు ఎటువంటి సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నయో తనకు తెలియజేయాలని ఓఎస్డీని ఆదేశించారు. ఈ మేరకు ఓఎస్డీతో పాటు కార్యాలయ సిబ్బంది రోగులు చికిత్స పొందుతున్న ప్రత్యేక వార్డును సందర్శించి వివరాలు సేకరించారు. వార్డులో 31 బెడ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 24 గంటలు ఆక్సిజన్ అందుబాటులో ఉందని శ్రీనివాసరావు వెల్లడించారు. పరిస్థితులను బట్టి అదనపు బెడ్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 24 గంటల పాటు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ముగ్గురు డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిసరాల పరిశుభ్రతను పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటినే తాగాలని నాని నియోజకవర్గ ప్రజలకు సూచించారు.

ప్రజలు సుఖశాంతులతో ఉండాలని..

- ఆలయాల్లో మంత్రి రవీంద్ర అర్చనలు



ఫరీద్‌బాబా దర్గా వద్ద శిరస్సుపై జెట్టీతో రవీంద్ర.. పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్, జుయాలజీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు చేశారు. చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయానికి రవీంద్ర శిరస్సుపై స్వామివారికి అర్చన సామగ్రిని తీసుకువెళారు. పాండురంగ స్వామికి అర్చనలు జరిపారు. కరగ్రహారంలో ఫరీద్‌బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బందరుకోట కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, తలారి సోమ శేఖర్, నగర టీడీపీ కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాధ్యతల స్వీకరణ..

మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం ఉదయం 7.50 గంటలకు రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 3వ నెంబరు బ్లాకు 207వ గదిలో వేదపండితుల ఆశీర్వచనాలతో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

క్రీడలకు పూర్వ వైభవం

- ఎమ్మెల్యే బొండా ఉమా
- ఘనంగా ఉమ్మడి కృష్ణా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్ ప్రారంభిస్తున్న బొండా ఉమా

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 23: రాష్ట్రంలో క్రీడలకు పూర్వ వైభవం వచ్చిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌కు ఐజీఎం స్టేడియంలో ఆదివారం ఆయన జెండా ఊపి, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. రోలర్ స్కేటింగ్ అంతర్జాతీయ క్రీడాకారులు మాత్రపు జెస్సీరాజ్, తేజేష్ రన్‌లో ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా పనిచేసిన చంద్రబాబు హయాంలో హైదరాబాద్‌లో నేషనల్ గేమ్స్‌ను నిర్వహించారని గుర్తు చేస్తూ రానున్న రోజుల్లో విజయవాడ, అమరావతిలో మరిన్ని అంతర్జాతీయ స్టేడియాలు నిర్మించి స్పోర్ట్స్ సిటీలు, కాంప్లెక్సుల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో రాణించిన జెస్సీరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జెస్సీరాజ్, తేజేష్‌లకు ఎస్‌బీకే ట్రస్ట్ ఛైర్మన్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మజీరావు రూ.5వేల ఆర్థిక సాయాన్ని బొండా ఉమా చేతుల మీదుగా అందజేశారు.

ఉత్సాహంగా రన్

రానున్న పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ఏపీ నుంచి భారీగా పతకాలను సాధించాలని కోరుతూ నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఐజీఎంసీ నుంచి బెంజిసర్కిల్ వరకు జరిగింది. కోచ్‌లు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బిషప్ అజరయ్య స్కూల్ విద్యార్థులు డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పద్మజాబాల, ఉపాధ్యక్షులు సులోచన,రాజేంద్రప్రసాద్, ఈసీ మెంబర్లు రవిశంకర్, దయాకర్, రామరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.



మంత్రిని సత్కరిస్తున్న నెట్టెం, తాతయ్య

మంత్రికి నేతల శుభాకాంక్షలు

జగ్గయ్యపేట : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జగ్గయ్యపేట విచ్చేసిన సత్యకుమార్ యాదవ్‌కు విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, చైర్మన్ రాఘవేంద్ర, బీజేపీ నేతలు మన్నె శ్రీనివాసరావు, శ్రీకాంత్, శ్రీవాణి తదితరులు స్వాగతం పలికారు. జగ్గయ్యపేటలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని మునిసిపల్ చైర్మన్ రాఘవేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ నేత మన్నె శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి బీజేపీ కార్యకర్తలతో కాసేపు గడిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నివాసంలో విందుకు హాజరయ్యారు.

పీఈటీ, ఎస్జీటీ పోస్టులు పెంచాలి: డీవైఎఫ్ఐ

పాయకాపురం, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెగా డీఎస్సీ పేరుతో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతివ్వడాన్ని స్వాగతిస్తున్నామని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, వ్యాయామ ఉపాధ్యాయ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర గౌడ్ అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకటించిన డీఎస్సీలో పీఈటీ పోస్టులు కేవలం 132, ఎస్జీటీ పోస్టులు 6,347 మాత్రమే చూపించారని, వీటి సంఖ్యను పెంచి పేదల ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నోటిఫికేషన్ వయోపరిమితి 47ఏళ్లకు పెంచాలని కోరారు.

బాబుతోనే దళిత, గిరిజనుల అభివృద్ధి

- ఏపీ దళిత, గిరిజన జేఏసీ



మాట్లాడుతున్న మేళం భాగ్యారావు

ధర్నాచౌక్, జూన్ 23 : గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ దళిత గిరిజన జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనుల అభివృద్ధి జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వివిధ దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి, దళిత, గిరిజనుల హక్కులు, పథకాలు, రక్షణకు ఏపీ దళిత, గిరిజన జేఏసీ ఏర్పాటైందని, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసుకుని పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురపు రెడ్డన్న ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి మేళం భాగ్యారావు, రాష్ట్ర నేతలు వి.దుర్గాప్రసాద్, రెడ్డి రవణమ్మ, కోసనం రాము తదితరులు పాల్గొన్నారు.



సీటీజీఈవోఏ నూతన కార్యవర్గం

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలో ఐదు జిల్లాల సెంట్రల్ టాక్స్ గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉండే ఈ కార్యవర్గం అధ్యక్షుడిగా బి.నవీన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.యుగంధర్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఈశ్వరరావు, బి.సుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, సీహెచ్ కన్నారావు ఎన్నికవ్వగా, కోశాధికారిగా మిక్కిలినేని శ్రీనివాస్, లైజనింగ్ కార్యదర్శిగా టీవీజీకే మూర్తి, జేసీఎం సభ్యురాలిగా బి.శ్రీలక్ష్మి మెంటార్‌గా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మొగల్రాజపురం, జూన్ 23 : ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ టాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీసీటీజీవోఏ) సర్వసభ్య సమావేశం ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తోట రాజశేఖర్ (జాయింట్ కమిషనర్), ఉపాధ్యక్షుడు-1గా కోట శ్రీధర్ (అసిస్టెంట్ కమిషనర్) ఉపాధ్యక్షుడు-2గా అల్లిన రమేష్‌కుమార్ (డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్), జనరల్ సెక్రటరీగా కోరుప్రోలు మురళీకృష్ణ (డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్) ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వాణిజ్యపన్నుల శాఖకు సంబంధించిన 500 మంది అధికారులు పాల్గొన్నారు.



స్పోర్ట్సుకోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలి

మంత్రిని కోరిన ఏపీవోఏ ప్రతినిధులు

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో జాతీయ క్రీడల విధానం ప్రకారం కచ్చితంగా స్పోర్ట్స్ కోడ్‌ను అమలు చేయాలని, పీపీపీ మోడ్‌తో క్రీడల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ.రావు,ఉపాధ్యక్షులు నామిశెట్టి వెంకట్‌లు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డిని కోరారు. మంత్రి పదవీ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా వీరిద్దరూ ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బుద్ధుని ప్రతిమను బహుకరించారు. కీడల్లో కోటా రిక్రూట్‌మెంట్, విద్యలో ప్రవేశాల కోసం జీవో 74ను 8,10 క్లాజులను సవరించాలని కోరారు. దేశంలో ఏపీని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు.

'మాకు రక్షణ కల్పించండి'

- కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట వేడుకోలు

ధర్నాచౌక్: కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నామన్న కారణంగా నన్ను, తన భర్తను చంపుతామని మా తల్లిదండ్రులు బెదిరిస్తున్నారని వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన గంగాభవానీ కోరింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడింది. చిరుమామిళ్ల జనార్థన్ అనే వ్యక్తి, తాను ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నామని ఈ నెల 12న హైదరాబాద్‌లో తామిద్దరం వివాహం చేసుకున్నామని, విషయాన్ని తన తల్లిదండ్రులకు చెబితే వారు తీవ్రంగా బెదిరించారని పేర్కొంద. తన తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని బాధితురాలు వేడుకుంది.

మహిళలకు రక్షణలో ముందున్న చంద్రబాబు ప్రభుత్వం

విద్యాధరపురం: మహిళలకు రక్షణ కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చీరాల మండలం ఈపూరు పాలెంలో సుచరితపై జరిగిన అత్యాచారం, హత్యకేసులో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. సీఎం ఆదేశాలతో హోంమంత్రి అనిత ఆ ప్రదేశానికి వెళ్లి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారన్నారు. నిందితులను 36 గంటల్లోనే అరెస్ట్ చేశారని, హోంమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మాదాల రాజ్యలక్ష్మి, రాయి రంగమ్మ, కొలసాని నాగమణి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడాలి

భవానీపురం: గిరిజనుల అభ్యున్నతికి పార్టీలకతీతంగా రానున్న రోజుల్లో అంతా కలిసికట్టుగా ఐక్యంగా పనిచేయాలని ఎరుకుల ఆత్మగౌరవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిల రామకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం రాష్ట్ర సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ మద్దిల అంకాల, వర్కింగ్ ప్రెసిడెంట్ శీలం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం. హనుమంతరావు, పిఠాపురం కౌన్సిలర్ కావాడి పోచయ్య పాల్గొన్నారు.

జీవో నెం 117 రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

పాయకాపురం: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 117ను నూతన ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.రాధిక కోరారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా కార్యవర్గ సమావేశం నగరంలోని కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడాన్ని నిలిపేస్తూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రివాడ అనిత, పాండురంగ వరప్రసాదరావు పాల్గొన్నారు.



ఉండవల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని శాలువాతో సత్కరిస్తున్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు ఎన్.లక్ష్మీ సామ్రాజ్యం

సిబార్ డెంటల్ కాలేజీ చైర్మన్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ మృతి



వన్‌టౌన్, జూన్ 23 : సిబార్ డెంటల్ కాలేజీ చైర్మన్, అశ్వనీ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య డాక్టర్ దుర్గారాణి, ఇద్దరు కుమారులు డాక్టర్ వినయ్, శ్రీకాంత్‌లు ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు దుర్గా అగ్రహారంలోని ఆయన స్వగృహం నుంచి అంతియాత్ర ప్రారంభం కానున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళ అవయవదానం



గుడివాడ, జూన్ 23 : స్థానిక నాగవరప్పాడుకు చెందిన షైనపు ధనలక్ష్మి(48) అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందింది. ఆమె భర్త ఏసుబాబు, కుమారులు ఆనంద్‌కుమార్, అశోక్‌కుమార్‌లు అవయవదానం చేయడానికి ముందుకురావడంతో చెన్నైకి చెందిన జీవన్ దాన్ ద్వారా అవయవాలను దానం చేశారు. ధనలక్ష్మి కుటుంబసభ్యులను పలువురు ప్రశంసించారు.

ఉద్యోగుల సహకారం కీలకం: బొండా ఉమా

పాయకాపురం, జూన్ 23: రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమని, ఐదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలను సీఎం చంద్రబాబు పరిష్కరిస్తారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. జిల్లా ఎన్జీవో సంఘం నేత ఏ విద్యాసాగర్, జిల్లా నగర కార్యవర్గ సభ్యులతో కలిసి మొగల్రాజపురంలోని బొండా ఉమా నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొండా ఉమాను శాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉద్యోగులు ఆర్థికంగా, మానసికంగా ఎంతో ఆవేదన చెందిన విషయం సీఎం గుర్తించారన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

భవానీపురం సీఐగా కె.ఉమామహేశ్వరరావు



విద్యాధరపురం, జూన్ 23: భవానీపురం సీఐగా కె.ఉమామహేశ్వరావును నియమిస్తూ విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తున్న డి.ప్రసాద్‌కుమార్ మెడికల్‌లీవ్‌పై వెళుతున్నందున ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావును నియమించారు. తిరిగి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఆయనే సీఐగా కొనసాగుతారు. ప్రస్తుతం సీసీఆర్‌డీలో సీఐగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావును వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా ఏసీపీకి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమామహేశ్వరరావు జాయినింగ్ తేదీని తెలిపాల్సిందిగా వెస్ట్ ఏసీపీకి సూచించారు.

కల్యాణ వైభోగమే

కన్నులపండువగా పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

చిట్టినగర్, జూన్ 23: పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలతో చిట్టినగర్ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో పులకరించింది. ఉదయం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నిత్యహోమం, బలిహరణ నిర్వహించారు. మండపంలో పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామికి విశేష అలంకారం చేసి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, బలిహరణాదులు, ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. కల్యాణ మహోత్సవంలో వేలాది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. ఉభయధాతలు కుంకుమార్చన, కల్యాణంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ లింగిపిలి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.





ప్రత్యేక అలంకరణలో పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామి, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న బొండా ఉమా

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 23: నియోజకవర్గంలో ప్రజలందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. సెంట్రల్ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలుపొందిన ఆయనను సింగ్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం సత్కరించారు. బొండా ఉమా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి కమిటీ సభ్యులు ఉమాకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయానికి సహకరించిన ప్రజలకు ఉమా ధన్యవాదాలు తెలిపారు. కమిటీ సభ్యులు మాచర్ల దానియేలు, జవహర్‌బాబు, టీడీపీ నేతలు యలవర్తి శ్రీకాంత్, చల్లగాలి అనిల్, కంచి ధనశేఖర్, బెజ్జం జైపాల్, పైడి శ్రీను పాల్గొన్నారు.



వైద్యపరికరాలు అందజేస్తున్న గద్దె రామ్మోహన్ తదితరులు

హెల్పింగ్ హ్యాండ్స్‌కు వైద్య పరికరాల బహూకరణ

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ వైద్య సహాయం అందజేయడానికి అవసరమైన పరికరాలను హెల్పింగ్ హ్యాండ్స్‌కు తానా ట్రస్టీ ఆదివారం అందజేసింది. 16 ఆక్సీజన్ కాన్సంట్రేటర్స్, వృద్ధాశ్రమానికి ఫ్రిడ్జ్, గ్రైండర్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఫౌండర్ వెంకట్, హిమబిందు, టీడీపీ నేతలు పుట్టగుంట సురేష్, బొప్పన భవకుమార్, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్ కార్యాలయాల్లో అర్జీల స్వీకరణ

చిట్టినగర్: వీఎంసీ పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారానికి అర్జీలను సోమవారం నుంచి అన్ని జోనల్ కార్యాలయాల్లో స్వీకరిస్తారని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ప్రజలు వారివారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఈ కార్యక్రమంలో తెలియజేయవచ్చునని ఆయన సూచించారు.



స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న గన్నె ప్రసాద్ తదితరులు

మర్యాదపూర్వకంగా..

● స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసిన గన్నె ప్రసాద్

విద్యాధరపురం, జూన్ 23: అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడును ఓ హోటల్‌లో ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్(అన్న) మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. యలమంచిలి శ్రీనివాసరావు, పొన్నం రవి తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో
వ్యాధులు దూరం

వన్‌టౌన్, జూన్ 23: నీరు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరమవుతాయని 52వ డివిజన్ వాసులకు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) సూచించారు. ఆదివారం వార్డులో ఆయన పర్యటించారు. వ్యర్థపదార్థాలు, చెత్తను కార్పొరేషన్ సరఫరా చేసిన బుట్టల్లో వేసి సిబ్బందికి అప్పజెప్పాలని, ఎక్కడపడితే అక్కడ పడేయొద్దని సూచించారు. మురుగు నిల్వ ఉంచకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యే డ్రెయినేజీ సిల్టు, వ్యర్థాలు

● దుర్వాసనతో అల్లాడుతున్న తోట కనకమ్మ వీధివాసులు

భవానీపురం, జూన్ 23: 45వ డివిజన్ తోట కనకమ్మ వీధిలో నివాసిత ప్రాంతంలో ఇళ్ల మధ్య డ్రెయినేజీ సిల్టు, ఇతర వ్యర్థాలను డంప్ చేయడంతో స్థానికులు దుర్వాసనతో అల్లాడుతున్నారు. వర్షాలు కురుస్తున్నందున ఈ వ్యర్థాలతో రోగాల పాలయ్యే ప్రమాదముందని వారు ఆందోళన చెందుతున్నారు. సమస్యపై కార్పొరేటర్ మాధురి లావణ్యకు అక్కడ ప్రజలు తెలియజేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని వైసీపీ నాయకుడు మైలవరపు కృష్ణతో కలిసి ఆమె, ఆదివారం సందర్శించారు. సితార, కబేళా ప్రాంతాల్లో డ్రెయినేజీ సిల్టు తీసే పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించవద్దని కమిషనర్‌ను గతంలో కోరినా, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మొక్కుబడిగా సిల్టు తొలగించి ఇళ్ల మధ్య పోసేశారని ఆమె ఆరోపించారు. డ్రెయినేజీల చప్టాలు తీయకుండా రూ.5లక్షలతో సిల్టుతీత పనులు చేయడం తగదన్నారు. కార్పొరేషన్ యంత్రాలు, సిబ్బందితో తొలగిస్తే ఈ నిధులు కొండ ప్రాంతంలో చిన్నపాటి రోడ్డు వేయడానికి ఉపయోగపడేదని ఆవేదన వ్యక్తం చేశారు. తోట కనకమ్మ వీధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్‌కు, పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరికి తెలియజేసి, పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. వ్యర్థాలను డంప్ చేసి ప్రజలు అనారోగ్యం పాలవకుండా కార్పొరేషన్ అధికారులు చూడాలని కోరారు.



తోట కనకమ్మ వీధిలో ఇళ్ల మధ్య డ్రెయినేజీ సిల్టు, ఇతర వ్యర్థాల పేరుకుపోయిన ప్రాంతం

సెంట్రల్ అభివృద్ధికి బొండా ఉమా కృషి

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 23: సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తీర్చిదిద్దుతారని మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి అన్నారు. ఎన్నికల్లో బొండా ఉమాకు అత్యధిక మెజారిటీ రావడాన్ని పురస్కరించుకుని 58వ డివిజన్ ఇందిరా నాయక్ నగర్‌లో స్థానికులకు కృతజ్ఞతలు తెలుపుతూ ముద్రించిన కరపత్రాలను టీడీపీ నేతలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఇంటింటికీ వెళ్లి ఎంపీగా కేశినేని చిన్ని, ఎమ్మెల్యేగా బొండా ఉమాలను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి బొండా ఉమా కృషి చేస్తారని ఎరుబోతు శ్రావణి తెలిపారు. నేతలు రామారావు, ఆనంద్, లక్ష్మీనాయుడు, చిరంజీవి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా నాయక్ నగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎరుబోతు శ్రావణి

వైసీపీ కార్యాలయం కూల్చివేతను స్వాగతిస్తున్నాం

● బాబాలు, స్వామీజీలు ఆక్రమించిన భూములు స్వాధీనం చేసుకోవాలి: ఏపీ హేతువాద సంఘం

ధర్నాచౌక్, జూన్ 23: తాడేపల్లిలో ప్రభుత్వ భూమిలో అనుమతులు లేని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనాన్ని అధికారులు కూల్చివేయడాన్ని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య స్వాగతించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దొంగబాబాలు, స్వామీజీలు ఆశ్రమాల పేరుతో ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిన్నటిదాకా జగన్‌కు భజన చేసిన స్వరూపానంద ఇప్పుడు చంద్రబాబుకు భజన మొదలు పెట్టారన్నారు. గత ప్రభుత్వం అయనకు విశాఖపట్నం దగ్గర 15 ఎకరాల భూమి కేటాయిస్తూ ఇచ్చిన 48 జీవోను రద్దు చేయాలన్నారు. వరదయ్యపాలెం మండలంలో కల్కి ఆక్రమించిన దళితుల భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. ఎం.లక్ష్మీనారాయణ, రజాక్, చంద్రశేఖర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద చికిత్సపై వర్క్‌షాప్

ధర్నాచౌక్, జూన్ 23: ది ఇండియన్ మెడికల్ ప్రాక్టిషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్(ఇంపికాప్స్) ఆధ్వర్యంలో నగరంలోని ఇంపికాప్స్ పంచకర్మ ఆసత్రిలో ఆయుర్వేద సద్వైద్య సంభాష పరిషద్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేముల భానుప్రకాష్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు తమ అనుభవాలను ఆయుర్వేదవైద్యులు, విద్యార్థులకు తెలియజేయాలనే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. డాక్టర్ కోలా విజయశేఖర్, డాక్టర్ పమ్మి సూర్యకుమార్, డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ జాబిల్లి, ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ కోలా విజయశేఖర్‌ను ఘనంగా సత్కరించారు.

దుర్గమ్మకు దర్శనం, ప్రసాద టికెట్ల
ఆదాయం రూ.46.30 లక్షలు

వన్‌టౌన్, జూన్ 23: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. దర్శనం, ప్రసాదం టికెట్ల ద్వారా రూ.46,30,636 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ప్రకటించారు. 2,435 మంది భక్తులు రూ.500 రుసుం టికెట్‌తో అంతరాలయ దర్శనం చేసుకోగా రూ.12,17,500, 1574 మంది రూ.300 రుసుం టికెట్‌తో దర్శనం చేసుకోగా రూ.4,72,200, 7,142మంది భక్తులు రూ.100 రుసుం టికెట్‌తో ముఖమండపం దర్శనం చేసుకోగా రూ.7,14,200 ఆదాయం వచ్చింది. దర్శనం టికెట్ల ద్వారా 24,03,900 వచ్చింది. 3,646 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు 66,407 లడ్డూల ప్రసాదాన్ని, 32,135 పులిహోర ప్రసాదం ప్యాకెట్లను విక్రయించారు.

రోగి కుటుంబానికి దీవెన సహాయం

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్న రోగి కుటుంబానికి దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసు ఆదివారం నిత్యావసర సరుకులను అందజేసింది. జైరామ్ అనే వ్యక్తి పక్షవాతంతో బాధపడుతున్నాడు. కుటుంబం గడిచే పరిస్థితి లేకపోవడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్ర, శరత్‌కుమార్ నిత్యావసర సరుకులను అందజేశారు.

గద్దె ఆదేశాలతో పైపులైన్‌కు మరమ్మతులు

పటమట, జూన్ 23: కృష్ణవేణి స్కూల్ రోడ్డులో డీమార్టు ఎదురుగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మెయిన్‌లైన్ దెబ్బతిని సొరంగంలా ఏర్పడింది. అక్కడి ప్రమాదకర పరిస్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. రోడ్డు కుంగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వెంటనే పాత పైపులైన్లు తొలగింపజేసి, కొత్త పైపులైన్లు మార్పించారు. పనులను దగ్గరుండి ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, ఈశ్వర్ పేరేపి, గద్దె రమేష్, కార్పొరేషన్ అధికారులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదర్శనీయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

వన్‌టౌన్, జూన్ 23: దేశం కోసం పోరాడిన వ్యక్తుల్లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఒకరని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పేర్కొన్నారు. ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శప్రాయమని అన్నారు. బీజేపీ రూపశిల్పి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా కోమలావిలాస్ సెంటర్‌లో ఆదివారం ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. దేశ క్షేమం కోసం జన్ సంఘ్ పార్టీని ఏర్పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడారని, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకి ఆయన రూపకల్పన చేశారని అడ్డూరి శ్రీరామ్ పేర్కొన్నారు. కొరపల్లి గణేష్, భోగవల్లి శ్రీధర్, కంచుపిళ్ల హరినారాయణ, మహాదేవ్ సురేష్, పిట్టల గోవింద్, కిలారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుబజారులో సమస్యలు
వారంలో పరిష్కరించండి

విద్యాధరపురం, జూన్ 23: పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ఆదివారం సుజనా కార్యాలయ ప్రతినిధి శివరామ్ ఆధ్వర్యంలోని బృందం భవానీపురం రైతుబజారును సందర్శించింది. రైతు బజారులో సమస్యలను తెలుసుకుని, వారంలో పరిష్కరించాలని అక్కడి అధికారులకు సూచించింది. గత ప్రభుత్వంలో రైతు బజార్‌లో అనేక అవకతవకలు జరిగాయని వినియోగదారులు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదని శివరామ్ ఆరోపించారు. రైతులు ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువచ్చారని శివరామ్ తెలిపారు. కార్పొరేటర్ పగిడిపాటి చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ రైతుబజారును పట్టించుకోలేదన్నారు. కనీస వసతులు కల్పించలేకపోయారన్నారు. 90 షాపుల వారికి ఇబ్బందికరంగా సచివాలయ కన్వీనర్లను నియమించి రైతుబజార్‌ను వారి అడ్డాగా చేసుకున్నారని తెలిపారు. టీడీపీ 42వ డివిజన్ బీసీ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్‌తో పాటు రైతు బజార్ వర్తకులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పాయకాపురం, జూన్ 23: బాలికను మోసగించిన ఓ యువకుడిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కండ్రిక కాలనీకి చెందిన బాలిక(17) ఇంటర్ రెండో ఏడాది చదువుతోంది. రాజీవ్‌నగర్‌కు చెందిన పైడి శ్యామ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో బాలిక గర్భవతి అయింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

చాకుతో దాడి..
చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

●దాడికి పాల్పడిన భార్యాభర్తలపై హత్య కేసు నమోదు

చిట్టినగర్, జూన్ 23: పాతగొడవలు మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై భార్యభర్తలు పైపుల రెంచ్, చీపుర్లు కోసే చాకుతో దాడి చేసి గాయపర్చారు. ఆ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి హౌసింగ్‌కాలనీ జీఎఫ్-8లో ఆటోడ్రైవర్ మద్దా రవికుమార్(27) కుటుంబంతో ఉంటున్నాడు. అదే బ్లాక్‌లో భార్యభర్తలు కిరణ్‌కుమార్, భవానీ ఉంటున్నారు. భవానీతో రవికుమార్‌కు అక్రమ సంబంధం ఉందనే వ్యవహారంపై రవికుమార్, కిరణ్‌కుమార్‌కు మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఇటీవల పెద్దల సమక్షంలో మాట్లాడుకుని సర్దుబాటు చేసుకున్నారు. 20వ తేదీన రవికుమార్ ఇంట్లో లేని సమయంలో అతని తల్లి వద్దకు వచ్చి కిరణ్‌కుమార్, భవానీలు గొడవపడ్డారు. రవికుమార్ భార్య ఈవిషయాన్ని అతనికి ఫోన్‌లో చెప్పింది. అదే రోజు రాత్రి 10 గంటలకు ఆటోలో ఇంటికి వస్తున్న రవికుమార్‌ను కిరణ్‌కుమార్, అతని భార్య కాలనీ సమీపంలో సప్తగిరి బ్యాంక్ వద్ద అడ్డగించి గొడవపడ్డారు. తమతో తెచ్చుకున్న పైపుల రెంచ్‌తో తలపై కొట్టి చీపుర్లు కోసే చాకుతో దాడి చేసి గాయపర్చారు. గాయాలవడంతో రవికుమార్ కేకలు పెట్టాడు. దీంతో స్థానికులు వచ్చారు. దీంతో కిరణ్‌కుమార్, భవానీ పరారయ్యారు. రవికుమార్‌ను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. పోలీసులు భార్యాభర్తలపై హత్య కేసు నమోదు చేశారు.











దిక్సూచి DIKSUCHI

జేఎన్‌యూలో ఎమ్మెస్సీ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయోటెక్నాలజీ, కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్-బీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు కేటాయించారు.

- కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓబీసీలకు 4, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 2 సీట్లు నిర్దేశించారు.

అర్హత: ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ)లో ప్రవేశానికి ఫిజికల్, బయలాజికల్(బయోకెమిస్ట్రీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బోటనీ/మైక్రోబయాలజీ/జువాలజీ), అగ్రికల్చరల్, వెటర్నరీ అండ్ ఫిషరీ సైన్సెస్, ఫార్మసీ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ(ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు) పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎమ్మెస్సీ(కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్)లో ప్రవేశానికి బేసిక్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

n **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27. n **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ఎఫ్‌సీఆర్‌ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్‌ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/



50వ జీ-7 సమావేశం

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జీ-7 లేదా గ్రూప్ ఆఫ్ సెవెన్.. అనేది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల కూటమి. తొలుత ఆర్థిక, రాజకీయపరమైన అంశాల్లో పరస్పర సహకారానికి ప్రపంచ ధనిక దేశాలీ కూటమిని ఏర్పాటు చేసుకున్నా, కాలక్రమంలో ఈ కూటమి తన లక్ష్యాల పరిధిని పెంచుకుంటూ వస్తోంది. సభ్యదేశాలతోపాటు అవసరార్థం సభ్యేతర దేశాలతో కూడా జట్టుకడుతూ తమ వార్షిక సమావేశాలకు ఆహ్వానించి పరస్పర ప్రయోజన చర్చలకు వేదికవుతోంది. ఈ కోవలో 2003లో మొదలు ఇప్పటివరకూ భారత్ పదకొండుసార్లు ఈ సమావేశాల్లో ఆహ్వానిత దేశంగా పాల్గొంది. 2019 నుంచి వరుసగా ఆహ్వానాన్ని అందుకుంటూనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉభయతారక ప్రయోజనాల కోసం భారత్ ఈ సమావేశాలకు హాజరవుతూ అభివృద్ధి చెందిన దేశాలైన జీ-7 దేశాల సమావేశ వేదికపై తన వాణిని వినిపిస్తూ ఉంది.

తాజాగా జీ-7, 50వ సమావేశం ఇటలీలోని అపూలియా రీజన్‌లో జూన్ 13 నుంచి 15 వరకూ జరిగిన నేపథ్యంలో ఆతిథ్య దేశంగా భారత్ 11వ సారి పాల్గొన్న సందర్భంగా జీ-7 పుట్టుపూర్వోత్తరాలు, ఆతిథ్య దేశంగా భారత్ పాత్ర, ప్రస్తుత సమావేశ ప్రధాన లక్ష్యాలు, చేసిన తీర్మానాలపరంగా ఒక విహంగవీక్షణం చేయాల్సిన అవసరం ఉంది.

ముఖ్యాంశాలు తీర్మానాలు

50వ జీ-7 సమావేశాన్ని సభ్య దేశమైన ఇటలీ జూన్ 13 నుంచి 15 వరకూ అపూలియా రీజియన్‌లో గల బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో నిర్వహించింది. 2003 నుంచి అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా సభ్యదేశాలతోపాటు సభ్యేతర దేశాలను కూడా జీ-7 సమావేశ ఔట్‌రీచ్ సెషన్స్‌కు ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న సభ్యేతర దేశాల్లో భారత్‌తోపాటు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, జోర్డాన్, కెన్యా, మౌరిటేనియా, టునేషియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ ఉన్నాయి. ఈ దేశాలతోపాటు ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఐక్యరాజ్యసమితి అధిపతులు కూడా ఉన్నారు.

సమావేశ థీమ్, ఎజెండా

ఈ ఏడాది జీ-7 సమావేశపు థీమ్‌ను 'రూల్ బేస్డ్ ఇంటర్నేషనల్ సిస్టమ్'గా, సమావేశానికి ప్రత్యేక ఆహ్వానిత దేశాధ్యక్షుడైన టర్కీ అధ్యక్షుడు 'రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్' నిర్ణయించారు. ఆతిథ్యదేశంగా ఇటలీ ఈ సమావేశ ఎజెండాను రూపొందించింది. ఎజెండాలో 'ఉక్రెయిన్, గాజాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు', 'ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత పరిస్థితులు', 'వలసలు', 'ఆర్థిక భద్రత', 'కృత్రిమమేధ' విషయంలో అంతర్జాతీయ సహకారంవంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

సమ్మిట్ ముఖ్య నిర్ణయాలు

- జీ-7 సభ్య దేశాలు దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ సమావేశం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో అమెరికా పదేళ్ల సమయానికి గానూ ఒక భద్రతా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సంపత్తిని అందించనుంది. ఇదేతరహా భద్రతా ఒప్పందం జపాన్ కూడా ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంగానే జరిగింది.
- అమెరికా, యూరప్‌ల్లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను హామీగా పెట్టుకుని ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల రుణాన్ని జీ-7 దేశాలు అందించాయి. ఇకముందు కూడా దఫాలవారీగా ఇలాంటి రుణాలను ఉక్రెయిన్‌కు అందించేందుకు జీ-7 సభ్యదేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు గానూ రష్యా నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇది కొనసాగించాలని నిర్ణయించాయి.
- ఆహార భద్రతకు, పోషకాహారానికి గల వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు కృషిచేయడానికి 'అపూలియా ఫుడ్ సిస్టమ్స్ ఇనీషియేటివ్'ను ప్రకటించారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థికంగా సహకరించేందుకు జీ-7 దేశాలు ఆరంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్' ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి నిర్ణయించారు.
- కృత్రిమమేధ రంగంలో పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్‌ను రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ కోడ్ ఆఫ్ కండక్ట్(ప్రవర్తనా నియమావళిని) రూపొందించడానికి అంగీకరించారు. కృత్రిమమేధ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, అది అందించే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
- అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా అవలంబిస్తున్న దమన నీతిని అడ్డుకుని మార్కెట్ ఒడుదొడుకులు, వక్రీకరణల నుంచి పరిశ్రమలను, కార్మికులను, పెట్టుబడులను, ఆర్థికభద్రతను పరిరక్షించుకునేందుకు జీ-7 దేశాలు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.
- వలసలు సంధించే సమస్యలు, అందించే అవకాశాలపరంగా వలస విధానాలపై ఒక సంయుక్త విధాన రూపకల్పనకు 'లాస్‌ఏంజెల్స్ డిక్లరేషన్ ఆన్ మైగ్రేషన్ అండ్ ప్రొటెక్షన్' మార్గనిర్దేశంలో కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోభివృద్ధి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల భాగస్వామ్యం, సహకారం పెంపునకు పిలుపునిచ్చాయి. అదేవిధంగా పరిశుద్ధ ఇంధన వనరుల వినియోగం దిశగా తరలడం ద్వారా వాతావరణ మార్పులను, కాలుష్యాన్ని, జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొనేందుకు పిలుపునిచ్చాయి.
- లైంగిక ఆరోగ్యం, పునరుత్పాదక అంశాలు, లింగ అసమానతలకు సంబంధించి సమాన హక్కులు ఉండేలా చర్యల కోసమై పిలుపునిచ్చాయి.
- అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించేందుకు గాజాలో కాల్పుల విరమణను ఆశించడంతోపాటు 'తగిన సమయంలో పాలస్తీనాను దేశంగా గుర్తించడంతో సహా రెండు దేశాల పరిష్కారానికి జీ-7 కట్టుబడిందని మరోసారి నొక్కిచెప్పారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

జీ-7 ఆవిర్భావం-గమనం



1973 ప్రాంతంలో చమురు ఉత్పత్తి దేశాలు చమురు ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, చమురు ధరలు పెరిగేలా చమురు సంక్షోభం(ఫస్ట్ ఆయిల్ క్రైసిస్) సృష్టించాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి

ఆహ్వానిత దేశంగా భారత్

చెందిన దేశాలైన ఆరు దేశాలు(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, వెస్ట్ జర్మనీ, జపాన్) ఒక కూటమిగా(జీ-6)గా 1975లో ఏర్పడ్డాయి. అనంతరం 1976లో కెనడా కూడా ఈ కూటమిలో చేరడంతో జీ-7గా రూపాంతరీకరణ జరిగింది. 1998లో రష్యా కూడా ఈ కూటమిలో చేరడంతో ఇది జీ-8గా రూపొందింది. కానీ, 2014లో రష్యా, క్రిమియాను ఆక్రమించడంతో రష్యా జీ-8 సభ్యత్వాన్ని రద్దుచేశారు. దాంతో జీ-8గా తాత్కాలికంగా మారిన ఈ కూటమి తిరిగి జీ-7గా స్థిరపడింది.

జీ-7 విధివిధానాలు, భాగస్వాములు, సమావేశాలు

ఈ జీ-7 కూటమి కేవలం ఒక స్వేచ్ఛాయుత, పరస్పర అంగీకార కూటమి. ఏ ఒప్పందం ద్వారానూ/చార్టర్ ద్వారానూ ఇది ఏర్పడలేదు. అదేవిధంగా సభ్యదేశాలను నియంత్రించే ఎలాంటి చట్టపర కట్టుబాట్లు, వ్యవస్థలు దీనికి లేవు. ఒక ప్రధాన కార్యాలయమంటూ ఏదీలేదు.

అయితే ప్రతి సంవత్సరం జీ-7 సమావేశాలు నిరవధికంగా జరుగుతాయి. దఫాలవారీగా ఒక్కొక్క సభ్యదేశం ఈ సమావేశాన్ని నిర్వహించే బాధ్యత ఒక్కో ఏడాది తీసుకుంటుంది. ఆ ఏడాది సమావేశ ఎజెండా కూడా ఆ ఆతిథ్య దేశమే నిర్ణయిస్తుంది. అదేవిధంగా సంవత్సరం పొడవునా వివిధ రాజకీయ, ఆర్థికపరమైన అవసరాలకు అనుగుణంగా మంత్రులు, అధికారుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతూ ఉమ్మడి తీర్మానాలు ప్రకటిస్తుంటాయి.

ఈ జీ-7 సమావేశాల్లో ఏడు సభ్యదేశాలతోపాటు యురోపియన్ యూనియన్, వరల్డ్‌బ్యాంక్(ప్రపంచబ్యాంక్), అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ఐక్యరాజ్య సమితి కూడా పాల్గొంటాయి.

2003 నుంచి జీ-7 సమావేశాలకు సభ్యేతర దేశాలు కూడా ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల నుంచి ఈ దేశాలను ఆహ్వానించి వివిధ సామాజిక, పర్యావరణ, వ్యాపార అంశాలపరంగా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోదిచేయడానికి ఔట్‌రీచ్ సెషన్స్ నిర్వహిస్తారు. జీ-7 సమావేశాలకు సంబంధించిన చర్చనీయాంశాల రూపకల్పనలో, సమావేశానంతర సమీక్షల నిర్వహణల్లో 'షెర్పా'లని పిలిచే పలు దేశాల అధికార గణం(రాయబారులు మొదలైనవారు) కీలకపాత్ర వహిస్తుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)

'పుష్పక్' హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

మూడో పరీక్ష ఎల్‌ఈఎక్స్-03ను కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఆదివారం ఉదయం 7.10 గంటలకు నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. గతంలో నిర్వహించిన ఎల్‌ఈఎక్స్-01, ఎల్‌ఈఎక్స్-02 విజయవంతమైన నేపథ్యంలో ఈసారి మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించినట్టు పేర్కొంది. ప్రయోగంలో భాగంగా పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. అక్కడి నుంచి పుష్పక్ స్వయంగా క్రాస్ రేంజ్ కరెక్షన్ విన్యాసాలను చేపడుతూ.. రన్‌వేపైకి చేరుకుని నిర్దేశిత సెంటర్‌లైన్ వద్ద ల్యాండ్ అయింది. ఈ వాహనానికి సంబంధించిన తక్కువ లిఫ్ట్-టు-డ్రాగ్ నిష్పత్తి ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కి.మీ. కంటే ఎక్కువగా ఉందని, కమర్షియల్ విమానాల్లో ఇది గంటకు 260 కి.మీ., సాధారణ యుద్ధ విమానానికి గంటకు 280 కి.మీ. ఉంటుందని ఇస్రో తెలిపింది. పుష్పక్ రన్‌వేపై ల్యాండయిన తర్వాత బ్రేక్ పారాచూట్ సాయంతో దాని వేగాన్ని గంటకు 100 కి.మీ.కు తగ్గించామని, ఆ తర్వాత ల్యాండింగ్ గేర్ బ్రేక్‌లను ఉపయోగించి దాన్ని రన్‌వేపై నిలిపివేశామని పేర్కొంది. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్‌వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో వివరించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నేతృత్వంలో సాగిన ఈ మిషన్‌ను ఇస్రో కేంద్రాలైన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ), ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్), శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ల నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు.

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ కేసులో అరెస్టయ్యారు. అసహజ లైంగిక దౌర్జన్యం వివాదంలో సాక్ష్యాలను పోలీసులకు వివరించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ సూరజ్‌ను హాసనరసీపుర పోలీసులు శనివారం రాత్రంతా విచారించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు సూరజ్ రేవణ్ణను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. సూరజ్‌పై ఐపీసీ 377 (అసహజ లైంగిక దౌర్జన్యం), 342, 506, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై సూరజ్‌రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని జేడీఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్‌రేవణ్ణ ఖండించారు. తననుంచి రూ.5కోట్లు పొందాలని చేతన్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలావివాదం సాగుతుండగానే.. తనను చేతన్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు సాక్ష్యాలున్నాయంటూ శనివారం రాత్రి సూరజ్‌రేవణ్ణ హాసనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, చేతన్ అంతకుముందే డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు సూరజ్‌ను తెల్లవారుజామున 4 గంటలదాకా విచారణ జరిపారు. తర్వాత అరెస్టు చేశారు. మరోవైపు బాధితుడిని బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

లోకం తీరు



నేటి నుంచి లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేస్తారు. ఒక్కో ఎంపీ ప్రమాణానికి ఒక నిమిషం సమయం ఉంటుంది. ప్రధాని మోదీ క్యాబినెట్‌లోని మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు, 13 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లూధియానా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం గమనార్హం. లోక్‌సభ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగనున్నాయి. కాగా, లోక్‌సభలో తొలి రోజే ఏపీకి చెందిన 25 మంది సభ్యులు ప్రమాణం చేయనుండగా, రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడో రోజైన 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. రాజ్యాంగంలోని 93వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతూ వస్తోంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవిని తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. 17వ లోక్‌సభలో బీజేపీకి చెందిన ఓంబిర్లా స్పీకర్‌గా ఉన్నారు. ఉపసభాపతి స్థానానికి ఎవరినీ ఎంపిక చేయకపోవడం వల్ల ఆ పదవి ఐదేళ్లు ఖాళీగా ఉంది. ఈ సారి ఉపసభాపతిని ఇండియా కూటమికి ఇస్తుందా? లేదా ఎన్డీయే మిత్రపక్షాల్లో ఎవరికైనా అప్పగిస్తుందా? అన్నది వేచిచూడాల్సిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌తోపాటు సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, సంజయ్, శ్రీనివాస వర్మలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అవహేళనలకు గురైనవేళమీ ఆదరణే రక్షించింది

» వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్, జూన్ 23: కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం అక్కడి ప్రజలకు భావోద్వేగపూరిత లేఖ రాశారు. వయనాడ్, రాయ్‌బరేలీ రెండు చోట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వంశపారంపర్య స్థానంగా గుర్తింపు పొందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకొని వయనాడ్‌ను విడిచిపెట్టారు. ఇక్కడ ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్ ప్రజలకు లేఖ రాశారు. 'ప్రతి రోజూ అవహేళనలకు గురైన సమయంలో మీరు చూపించిన అపరమిత ప్రేమే నన్ను కాపాడింది' అని ఆ లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. "వయనాడ్‌ను వదులుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించేందుకు మీడియా ముందుకు వచ్చినప్పుడు నా కళ్లలోని విచారాన్ని మీరు చూసే ఉంటారు. అయిదేళ్ల క్రితం ఓ పరాయివ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. అయినా మీరు నన్ను నమ్మారు. హద్దులు లేని ప్రేమ, అభిమానంతో అక్కున చేర్చుకున్నారు. ప్రతి రోజూ దుర్భాషలకు గురయిన సమయంలో మీరు చూపిన షరతుల్లేని ప్రేమే నన్ను సంరక్షించింది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. మీరు నా కుటుంబంలో సభ్యులు" అని పేర్కొన్నారు.

సగం మందే హాజరు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా.. చండీగఢ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సిన ఇద్దరూ హాజరు కాలేదు. ఛత్తీసగఢ్‌లో రెండు కేంద్రాల్లో 602 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 291 మందే వచ్చారు. హరియాణాలో రెండు కేంద్రాల్లో 494 మందికి ఏర్పాట్లు చేయగా.. 287 మంది, మేఘాలయలో 464 మందికిగాను 234 మంది మాత్రమే పరీక్ష రాశారు. గుజరాత్‌లో ఒకే ఒక్క అభ్యర్థి కోసం పరీక్ష పెట్టారు. మరోవైపు.. నీట్ కేసు దర్యాప్తున చేపట్టిన సీబీఐ.. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు.. నీట్-యూజీ 2024 పరీక్ష నిర్వహణలో కొన్ని రాష్ట్రాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 420 (చీటింగ్) కింద కేసులు నమోదు చేసింది. ఇక.. నీట్, యూజీసీ నెట్ ప్రశ్న పత్రాలు లీక్ అయిన నేపథ్యంలో.. ఆ రెండింటితోపాటు జేఈఈ మెయిన్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ సహా పలు ప్రవేశ, పోటీ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందన్న వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఎన్‌టీఏ అప్రమత్తమై.. అలాంటిదేమీ లేదని, ఎన్‌టీఏ, దాని అనుబంధ వెబ్‌సైట్లన్నీ అత్యంత భద్రంగా ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు.. పరీక్షల సంస్కరణలపై ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ సోమవారం సమావేశం కానుంది.



సీబీఐ అధికారుల కారుకు అడ్డుపడిన కసియాడిహ్ గ్రామస్థులు

ఆ నలుగురికే కాదు..

నీట్ పేపర్ లీక్ కేసులో బిహార్ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు కీలక నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురికి కాదు.. మొత్తం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని అమ్మారు. ఒక్కొక్కరికీ రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించినట్టు.. సికందర్ యాదవేందు, అఖిలేశ్ కుమార్, బిట్టు కుమార్ , సంజీవ్ సింగ్, రాకీ, నితీశ్, అమిత్ ఆనంద్ తదితర నిందితులు తమ నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మే 4వ తేదీ రాత్రి బిహార్‌లోని సాల్వర్ గ్యాంగు మునిసిపల్ జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు ద్వారా నలుగురు విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాన్ని జవాబులతో సహా అందజేసే సమయంలోనే పట్నా పోలీసులకు ఝార్ఖండ్ పోలీసుల నుంచి ఈ వ్యవహారంపై ఉప్పందింది. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను మే 5వ తేదీనే నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కాగా.. కేంద్రానికి బిహార్ ఈవోయు పంపిన ఆరు పేజీల నివేదిక ఆధారంగా ఎన్‌టీఏ మరో 17 మంది విద్యార్థులను డిబార్ చేసింది. దీంతో ఈ ఏడాది నీట్ రాసినవారిలో 110 మందిని డిబార్ చేసినట్టయింది.

సీబీఐ బృందంపై దాడి

యూజీసీ-నెట్ కేసు దర్యాప్తులో భాగంగా.. ఫూల్ చంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేస్తూ బిహార్‌లోని నవాదా ప్రాంతానికి వెళ్లిన సీబీఐ బృందంపై కసియాడిహ్ గ్రామస్థులు దాడి చేశారు. సీబీఐ బృందంలో నలుగురు అధికారులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. గ్రామస్థులు వారిపై దాడి చేయగా.. సీబీఐ బృందం స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా వచ్చి కాపాడారు. అనంతరం స్థానిక పోలీసుల సమక్షంలో దర్యాప్తు కొనసాగించిన సీబీఐ బృందం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. తమ గ్రామానికి వచ్చింది నకిలీ అధికారుల బృందం అనే సందేహంతోనే గ్రామస్థులు సీబీఐ అధికారులపై దాడి చేసినట్టు స్థానిక పోలీసులు చెప్పారు.

అలాగే.. ఈ కేసులో బిహార్ ఈవోయు యూనిట్ మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి దాకా బిహార్‌లో అరెస్టయినవారి సంఖ్య 18కి చేరింది. మహారాష్ట్రలోనూ నాందేడ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకుని విచారించారు.

నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత: ఖర్గే


న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 'నీట్ కుంభకోణాని'కి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ వల్ల కుళ్లిపోయిన విద్యా వ్యవస్థ.. అధికారులను మార్చినంత మాత్రాన బాగుపడదని శనివారం 'ఎక్స్' పోస్టులో వ్యాఖ్యానించారు. ఇప్పుడు నీట్-పీజీని వాయిదా వేశారని, గత పది రోజుల్లో నాలుగు పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలోకి ప్రశ్నపత్రాల లీక్‌లు, అవినీతి, అక్రమాలు, మాఫియా చొరబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, మాఫియా ముందు ప్రధాని మోదీ నిస్సహాయంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీట్-పీజీ వాయిదా పడడం మోదీ హయాంలో ధ్వంసమైన విద్యా వ్యవస్థకు మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, పిల్లల భవిష్యత్తును మాఫియా, అవినీతిపరులు, భజనపరులైన అసమర్థుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత భవిష్యత్తుకు బీజేపీయే అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు.

2038 జూలై 6న గ్రహశకలం

భూమిని ఢీకొట్టే ముప్పు

న్యూఢిల్లీ, జూన్ 23: పద్నాలుగేళ్ల తర్వాత 2038వ సంవత్సరం జూలై 12వ తేదీన ఓ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ముప్పు ఎక్కువగా(72%) ఉందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. ఈ గ్రహశకలం పరిమాణం, వేగం, దాని వల్ల కలిగే అనర్థాలపై ఇప్పుడే అంచనాకు రాలేమని తెలిపింది. అయితే, దాన్ని దారి మళ్లించే సాంకేతిక అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ గ్రహశకలానికి సంబంధించి ఇంకా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదని వివరించింది. గ్రహశకలం కదలికలను గమనిస్తున్నామని తెలిపింది. జూన్ 20న మేరీలాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్(ఏపీఎల్)లో నిర్వహించిన పరిశోధనల్లో ఈ గ్రహశకలం కదలికలను గుర్తించారు. తాజాగా ఓ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రహశకలాలు భూమి వైపునకు దూసుకువస్తున్నాయన్న అంతరిక్ష పరిశోధన సంస్థల ప్రకటన లు సాధారణమే అయినప్పటికీ ఈసారి నాసా తేదీతో సహా హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకొంది.

మేనల్లుడే వారసుడు: మాయావతి



లఖ్‌నవూ, జూన్ 23: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను మరోసారి తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనకు పార్టీ జాతీయ సమన్వయకర్తగా తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో ఎన్నికల సమయంలో ఆకాశ్‌కు పరిపక్వత లేదని పేర్కొంటూ ఆయనను వారసుడిగా తొలగించడంతో పాటు పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. "ఆకాశ్ పూర్తి పరిణతి కలిగిన నేత ఎదుగుతారని ఆశిస్తున్నా. భవిష్యత్తులో అతను నా అంచనాలను అందుకోగలరు" అని తాజాగా మాయావతి పేర్కొన్నారు.



భారతికి గోడువెళ్లబోసుకుంటున్న మహిళా కౌన్సిలర్లు, నేతలు

బిల్లుల కోసం మళ్లీ రగడ

- జగన్, భారతిలు ఉక్కిరిబిక్కిరి
- అప్పులు తెచ్చి పనులు చేశామంటూ పులివెందుల కౌన్సిలర్ల గగ్గోలు
- ఇదేం తలనొప్పి: మాజీ సీఎం అసహనం

పులివెందుల, జూన్ 23: వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పులివెందుల పర్యటనలో రెండోరోజు ఆదివారం కూడా కాంట్రాక్టు పనులు చేసిన కౌన్సిలర్ల నుంచి భారీ సెగ తగిలింది. బిల్లుల చెల్లింపు వ్యవహారంపై వారి నుంచి నిలదీతలు ఎదురయ్యాయి. పులివెందుల పట్టణాభివృద్ధి సంస్థ(పాడా)లో పనులు చేసిన కొందరు కౌన్సిలర్లు తమ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారంటూ నిలదీశారు. ప్రధానంగా పులివెందుల మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు ఆదివారం జగన్‌ను కలిశారు. తాము చేసిన పనులకు బిల్లులు కాలేదని, అప్పుల్లో కూరుకుపోయామని, బిల్లులు రాకపోతే ఇబ్బంది పడతామని తమ గోడు వెళ్లబోసుకున్నారు. జగన్ స్పందిస్తూ "గత నాలుగున్నర సంవత్సరాలుగా రూ.వందల కోట్లు పులివెందులకు ఇస్తున్నా కదా. చివరిలో ఆగిన బిల్లుల కోసం ఇబ్బందిపడితే ఎలా? కాస్త ఆగండి. కోర్టుకు వెళ్లి అయినా బిల్లుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తా" అని హామీ ఇచ్చారు. అయితే.. జగన్ సమాధానంపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మరికొందరు కూడా అక్కడకు చేరుకుని తమకూ బిల్లులు రాలేదని గగ్గోలు పెట్టారు. దీంతో జగన్ వారిని కొంచెం ఓపిక పట్టాలంటూ పదేపదే చెప్పారు. అయినప్పటికీ వారు శాంతించక పోవడంతో ఒకింత అసహనం వ్యక్తం చేశారు. "నాకు ఇద్దరూ ఆడపిల్లలే. ప్రజల కోసం, కార్యకర్తల కోసమే రాజకీయాలు చేస్తున్నా. అంతేతప్ప వేరొకటి కాదు. పులివెందులలో అయినా ప్రశాంతంగా ఉందామనుకుంటే ఇదేం తలనొప్పి" అని తన అనుచరులతో అన్నారు.

భారతికీ మొర!

"మా గోడు వైఎస్ జగన్‌కి వినిపించండి మేడం" అంటూ మహిళా కౌన్సిలర్లు జగన్ సతీమణి భారతికి మొర పెట్టుకున్నారు. పులివెందులలో అరకొరగా కాంట్రాక్టు పనులు చేశామని, చివరిలో బిల్లులు కాకుండా ఆగిపోయాయని వివరించారు. చివరి ఆరు నెలల సమయంలో అప్పులు చేసి మరీ పనులు పూర్తిచేశామని భారతికి తెలిపారు. భారతి స్పందిస్తూ జగన్‌కు మీ సమస్య వివరిస్తానని అందరూ ఓపిగ్గా ఉండాలని నచ్చజెప్పినట్లు సమాచారం.

నీ వల్లే వైఎస్ కుటుంబానికి ఈ గతి!

- ఎంపీ అవినాశ్‌పై తిరగబడ్డ అభిమానులు

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెనకేసుకుంటూ వచ్చిన ఎంపీ అవినాశ్ రెడ్డిపై సొంతూరులోనే వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు తిరగబడ్డారు. జగన్ రాక సందర్భంగా పులివెందుల ప్యాలెస్‌కు వచ్చిన అవినాశ్‌ను.. 'నువ్వు, నీ అన్న(జగన్) వల్లే మా వైఎస్ ఫ్యామిలీకి ఈ గతి పట్టింది' అంటూ దూషించారు. వైఎస్ అభిమానుల నుంచి ఈ తరహా ప్రతిఘటన ఎదురు కావడంతో అవినాశ్ షాక్‌కు గురయ్యారు. ముందుకు వెళ్లలేక, వారికి సర్దిచెప్పలేక పక్కకు తప్పుకొన్నారు.

వైసీపీ ఉరఫ్ రాంకీ

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాన్ని అధికారులు శనివారం కూల్చివేసిన సంగతి తెలిసిందే. 'వైసీపీ ఆఫీసును కూల్చివేశారని జగన్ రోత పత్రిక కూడా గగ్గోలు పెట్టింది. కానీ ఆ అక్రమ కట్టడానికి సంబంధించి మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ తనిఖీ నివేదికలోను, ఇచ్చిన నోటీసులోను దాని యజమాని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అని పేర్కొనడం వైసీపీ ఆఫీసుల వెనుక పెద్ద బాగోతమే ఉందని చెప్పకనే చెప్పింది. యజమాని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అయితే.. వైసీపీ ఆఫీసు పేరిట దాన్ని ఎందుకు కడుతున్నట్లు? నిబంధనలన్నీ గాలికొదిలి స్థలాన్ని కేటాయించిందేమో వైసీపీ ఆఫీసు కోసం. కానీ యజమానిగా ఉన్నదేమో రాంకీ సంస్థ. ఇదెలా సాధ్యమైంది? రాంకీకి ఆ స్థలాన్ని వైసీపీ అమ్మేసిందా? లేదా సబ్ లీజుకు ఇచ్చిందా? నిర్మాణ ఒప్పందం మేరకు అప్పగించిందా? అలా ఇస్తే ఆ ఒప్పందం ఎక్కడ? వ్యవహారం ఇక్కడితో అయిపోలేదు. జిల్లాల్లో వైసీపీ కార్యాలయాల నిర్మాణ పనులను దాదాపు రాంకీ సంస్థే చేపడుతోంది. కాంట్రాక్టు ఇచ్చినట్టుగా ఎలాంటి రికార్డులు లేవు. అయినా రూ.వందల కోట్ల వ్యయంతో రాంకీ సంస్థ వైసీపీ కార్యాలయ భవనాలను సొంత ఖర్చుతో ఎందుకు నిర్మించి ఇస్తోంది? ఏ ప్రయోజనాలు ఆశించి ఇలా చేస్తోంది? లేదా ముందే పొందిన ప్రయోజనాలకు ప్రతిగా 'క్విడ్ ప్రో కో' తతంగం సాగుతోందా?



తాడేపల్లిలో వైసీపీ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

రాంకీనే ఎందుకు?

రాష్ట్రవ్యాప్తంగా జగన్ పార్టీ అడ్డగోలుగా కార్యాలయాలు నిర్మిస్తోంది. సుప్రీం కోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా నీటి కుంటలు, చెరువులు కూడా నామమాత్రపు లీజుల పేరిట ధారాదత్తం చేసేసింది. అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతోంది. ఆయా శాఖల అనుమతులు, పంచాయతీలు, మున్సిపాలిటీల అనుమతులు, లీజు ఒప్పందాలు లేకుండా ఆఫీసుల నిర్మాణం చేపట్టారు. భవనాల్లో అత్యధిక శాతం రాంకీ గ్రూప్‌తో నిర్మాణం చేయిస్తున్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడైన అయోధ్య రామిరెడ్డికి చెందిన సంస్థే ఈ రాంకీ. వైసీపీ ఎంపీ అయినంత మాత్రాన ఆ పార్టీ ఆఫీసులను సొంత ఖర్చుతో నిర్మించాల్సిన అవసరం లేదు. ఇదే అసలు ట్విస్ట్. జగన్ తీసుకున్న అనేకానేక నిర్ణయాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందిన పెద్దలు రాంకీ ద్వారా వైసీపీ ఆఫీసుల నిర్మాణం కోసం చేయూతనిచ్చినట్టు తెలుస్తోంది. అంటే.. క్విడ్ ప్రో కో అన్న మాట. మొన్నటిదాకా అధికారాన్ని అనుభవించిన వైసీపీ సొంతంగా ఆఫీసులు ఎందుకు కట్టుకోలేకపోయింది? ఓ కంపెనీతో ఎందుకు నిర్మాణాలు చేయిస్తోంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే క్విడ్ ప్రో కో బయటికొస్తోంది. ఆఫీసుల నిర్మాణం కోసం భూములు తీసుకున్న వైసీపీ ఆ పనులు చేపట్టాలి. వాటిని తన వార్షిక ఆర్థిక పురోగతి నివేదికలో చూపించుకోవాలి. ఆదాయ పన్ను రిటర్న్‌లో పేర్కొనాలి. కానీ వైసీపీ ఆ పనిచేయలేదు. 2022లో రూ.183 కోట్లుగా ఉన్న ఆస్తులను 2023 మార్చి నాటికి రూ.167 కోట్లకు తగ్గినట్లుగా చూపించింది. ప్రభుత్వం నుంచి తీసుకున్న భూములు, నిర్మాణాలు, వ్యయం వివరాలేవీ ప్రస్తావించలేదు. కానీ 2022 నుంచే వైసీపీకి భూముల కేటాయింపు, ఆఫీసుల నిర్మాణం జరుగుతోంది. అయినా ఆదాయపన్ను వివరాల్లో గోప్యంగా ఉంచారు. వైసీపీ వద్ద రిజర్వ్ నిధులు రూ.వందల కోట్లున్నాయి. వాటితోనే ఆ పార్టీ సొంతంగా ఆఫీసుల నిర్మాణం చేపట్టవచ్చు. కానీ వైసీపీకి బదులుగా రాంకీ గ్రూప్ చేపడుతోంది. ఆ సంస్థ ఆఫీసులు నిర్మించాలని వైసీపీ కాంట్రాక్టు ఒప్పందాలు చేసుకోలేదు. అలాంటివేవీ రిజిస్టర్ కాలేదు.

ఇది 'క్విడ్ ప్రో కో'నే

రాష్ట్రవ్యాప్తంగా అధికారిక సమాచారం ప్రకారం 11 జిల్లాల్లో ఆఫీసులను వైసీపీకి బదులు రాంకీ గ్రూప్ నిర్మిస్తోంది. ఆ సంస్థ ఎక్కడి నుంచి నిధులు తీసుకొచ్చి వ్యయం చేస్తోంది? ఉదారంగా ఆఫీసులు నిర్మిచే ంత బడ్జెట్ ఆ సంస్థ వద్దలేదు. మరి ఆ సంస్థకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఇక్కడే మతలబు ఉంది. జగన్ నుంచి వివిధ రకాల మేళ్లు పొందిన కంపెనీలు, సంస్థలు నేరుగా పార్టీ ఆఫీసులు కడితే వెంటనే తెలిసిపోతుంది. లేదా ఎలక్టోరల్ బాండ్స్, ఇతర రూపంలో నిధులు ఇచ్చినా గుట్టు రట్టవుతుంది. మధ్యేమార్గంగా రాంకీ సంస్థను ముందుపెట్టి, ఆయా కంపెనీల నిధులతో నిర్మాణాలు చేపడితే.. చేతికి మట్టి అంటదు. సరిగ్గా ఇదే ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. దీన్నే క్విడ్ ప్రోకో అంటారు. ప్రభుత్వం నుంచి మేళ్లు పొందినందుకు ప్రతిఫలంగా పరోక్షంగా డబ్బులు సమకూర్చడం. ఈ విద్యను ప్రదర్శించడంలో జగన్ ఆరితేరారని సీబీఐ అనేక కేసుల్లో వెల్లడి చేసింది. ఒకవేళ ఎవరైనా ప్రశ్నించినా.. 'మా పార్టీ రాజ్యసభ సభ్యుడి కంపెనీ మా ఆఫీసుల నిర్మాణం చేస్తోంది? ఇందులో మీ కొచ్చిన నష్టం ఏమిటి' అని తెలివిగా తప్పించుకోవచ్చు. ఇది జగన్ మాస్టర్ మైండ్.

కారుచౌకగా ఖరీదైన భూములు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలు, ప్రధాన పట్టణాలు, నగరాల్లో జగన్ ప్రభుత్వం వైసీపీ ఆఫీసుల కోసం 2 ఎకరాల చొప్పున అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములను కట్టబెట్టింది. ఇందులో నిషేధిత భూములు, ప్రభుత్వ ప్రయోజనాల కింద 22(ఏ)లో ఉంచిన భూములు, సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఉన్నవి, చెరువు భూములు, ఎయిర్‌పోర్టుల కోసం సేకరించి రిజర్వ్ చేసిన భూములున్నాయి. మార్కెట్ రేటు ప్రకారం ఆ భూముల విలువ 900 కోట్ల పైమాటే అని రెవెన్యూ వర్గాల అంచనా. వాటిని లీజు పేరిట కారుచౌక ధరకు వైసీపీకి జగన్ కట్టబెట్టారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కేటాయింపునకు వీలుకాని భూములను ఏపీఎల్ఎమ్ఏలో ఆమోదింపచేసి లాక్కున్నవైనం బయటపడింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం తాడేపల్లిలోని సెంట్రల్ ఆఫీసే. వందల కోట్ల విలువైన భూములను తీసుకొని వాటికి ఏటా వందల రూపాయల్లో లీజు ఫీజు చెల్లించేలా అనుకూల ఉత్తర్వులు రెవెన్యూ నుంచి తీసుకున్నారు. దేశంలో ఇలాంటి భూముల లీజులు మరెక్కడా చోటు చేసుకోలేదని నిపుణులు చెబుతున్నారు.

ఇది తీవ్రమైన నేరం కాదా?

తాడేపల్లిలో వైసీపీ సెంట్రల్ ఆఫీసు కోసం ఇరిగేషన్ శాఖకు చెందిన అత్యంత ఖరీదైన భూమిని ఇచ్చారు. రెవెన్యూ శాఖ జీఓ 52తో ఆ భూమిని కేటాయించినా దానికి ఇరిగేషన్ శాఖ అనుమతి తప్పనిసరి అని చెప్పింది. కానీ ఆ భూమి ఇచ్చేది లేదని ఇరిగేషన్ విభాగం స్పష్టంగా చెప్పింది. దీంతో భూకేటాయింపు చట్టప్రకారం చెల్లదు. అయినా సరే ఆఫీసు నిర్మాణం చేశారు. ఇది చట్టవ్యతిరేకమని జగన్‌కు తెలియదా? లీజు ప్రాతిపదికన వైసీపీకి కేటాయించిన భూమిపై గుంటూరు జిల్లా అధికార వ్యవస్థతో లిఖిత ఒప్పందం చేసుకోవాలి. ఇరిగేషన్‌తో ఒప్పందం చేసుకోవాలి. అవేవీ చేయలేదు. అయినా ఆఫీసు నిర్మాణం చేస్తున్నారు. ఇది నేరం కాదా? గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డికి ఈ మాత్రం తెలియదా? లీజు ఒప్పందం లేకుండా ఆఫీసు నిర్మాణం చేయకూడదని ఆయన ఎందుకు వైసీపీకి నోటీసు ఇవ్వలేదు? దీన్ని బట్టి ఆ పార్టీకి ఆయన కొమ్ముకాశారని ఇప్పుడు స్పష్టమవుతోంది.

రాంకీ నిర్మిస్తున్న ఆఫీసులివే

- తాడేపల్లిలోని వైసీపీ సెంట్రల్ ఆఫీసు భారీ వ్యయంతో రాంకీ గ్రూప్ నిర్మిస్తోంది. తాడేపల్లి నగర పాలక సంస్థ తనిఖీ రిపోర్టులో ఆ భవన యజమానిగా రాంకీ ఇన్‌ఫ్రానే చేర్చింది.
- విశాఖలో వైసీపీ భవన నిర్మాణం. వ్యయం 2 కోట్ల నుంచి 4 కోట్లకు చేరుకోనుందని అంచనా.
- అనకాపల్లిలో పార్టీ ఆఫీసు
- అన్నమయ్య జిల్లా పార్టీ ఆఫీసు. నిర్మాణ వ్యయం 2.75 కోట్ల రూపాయలు. ఇప్పటికే 1.75 కోట్ల పనులు పూర్తిచేశారు.
- బాపట్ల, పశ్చిమగోదావరిలో ఆఫీసులు
- నరసారావుపేట కార్యాలయం. నిర్మాణ వ్యయం 2 కోట్ల రూపాయలపైనే
- కర్నూలు, నెల్లూరు, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లోని ఆఫీసులను ఈ సంస్థే నిర్మిస్తోంది. రాంకీ ఇంజనీర్లు ఆయా సైట్ల వద్ద నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

'ఉపాధి' అక్రమాలపై పవన్ ఆరా!

- పథకంలో అవినీతిపై నీళ్లు నమిలిన అధికారులు
- సమగ్ర వివరాలతో రావాలని ఆదేశించిన డిప్యూటీ సీఎం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. కేంద్ర నిధులతో నిర్వహిస్తున్న ఉపాధి హామీపై పథకం సోషల్ ఆడిట్ అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ అడిగిన ప్రశ్నలకు సోషల్ ఆడిట్ అధికారులు నీళ్లు నమిలినట్లు సమాచారం. ఉపాధి హామీ పథకంలో ఎంత మొత్తంలో అవినీతి జరిగింది?, తప్పుచేసిన వారి పట్ల ఏం చర్యలు తీసుకున్నారు? తదితర ప్రశ్నలను పవన్ అడిగారు. తనిఖీలు చేయడమే తప్ప చర్యలు తీసుకునే బాధ్యత తమది కాదని అధికారులు చెప్పారు. మరి చర్యలు ఎవరు తీసుకుంటారని పవన్ ప్రశ్నించడంతో వారు సమాధానం చెప్పలేకపోయారు. సోషల్ ఆడిట్ విభాగం ద్వారా రూ.1336.36 కోట్ల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్ డైరక్టర్ సమాధానమిచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి గత ఐదేళ్లు సోషల్ ఆడిట్ నామమాత్రంగానే సాగింది. పథకాన్ని అమలు చేసే క్షేత్రస్థాయి సిబ్బంది కంటే సోషల్ ఆడిట్ విభాగం అవినీతే ఎక్కువైంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది సోషల్ ఆడిట్ అంటేనే హడలిపోయేవారు. వైసీపీ సర్కార్ రాక ముందు సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలకు వచ్చినప్పుడు తప్పు చేసిన ఉపాధి సిబ్బంది భయపడేవారు. కానీ, జగన్ ప్రభుత్వం వచ్చాక సోషల్ ఆడిట్ సిబ్బంది పర్సంటేజీలు దండుకోవడంలో చూపిన శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పనులు జరిగాయా? లేదా? అన్న విషయంపై చూపలేకపోయారు. దీంతోపాటు సోషల్ ఆడిట్ తనిఖీలో వెల్లడైన అవినీతిని సైతం డ్వామా జిల్లా అధికారులు మండల సభలో మాఫీ చేస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి వత్తాసు పలికారు. దీంతో ఐదేళ్లలో ఉపాధి హామీ పథకం అవినీతి మయంగా మారింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ ఒక్కో అంశంపైన అవగాహన చేసుకుని ప్రశ్నిస్తుండడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు.

తిరుమల ప్రక్షాళన జరగాలి!

- శాంతిభద్రతలపై రాజీపడే ప్రసక్తే లేదు
- ఎర్రచందనం అంటేనే భయపడేలా చేస్తా
- హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి



శ్రీవారి ఆలయం ముందు హోంమంత్రి అనిత

తిరుమల, జూన్ 23(ఆంధ్రజ్యోతి): రోజుకు లక్ష నుంచి లక్షాయాభైవేల మంది భక్తులు వచ్చే తిరుమలలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె మీడియాతో మాట్లాడారు. తిరుమలలోని విజిలెన్స్ విభాగాన్ని పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాలామంది 15ఏళ్లుగా తిష్ట వేసుకుని కూర్చున్నారని, ప్రక్షాళన జరగాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. తిరుమల పవిత్రతను కాపాడే బాధ్యతను ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు క్షేమంగా తిరుమలకు వచ్చి తిరిగి వెళ్లేలా పోలీసు, విజిలెన్స్ వ్యవస్థలను పటిష్ఠం చేస్తామని చెప్పారు. తిరుమల, తిరుపతిలో ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి ఎస్పీతో ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఐదేళ్లలో శ్రీవారి భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారని, లడ్డూల్లో నాణ్యత లేకుండా పరిమాణం తగ్గించారని, ఇలాంటి పరిస్థితి ఇకపై ఉండదని చెప్పారు. ఎర్రచందనం జోలికి రావాలంటేనే భయపడేలా తమ ప్రణాళిక ఉంటుందని చెప్పారు. ఐదేళ్లలో ఎర్రచందనం తరలిస్తూ వైసీపీ నాయకులు చేసిన అఘాయిత్యాలు, అరాచకాలు చాలా ఉన్నాయని, అలాంటి వారిపై ఉన్న కేసులన్నీ పరిశీలిస్తామని తెలిపారు. చీరాలలో యువతి హత్య కేసు నిందితులు 36 గంటల్లోనే అరెస్ట్ అయ్యారని, ఈ ప్రభుత్వంలో ఆడపిల్లల రక్షణకు ఉన్న ప్రాధాన్యానికి ఇదే నిదర్శనమన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను కూడా నిర్మూలిస్తామని, వందరోజుల యాక్షన్‌ప్లాన్ సిద్ధంచేశామని చెప్పారు.

నేడు మంత్రివర్గ భేటీ

- ప్రభుత్వ హామీలు, జగన్ అరాచకాలపై చర్చ ?

అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ తొలి మంత్రివర్గ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు సచివాలయ మొదటి బ్లాక్‌లో జరగనుంది. దీనికి సంబంధించిన అజెండా ఇప్పటికే సిద్ధమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, గత ప్రభుత్వం చేసిన అరాచకాలు తదితర అంశాలపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులంతా చేసిన తొలి సంతకాలు, వాటి అమలుపై చర్చించే అవకాశం ఉంది. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ తొలిసారిగా మంత్రివర్గ సమావేశంలో పాల్గొననున్నారు.

రేపు ఎమ్మెల్యేలతో పవన్ భేటీ

అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి):జనసేన పార్టీ ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ మంగళవారం భేటీ కానున్నారు. జనసేన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది తొలిసారి గెలిచిన వారే ఉన్నారు. వారందరికీ శాసనసభ నిబంధనలు, సంప్రదాయాలు, ప్రసంగాలపై శిక్షణ ఇవ్వనున్నారు. పవన్ క్యాంప్ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరగనున్నాయి. గతంలో స్పీకర్‌గా పని చేసిన నాదెండ్ల మనోహర్, డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన మండలి బుద్ధప్రసాద్ కొత్త ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వనున్నారు.

చంద్రన్న బీమా 10లక్షలకు పెంపు!

- త్వరలో వైసీపీ ఖాళీ.. ఎమ్మెల్యేలు జంప్ : మంత్రి సుభాశ్

కాకినాడ సిటీ, జూన్ 23: కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు చేదోడుగా నిలుస్తున్న చంద్రన్న బీమా సొమ్మును రూ.3 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతున్నట్టు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ వెల్లడించారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పుతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వేరే పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని, త్వరలోనే వైసీపీ ఖాళీ అవుతుందని చెప్పారు. ప్రజలు కచ్చితమైన తీర్పు ఇచ్చినా జగన్‌కు ఇంకా జ్ఞానోదయం అవ్వలేదని ఎద్దేవా చేశారు. కాగా, కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సామర్లకోట మండలం వేట్లపాలెం డయేరియా బాధితులను మంత్రి సుభాశ్ పరామర్శించారు.

మా నోటి దూలే మమ్మల్ని ఓడించింది: కాసు



పిడుగురాళ్ల, జూన్ 23: రాష్ట్రంలో వైసీపీ ఘోర పరాజయంపై ఆ పార్టీ నాయకుడు, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో కొందరు నేతలు(టీడీపీ నుంచి వచ్చిన కొడాలి నాని, వల్లభనేని వంశీ, మరికొందరు వైసీపీ నేతలు) విపక్ష నేతలను ముఖ్యంగా చంద్రబాబు, లోకేశ్‌లను నోటికొచ్చినట్టు తిట్టిన కారణంగా ప్రజలు తమకు దూరమయ్యారని తెలిపారు. అదేసమయంలో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేసి, జైల్లో ఉంచడంతో ఆ పార్టీ నేతల్లో కసి పెరిగి, ఎన్నికల ప్రచారంలో విజృంభించి విజయం సాధించారని అన్నారు. తమ హయాంలో నాసిరకం మద్యం బ్రాండ్ల అమ్మకం కూడా ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచిందన్నారు. మద్యం అలవాటు ఉన్నవారు ఎవరూ వైసీపీకి ఓటు వేయలేదని కాసు పేర్కొన్నారు. అదేవిధంగా ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటివి కూడా అన్నివర్గాల ప్రజలపై ప్రభావం చూపిందని, అందుకే వైసీపీ ఓడిపోయిందని తెలిపారు.



అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

27న రామోజీరావు సంస్మరణ సభ

- తాడిగడప అనుమోలు గార్డెన్స్‌లో నిర్వహణ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రులు

పెనమలూరు (కృష్ణాజిల్లా), జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 27న జరిగే ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సంస్మరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాడిగడపలోని వందడుగుల రోడ్డులో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో వారిద్దరూ ఆదివారం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రామోజీరావు జీవిత విశేషాలు, పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలపై అనుమోలు గార్డెన్సులో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతో పాటు షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శన నిర్వహించాలన్నారు. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి వస్తున్నందున గ్రీన్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాలను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, ఢిల్లీరావు పాల్గొన్నారు.

4 రోజులు అక్కడక్కడా భారీ వర్షాలు



విజయవాడ బెంజిసర్కిల్ వద్ద జోరువాన

అమరావతి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా పిడుగులతో కూడిన భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు ఉంటాయని వివరించింది.

బెజవాడలో భారీ వర్షం

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయగా, సాయంత్రం నుంచి మబ్బులతో కూడిన వాతావరణం కనిపించింది. కాసేపటికి భోరున వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి.

జీఓ 117 రద్దు చేయాలి

- తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 117 వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలు సింగిల్‌స్కూల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోయి మూతపడే దశలో ఉన్నాయని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం టీడీపీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల టీడీపీ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఇసుకపై అదే బాణీ!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్జీటీ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. ఇదే కేసులో గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ ఇంప్లీడ్ అయ్యారు. ఇసుక అక్రమాలు భారీగా జరిగాయని, జేపీ వెంచర్స్‌పై చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. ఈ అంశంపై ప్రస్తుతం సుప్రీం కోర్టు విచారిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీ వెలువరించిన తీర్పును కూడా సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకొంది. మే నెలలో విచారణ జరిగినప్పుడు రాష్ట్రంలో అక్రమ తవ్వకాలు జరగడం లేదని గనుల శాఖ అఫిడవిట్ వేసింది. కౌంటర్‌గా నాగేంద్రకుమార్ ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టుకు కీలక ఆధారాలు సమర్పించారు. అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాల అక్షాంశ, రేఖాంశాలతో కూడిన ఫొటోలు, జియో ట్యాగింగ్ చేసిన ఫొటోలను కోర్టు పరిశీలనకు తీసుకెళ్లారు. దీంతో గనుల శాఖ వాదనపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే జిల్లా కలెక్టర్లతో విచారణ జరిపించి నివేదిక ఇప్పించాలని ఆదేశించింది. ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని, అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ మే 14వ తేదీన ఉత్తర్వులు ఇచ్చింది. సుప్రీం ఆదేశాల మేరకు నివేదిక ఇవ్వాలని గనుల శాఖ కలెక్టర్లను ఆదేశించింది. అయితే ఆ నివేదిక ఎలా ఉండాలో? ఎలా ఉండకూడదో? ఓ ఉన్నతస్థాయి అధికారి ముందుగానే కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారని తెలిసింది. దీంతో కలెక్టర్లు ఆయన మాటను తుచ తప్పకుండా పాటించి నివేదికలు ఇచ్చారని తెలిసింది. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడి తెలుగుదేశం కూటమి విజయం సాధించిన తర్వాత కూడా జగన్ సర్కారుకు అనుకూలంగా ఆ అధికారి అనుకూల నివేదికలు కోరినట్లు తెలిసింది. ఆయన చెప్పినట్టుగానే కలెక్టర్లు నివేదికలు పంపించినట్లు సమాచారం. వీటిని క్రోడీకరించి గనుల శాఖ తరఫున ఓ నివేదిక, కలెక్టర్ల నివేదికలను విడిగా ఈ నెల 9వ తేదీన సుప్రీం కోర్టుకు నివేదించినట్లు తెలిసింది.

కేంద్ర నివేదికతో గుట్టురట్టు?

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలోని నిపుణులతో అధ్యయనం చేయించి నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర అధికారుల బృందం మే 18-25 మధ్య రాష్ట్రంలోని పలు రీచ్‌లను పరిశీలించినట్లు తెలిసింది. ప్రత్యేకంగా సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఫిబ్రవరిలోనూ కేంద్ర పర్యావరణ అధికారుల బృందం ఏపీలో పర్యటించి అక్రమ తవ్వకాలను స్పష్టంగా బయటపెట్టింది. ఇప్పుడు కూడా కేంద్ర బృందం వాస్తవాలతో కూడిన నివేదికలను ఇవ్వనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో సుప్రీం కోర్టు ముందు ఏపీ గనుల శాఖ ద్వారా వెళ్లిన కలెక్టర్ల నివేదికల అసలు గుట్టు రట్టు కానుందని చెబుతున్నారు. కేంద్ర బృందం నివేదికకు, కలెక్టర్ల నివేదికలోని తేడాలను కోర్టు గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉందని సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు.

జగన్ రాసిచ్చారు.. బాబు ఏం చేస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ, ప్రైవేటు భూములను తన వారికి కట్టబెడుతూ నిర్ణయాలు తీసుకున్నారు. తమ భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించకపోయినా.. బుల్‌డోజ్ చేసుకుంటూ జగన్ ముందుకే వెళ్లారు. ప్రకృతి సంపదైన నదులు, అడవులను సొంతవారికి జగన్ కట్టబెట్టడాన్ని ప్రతిపక్షనేతగా అప్పట్లో చంద్రబాబు తీవ్రంగా నిరసించారు. అయితే, ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ హయాంలో దోచిపెట్టిన వాటిని తిరిగి వెనక్కి తీసుకుంటారా? నాడు జరిగిన తప్పులను నేడు సరిదిద్దుతారా? రాష్ట్ర ఆదాయాన్ని పెంచే నిర్ణయాలు తీసుకుంటారా? జగన్ తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షిస్తారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. త్వరలోనే సీఎం చంద్రబాబు చేపట్టే విద్యుత్తు సమీక్షలో జగన్ హయాంలో జరిగిన అడ్డగోలు కేటాయింపులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాలి.

జగన్ చేసిన అడ్డగోలు కేటాయింపులు ఇవీ..


లొకేషన్	మెగావాట్లు	ప్రాజెక్టు కేటాయింపు
గండికోట	1000	అదానీ
చిత్రావతి	500	అదానీ
కురుకుర్తి	1200	అదానీ
కర్రివలస	1000	అదానీ
పెదకోట	1500	అదానీ
రైవాడ	1000	అదానీ
పైడిపాలెం ఈస్ట్	1200	ఇండోసోల్
అవుకు	800	అరబిందో రియాలిటీస్ అండ్ ఇన్‌ఫ్రా
శింగనమల	800	అరబిందో రియాలిటీస్ అండ్ ఇన్‌ఫ్రా
సోమశిల	900	షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్
యెర్రవరం	1200	షిరిడి సాయి ఎలక్ట్రికల్స్
వేంపల్లి	1500	జేఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్
పిన్నవరం	1680	మెసర్స్ గ్రీన్‌కో
వొంగిమల	1800	మెసర్స్ ఆస్త గ్రీన్ ఎనర్జీ

చెవిరెడ్డి చేతికి ఆర్టీసీ స్థలాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిళ్లు తెచ్చి తప్పుకొనేలా చేశారు. ఆర్టీసీ అధికారులను సైతం తన దారిలోకి తెచ్చుకున్నారు. చివరికి తన కుమారుడు మోహిత్‌రెడ్డి పేరుతో రాష్ట్రంలోని 17 ఆర్టీసీ బస్టాండ్‌లలో ఉన్న ఖాళీ స్థలాలను చేజిక్కించుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు బస్టాండ్ ఆవరణలో ఉన్న స్థలంలో పనులు చేస్తుండగా జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఆదివారం అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భూభాగోతం వెలుగు చూసింది.

చెవిరెడ్డి ఓ ప్రైవేటు మాల్‌కు 70 ప్రాంతాల్లో అవసరమైన స్థలాలను లీజు పద్ధతిన ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీనికిగాను ఆర్టీసీ ఆస్తులపై కన్నేశారు. పార్టీ పెద్దలతో సంస్థ అధికారులపై ఒత్తిడి తెప్పించి అభివృద్ధి, ఆదాయం పేరుతో రాష్ట్రంలోని ఆర్టీసీ స్థలాల లీజుకు టెండర్లు పిలిపించినట్లు తెలుస్తోంది. అయితే టెండర్లు వేసిన సంస్థలను కూడా నయానో, భయానో పక్కకు తప్పించి మొత్తం 17 ప్రాంతాల్లో ఆర్టీసీ స్థలాలను ఆయన దక్కించుకున్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌కు ఒక నెల ముందు ఆర్టీసీ ఆస్తుల లీజుకు సంబంధించి ఆ సంస్థ ప్రకటన చేసింది. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్థలానికి మంచి గిరాకీ ఉంది. రూ.20 కోట్ల విలువ చేసే సుమారు 40 సెంట్ల స్థలాన్ని పదిహేనేళ్లపాటు నెలకు రూ.1.80 లక్షలు చెల్లించేలా అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ క్రమంలో చెవిరెడ్డి తన కుమారుడు మోహిత్‌రెడ్డి పేరుతో టెండర్ దాఖలు చేశారు. ఆయనకన్నా ఇద్దరు ఎక్కువ ధర కోట్ చేశారు. వారిలో ఒక మహిళ, ప్రైవేటు డాక్టర్ ఉన్నారు. చెవిరెడ్డి వారిద్దరినీ బెదిరించి తప్పుకొనేలా చేసినట్లు ఆరోపణలున్నాయి. అదేసమయంలో నెల్లూరులో ఆర్టీసీ ఉన్నతాధికారికి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లు సమాచారం. దీంతో మూడో వ్యక్తిగా ఉన్న మోహిత్‌రెడ్డికి నెలకు రూ.2.40 లక్షలు అద్దె చెల్లించేలా టెండర్ దక్కింది.



ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో లీజుకు కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులు

లీజు టెండర్లు రద్దు చేయాలి: దామచర్ల

ఐదేళ్లపాటు ఇష్టారాజ్యంగా ప్రైవేటు, ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వైసీపీ నేతలు ఆర్టీసీ ఆస్తులపైనా కన్నేయడం దుర్మార్గమని ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 ఆర్టీసీ డిపోల పరిధిలో లీజు పద్ధతిన కేటాయించిన ఆస్తులను కాపాడుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకు పిలిచిన టెండర్లు రద్దు చేయిస్తామన్నారు.

బిజినెస్

శ్రీ సిటీ కంప్రెసర్స్ ప్లాంట్ విస్తరణ: డైకిన్

న్యూఢిల్లీ: డైకిన్ ఎయిర్‌కండిషనింగ్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్, శ్రీసిటీలోని తన కంప్రెసర్ల ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందు కోసం మరో 33 ఎకరాల భూమిని తీసుకుంది. 2030 నాటికి ఈ విస్తరణ పూర్తయితే కంప్రెసర్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షల యూనిట్లకు చేరుతుందని కంపెనీ సీఎండీ కన్వల్‌జీత్ జావా తెలిపారు. ఇందులో 40 లక్షల యూనిట్లు భారత్‌లో అమ్ముడుపోయినా, మిగతా 10 లక్షల యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 20 లక్షల ఎయిర్ కండీషనర్స్ (ఏసీ) విక్రయించాలని డైకిన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే ఏడు లక్షల యూనిట్లు కంపెనీ విక్రయించింది.

ఈ ఏడాది 400 కొత్త శాఖలు

ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్తగా 400 శాఖలు ప్రారంభించనుంది. గత ఏడాది బ్యాంక్ 137 కొత్త బ్రాంచీలు ప్రారంభించింది. వాటిలో 59 కొత్త గ్రామీణ బ్రాంచీలున్నాయి. బ్రాంచీల ద్వారా అడ్వైజరీ, వెల్త్ సర్వీసులను బ్యాంక్ అందించనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చి ముగిసే నాటికి ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా 22,542 బ్రాంచీలను నిర్వహిస్తోంది.

ఓఎన్‌జీసీకి గుదిబండగా దీన్ దయాళ్ బ్లాక్

సహజ వాయువు నిల్వలపై 'గ్యాస్' కొట్టిన జీఎస్‌పీసీ

న్యూఢిల్లీ: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని దీన్ దయాళ్ వెస్ట్ బ్లాక్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి గుదిబండలా మారింది. 2017 జనవరిలో గుజరాత్ ప్రభుత్వ రంగంలోని గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ (జీఎస్‌పీసీ) ఈ క్షేత్రంలో తనకు ఉన్న 80 శాతం వాటాను ఓఎన్‌జీసీకి 120 కోట్ల డాలర్లకు విక్రయించింది. కేంద్ర ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఓఎన్‌జీసీ ఈ బ్లాక్‌ను కొనుగోలు చేసిందని అప్పట్లోనే వార్తలు గుప్పుమన్నాయి.

అరకొర నిక్షేపాలే: ఓఎన్‌జీసీకి ఈ బ్లాక్‌ను విక్రయించే సమయంలో ఈ క్షేత్రంలో దాదాపు 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయని, రోజూ 20 నుంచి 30 కోట్ల ఘనపుటడుగుల గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని జీఎస్‌పీసీ చెప్పింది. తీరా చూస్తే ఇక్కడ ఉన్న గ్యాస్ నిక్షేపాలు 1.94 టీసీఎఫ్ మాత్రమేనని తేలింది. అయినా ఆశ చావక ఓఎన్‌జీసీ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ఈ బ్లాక్‌లో ఇప్పటి వరకు మొత్తం ఏడు బావులు డ్రిల్లింగ్ చేసింది. అందులో నాలుగు బావుల్లో మాత్రమే స్వల్ప పరిమాణంలో గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయి. మరో మూడు బావుల్ని వివిధ సాంకేతిక సవాళ్లతో మూసేయాల్సి వచ్చింది.

ఆశ చావని ఓఎన్‌జీసీ: దీన్ దయాళ్ వెస్ట్ బ్లాక్‌పై ఓఎన్‌జీసీకి ఇప్పటికీ ఆశ చావలేదు. మంచి టెక్నాలజీ, పుష్కలంగా నిధులు ఉన్న విదేశీ ఆయిల్ కంపెనీలతో ఈ బ్లాక్‌లో మరోసారి అన్వేషణ చేయించి, మరిన్ని బావులు తవ్వాలని నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ముందుకు వస్తే ఆ సంస్థలకు కొంత భాగస్వామ్యం కూడా ఇస్తామని తాజాగా టెండర్ ఫ్లోట్ చేసింది. ఆసక్తి ఉన్న సంస్థలు ఈ ఏడాది సెప్టెంబరు 12లోగా తమ బిడ్స్ సమర్పించాలని కోరింది. ఈ బ్లాక్ కొన్న పాపానికి ఓఎన్‌జీసీకి ఇప్పటికే చేతి చమురు వదిలించుకోవటమే కాకుండా కంపెనీ రిజర్వు నిధులు తగ్గిపోయాయి. జీఎస్‌పీసీ మాత్రం ఓఎన్‌జీసీ చెల్లించిన డబ్బులతో తన అప్పులు గణనీయంగా తగ్గించుకుంది.

సేల్స్ రిటర్న్ సవరించే సౌలభ్యం

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మండలి, జీఎస్‌టీ చెల్లింపుదారులకు మరో సౌలభ్యం కల్పించింది. పన్ను చెల్లింపునకు ముందు తమ సేల్స్ రిటర్న్ (జీఎస్‌టీఆర్-1)ను సవరించే ఆప్షన్ కల్పించింది. నెల లేదా మూడు నెలలకు కలిపి ఈ ఆప్షన్ లభిస్తుంది. ఈ ఆప్షన్ ఉపయోగించుకోవాలనుకునే పన్ను చెల్లింపుదారులు జీఎస్‌టీఆర్-1ఏ ద్వారా ఈ ఆప్షన్ ఉపయోగించుకోవచ్చు. జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ఫైల్ చేసే లోపే ఈ ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలి.

గౌతమ్ అదానీ వార్షిక జీతం రూ. 9.26 కోట్లు



ఏఈఎల్ డైరెక్టర్ వార్షిక జీతం రూ.89.37 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ.. రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద సంపన్నుడు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ తాజా ఇండెక్స్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ 10,600 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.85 లక్షల కోట్లు). అంతర్జాతీయంగా చూస్తే 14వ అతిపెద్ద సంపన్నుడు. అయితే గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో గౌతమ్ అదానీ తన గ్రూప్‌లోని కంపెనీల నుంచి తీసుకున్న జీతభత్యాలు మాత్రం రూ.9.26 కోట్లు మాత్రమే. అదే అదానీ గ్రూప్‌లోని ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) డైరెక్టర్ వినయ్ ప్రకాష్ తీసుకున్న జీతభత్యాలు అక్షరాలా రూ.89.37 కోట్లు. కుటుంబాల నిర్వహణలోని ఇతర పారిశ్రామికవేత్తలతో పోల్చినా.. ఒక్క ముకేశ్ అంబానీ తప్ప మిగతా అందరూ గత ఆర్థిక సంవత్సరం గౌతమ్ అదానీ కంటే భారీగా జీతభత్యాలు తీసుకున్నారు. అంబానీ మాత్రం కొవిడ్ టైమ్ నుంచి ఆర్ఐఎల్ నుంచి పైసా కూడా జీతం తీసుకోవడం లేదు.

ఎందుకంటే: గత ఏడాది అదానీ గ్రూప్‌నకు పెద్ద పీడకల. హిండెన్‌బర్గ్ రీసెర్చి అనే అమెరికా షార్ట్ సెల్లింగ్ కంపెనీ రిపోర్ట్‌తో గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ ఒక్కసారిగా 15,000 కోట్ల డాలర్లు తుడిచి పెట్టుకుపోయింది. దాంతో అదానీ తన గ్రూప్‌లోని పది లిస్టెడ్ కంపెనీల్లో రెండు కంపెనీలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ నుంచి మాత్రమే జీతం తీసుకుని, మిగతా ఎనిమిది కంపెనీల నుంచి పైసా కూడా తీసుకోలేదు. ఈ కారణంగానే గత ఆర్థిక సంవత్సరం గౌతమ్ అదానీ తీసుకున్న జీతభత్యాలు రూ.9.26 కోట్లకు పరిమితమయ్యాయి.

కొత్త ఇళ్ల సరఫరా తగ్గింది

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని బిల్డర్లు తక్కువ ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభించిటంతో దేశంలోని 9 ప్రధాన నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 13 శాతం మేరకు తగ్గినట్టు ప్రాప్ ఈక్విటీ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో 1,11,657 గృహాలు అందుబాటులోకి రాగా ఈ ఏడాది వాటి సంఖ్య 97,331కే పరిమితం కావచ్చని పేర్కొంది. ప్రధానంగా పుణె, హైదరాబాద్‌లలో తక్కువ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని ప్రాప్ ఈక్విటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ జసూజా అన్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో కొత్త గృహాల సరఫరా 36 శాతం తగ్గి 18,232 యూనిట్ల నుంచి 111,603 యూనిట్లకే పరిమితం కానున్నట్టు ఆయన చెప్పారు. ఇళ్ల అమ్మకాలు కూడా ఈ త్రైమాసికంలో 2 శాతం తగ్గి 1,21,856 యూనిట్ల నుంచి 1,19,901 యూనిట్లకు పరిమితం కావచ్చని ఆ నివేదిక పేర్కొంది.

23,700 పైన బుల్లిష్

(జూన్ 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,671-23,398 పాయింట్ల మధ్యన కదలాడి 35 పాయింట్ల లాభంతో 23,501 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23700 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,538, 23,488, 23,218, 22,956 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

టెక్ వ్యూ

బ్రేకౌట్ స్థాయి: 23,700 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,200

నిరోధ స్థాయిలు: 23,700, 23,800, 23,900 (23,600 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,300, 23,200, 23,100 (23,400 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

బ్యాంక్, ఐటీ రంగాల్లో బేరిష్‌నెస్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరటంతో కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. అయితే కొత్త ప్రభుత్వ విధానాలు, జీఎస్‌టీ మండలి తీసుకున్న నిర్ణయాలను బట్టి వాటి గమనం ఉంటుంది. నిఫ్టీకి 23,440 పాయింట్ల వద్ద బలమైన మద్దతు ఉంది. ఒకవేళ ఈ స్థాయిలను బ్రేక్ చేయలేని పక్షంలో 23,370/23,390/23,180 స్థాయిలకు రావచ్చు. వ్యవసాయ, పురుగు మందులు, ఎరువులు, రియల్టీ, ఇన్‌ఫ్రా షేర్లకు గిరాకీ పెరిగే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఐటీ రంగాల్లో బేరిష్‌నెస్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

జెఎస్‌డబ్ల్యూ స్టీల్: కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో చలిస్తూ వస్తున్న ఈ కౌంటర్‌లో మళ్లీ మూమెంటమ్ కనిపిస్తోంది. రూ.915 వద్ద కీలక నిరోధాన్ని బ్రేక్ చేసింది. పైగా ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. కన్సాలిడేషన్ పూర్తయినట్టు కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.936 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.910/930 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.975/1,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.870 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో 13 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం రూ.6,000 స్థాయిలో ప్రైస్ యాక్షన్ జరుగుతోంది. వాల్యూమ్ విపరీతంగా నమోదవుతుండటంతో పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. గత శుక్రవారం రూ.6,011 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.6,000/5,960 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,910 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్‌వీఎన్ఎల్: ఈ కౌంటర్‌లో అనేక సానుకూలతలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైల్వేకు ప్రాధాన్యతను కొనసాగించటం, కొత్త ఆర్డర్లు రావటంతో షేరు ధర పుంజుకుంటోంది. పైగా అవసరమైన కరెక్షన్ కూడా జరిగింది. క్రితం వారం నెల గరిష్ఠాలను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు రూ.409 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.405 శ్రేణిలో ప్రవేశించి రూ.425/433 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాన్యూల్స్ ఇండియా: కన్సాలిడేషన్ అనంతరం ఈ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని చేరుకుంది. మంచి వాల్యూమ్ జనరేట్ అవుతోంది. పైగా అనిశ్చితి తక్కువగా ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.490 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.480 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.555/575 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.465 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బయోకాన్: ఈ షేరు మంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తోంది. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత అక్యుములేషన్ జరిగింది. పైగా రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.345 వద్ద ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.330 స్థాయిల్లో ఎంటరై రూ.455/475 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.309 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

23,400 దిగువన బలహీనం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై 23,600 స్థాయిని దాటినప్పటికీ తదుపరి నాలుగు సెషన్లలో పలు ఇంట్రాడే రియాక్షన్ల కారణంగా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. పలు ప్రయత్నాలు చేసినా నిలదొక్కుకోలేకపోవడం వల్ల ఇది బలమైన నిరోధ స్థాయిగా మారింది. ఇప్పుడు ఈ స్థాయి కీలకంగా మారింది. కాని అన్ని కరెక్షన్లలోనూ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం వల్ల ఇప్పటికీ అప్‌ట్రెండ్‌లోనే ఉంది. గతవారం పరిమిత పరిధిలో 23,650, 23,400 పాయింట్ల మధ్యన కదలాడి ఎట్టకేలకు 35 పాయింట్ల స్వల్పలాభంతో 23,500 వద్ద ముగిసింది. గత వారంలో మిడ్‌క్యాప్-100 సూచీ 200 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 190 పాయింట్లు లాభపడ్డాయి. ఏది ఏమైనా గత వారంలో గరిష్ఠ స్థాయిల్లో ఎలాంటి భారీ కదలికలు లేకుండా అనిశ్చిత స్థితిని ప్రదర్శించింది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశించి సరికొత్త శిఖరాలకు చేరాలంటే ప్రధాన నిరోధం 23,650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధులు 23,800, 24,000.

బేరిష్ స్థాయిలు: కరెక్షన్‌లో పడి మైనర్ మద్దతు స్థాయి 23,400 కన్నా దిగజారితే మైనర్ బలహీనత ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,400. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరో ప్రధాన మద్దతు స్థాయి 23,000. ఇది స్వల్పకాలిక బలహీనత సంకేతం.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం బలమైన ర్యాలీ సాధించి 1,650 పాయింట్ల మేరకు లాభపడింది. 52,000 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్ సాధించింది. ఇదే ప్రధాన నిరోధ స్థాయి అయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 51,300,ప్రధాన మద్దతు స్థాయి 51,000.

పాటర్న్: సానుకూలత కోసం మార్కెట్ 23,650 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"ను బ్రేకర్ చేయాలి. 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,580, 23,650
మద్దతు	23,455, 23,400

www.sundartrends.in

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x దక్షిణాఫ్రికా (ఉ.6. గం.)

భారత్ x ఆస్ట్రేలియా (రా.8. గం.)

జయహో.. శ్రీజ

సింగిల్స్, డబుల్స్ టైటిళ్లతో చరిత్ర

● డబ్ల్యూటీటీ కంటెండర్



లాగోస్ (నైజీరియా): డబ్ల్యూటీటీ కంటెండర్ సింగిల్స్ టైటిల్ సాధించిన తొలి భారత ప్లేయర్‌గా తెలుగమ్మాయి ఆకుల శ్రీజ చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, అర్చనా కామత్‌తో కలసి డబుల్స్ టైటిల్‌నూ సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 4-1తో డింగ్ యిజీ (చైనా)పై విజయం సాధించింది. అనంతరం సహచర జంట దియా చిటాలే-యశస్విని గోర్పడేతో జరిగిన డబుల్స్ ఫైనల్లో శ్రీజ-అర్చన జోడీ 3-0తో అలవోకగా నెగ్గింది. ఇలా.. ఈ మెగా టోర్నీలో శ్రీజ రెండు టైటిళ్లతో 'డబుల్' సాధించి తనకు తిరుగులేదని నిరూపించింది. అలాగే హర్మీత్ దేశాయ్-మానవ్ టక్కర్ జోడీ కంటెండర్ టైటిల్ నెగ్గిన తొలి భారత పురుషుల జోడీగా రికార్డులకెక్కింది.

మరొక్కటి చాలు..

సెమీస్ లక్ష్యంగా బరిలోకి భారత్

నేడు ఆస్ట్రేలియాకు చావోరేవో



టీ20 వరల్డ్‌కప్

గ్రాస్ ఐలెట్: అఫ్ఘానిస్థాన్ సంచలన విజయంతో రసవత్తరంగా మారిన గ్రూప్ 1లో మరో ఆసక్తికరపోరుకు తెర లేవనుంది. ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న భారత జట్టు సోమవారం ఆస్ట్రేలియాతో అత్యంత కీలక మ్యాచ్ ఆడబోతోంది. ఎందుకంటే.. సూపర్-8లో 4 పాయింట్లతో ఉన్న టీమిండియా సెమీస్ చేరాలంటే మరొక్క విజయం చాలు. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా.. రన్‌రేట్ మెరుగ్గానే ఉండడంతో భారత్‌కు ఆందోళన లేదు. కానీ ఓటమి మరీ భారీ తేడాతో ఉండకుండా చూసుకోవాలి. అటు ఆసీస్ పరిస్థితే దయనీయంగా ఉంది. ఆదివారం అఫ్ఘాన్ చేతిలో పరాభవం కంగారూల అవకాశాలను సంక్లిష్టం చేసింది. దీంతో చావోరేవో లాంటి ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ఆసీస్‌కు సెమీస్‌పై ఆశలుంటాయి. అదే సమయంలో తమకు పోటీగా ఉన్న అఫ్ఘాన్ జట్టు బంగ్లాదేశ్‌పై ఓడాల్సి ఉంటుంది. కాగా.. ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గితే గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి బాకీని కూడా తీర్చుకున్నట్టవుతుంది.

ఒత్తిడిలో కంగారూలు: అఫ్ఘాన్‌ను తేలిగ్గా తీసుకుంటే ఏమవుతుందో తెలుసుకున్న కంగారూలు.. తీవ్ర ఒత్తిడిలో భారత్‌ను ఎదుర్కోబోతున్నారు. వరుస విజయాలతో ఉన్న రోహిత్ సేనను అడ్డుకోవాలంటే ఆసీస్ ఏమరుపాటు లేకుండా ఆడక తప్పదు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో గణనీయంగా మెరుగుపడాల్సి ఉంది.

పిచ్, వాతావరణం

మ్యాచ్ రోజు ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. బలమైన గాలులతో పాటు వర్షం కురిసే అవకాశం 55 శాతంగా ఉండడంతో, మ్యాచ్‌కు ఆటంకం కలగవచ్చు. ఇక్కడి మైదానంలో వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే చాన్సుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్.

ఆస్ట్రేలియా: హెడ్, వార్నర్, మార్ష్ (కెప్టెన్), మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, డేవిడ్, వేడ్, కమిన్స్, స్టార్క్, జంపా, హాజెల్‌వుడ్.

ఆసీస్‌కు అఫ్ఘాన్ షాక్

● 21 పరుగులతో విజయం
● దెబ్బకొట్టిన నైబ్, నవీనుల్
● కమిన్స్ హ్యాట్రిక్ వృథా



గుల్బదిన్ నైబ్ (4/20)

1 ఏ ఫార్మాట్‌లోనైనా ఆస్ట్రేలియాపై అఫ్ఘాన్‌కు ఇదే తొలి విజయం.

కింగ్స్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘానిస్థాన్ పెనుసంచలనం సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై తొలిసారి జయకేతనం ఎగురవేసింది. బ్యాటింగ్‌కు సవాల్‌గా మారిన పిచ్‌పై 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బదిన్ నైబ్ (4/20) స్లో బాల్స్‌తో కంగారూల వెన్నువిరవడంతో.. 149 పరుగుల లక్ష్యాన్ని అద్భుతంగా కాపాడుకొన్న అఫ్ఘాన్ సెమీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8 గ్రూప్-1లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 21 పరుగుల తేడాతో ఆసీస్‌పై చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 148/6 స్కోరు చేసింది. జంపా రెండు వికెట్లు పడగొట్టాడు. పేలవంగా ఫీల్డింగ్ చేసిన ఆసీస్ ఐదు క్యాచ్‌లను జారవిడిచింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (60), ఇబ్రహీం జద్రాన్ (51) అర్ధ శతకాలతో అదరగొట్టారు. అయితే, 16వ ఓవర్‌లో జద్రాన్‌ను జంపా అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఒమర్‌జాయ్ (2)ను కూడా జంపా వెనక్కిపంపాడు. ధాటిగా ఆడుతున్న గుర్బాజ్‌ను స్టోయినిస్ వెనక్కిపంపాడు. రషీద్ (2), కరీమ్ జనత్ (13), నైబ్ (0)ను అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసిన కమిన్స్.. అఫ్ఘాన్ స్కోరు 150 మార్క్ చేరకుండా అడ్డుకొన్నాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో ఆసీస్ 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. నవీనుల్ 3 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలోనే హెడ్ (0), కెప్టెన్ మిచెల్ మార్ష్ (12), వార్నర్ (3) వికెట్లను చేజార్చుకొన్న ఆసీస్ 32/3తో కష్టాల్లో పడింది. అయితే, స్టొయినిస్ (11), టిమ్ డేవిడ్ (2)తోపాటు ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న మ్యాక్స్‌వెల్‌ను నైబ్ అవుట్ చేయడంతో ఆసీస్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది.

పాయింట్ల పట్టిక గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	2.425
ఆస్ట్రేలియా	2	1	1	0	2	0.223
అఫ్ఘాన్	2	1	1	0	2	-0.650
బంగ్లాదేశ్	2	0	2	0	0	-2.489

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 148/6 (గుర్బాజ్ 60, జద్రాన్ 51; కమిన్స్ 3/28, జంపా 2/28).

ఆస్ట్రేలియా: 19.2 ఓవర్లలో 127 ఆలౌట్ (మ్యాక్స్‌వెల్ 59; నైబ్ 4/20, నవీనుల్ 3/20).

ఒకే ఒక్కడు



ఆసీస్ పేసర్ కమిన్స్ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించాడు. సూపర్-8లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి హ్యాట్రిక్ సాధించిన కమిన్స్.. అఫ్ఘాన్ మ్యాచ్‌లో మరోసారి వరుసగా మూడు వికెట్లు పడగొట్టాడు. 18వ ఓవర్ చివరి బంతికి రషీద్‌ను అవుట్ చేసిన కమిన్స్.. 20వ ఓవర్ తొలి బంతికి జనత్, ఆ తర్వాతి బంతికి గుల్బదిన్‌ను అవుట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో పొట్టి కప్‌లో డబుల్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

ధీరజ్ కంచు మోత



అంటాల్యా (టర్కీ): వరల్డ్‌కప్ స్టేజ్-3లో రికర్వ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ఒకే రోజు రెండు కాంస్యాలతో అదరగొట్టాడు. పురుషుల వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో ధీరజ్ 7-3తో మార్కో నెస్పోలిపై గెలిచాడు. మిక్స్‌డ్‌లో భజన్ కౌర్-ధీరజ్ జంట.. కాంస్య పతక మ్యాచ్‌లో 5-3తో వేలన్సియా-గ్రాండీ (మెక్సికో)పై గెలిచింది. మొత్తంగా ఈవెంట్‌ను భారత్ 4 మెడల్స్ సాధించింది.

బెల్జియం బోణీ

యూరో కప్

కొలోన్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్ తొలి మ్యాచ్‌లో స్లొవేకియా చేతిలో కంగుతిన్న బెల్జియం అద్భుతంగా పుంజుకుంది. గ్రూప్ 'ఈ'లో ఆదివారం జరిగిన కీలక మ్యాచ్‌లో బెల్జియం 2-0తో రొమేనియాను చిత్తు చేసి టోర్నీలో బోణీ చేసింది. రెండో నిమిషంలో యూరీ టీలేమన్స్, 80వ నిమిషంలో కెవిన్ డి బ్రూయిన్ గోల్స్ కొట్టారు.

బజ్‌రంగ్‌పై మళ్లీ సస్పెన్షన్

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాను జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) రెండోసారి సస్పెండ్ చేసింది. మార్చి 10న సోనెపట్‌లో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్ సందర్భంగా డోపింగ్ పరీక్షకు మూత్రపు నమూనాను ఇచ్చేందుకు నిరాకరించడంతో బజ్‌రంగ్‌ను గతంలో నాడా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే నోటీసు ఇవ్వకుండా బజ్‌రంగ్‌పై చర్య తీసుకున్నారంటూ అతడిపై సస్పెన్షన్‌ను మే 31న నాడా క్రమశిక్షణ కమిటీ ఎత్తివేసింది. బజ్‌రంగ్‌కు 'నాడా' నోటీసు ఇచ్చేవరకు సస్పెన్షన్ ఎత్తివేత అమలులో ఉంటుందని ఆ సందర్భంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో.. నిబంధనల్ని ఉల్లంఘించిన బజ్‌రంగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు నాడా అతడికి ఆదివారం నోటీసు జారీ చేసింది.

మెరిసిన మంధాన

మూడో వన్డేలోనూ సఫారీల ఓటమి

భారత్ క్లీన్‌స్వీప్



బెంగళూరు: దక్షిణాఫ్రికాతో తొలి రెండు వన్డేల్లో సెంచరీలతో రికార్డు సృష్టించిన టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన..మూడో మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించింది. అయితే త్రుటిలో శతకాన్ని చేజార్చుకుంది. మంధాన (83 బంతుల్లో 11 ఫోర్లతో 90) దూకుడుతో ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ఘన విజయం సాధించింది. దాంతో మూడు వన్డేల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన క్లీన్ స్వీప్ చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 215/8 స్కోరు చేసింది. కెప్టెన్ వోల్వార్ట్ (61) అర్ధ శతకంతో ఆదుకుంది. దీప్తిశర్మ, అరుంధతి చెరో 2 వికెట్లు తీశారు. మాదిరి లక్ష్యాన్ని భారత్ 40.4 ఓవర్లలో 220/4 స్కోరుతో ఛేదించింది. మంధానకు తోడు కెప్టెన్ హర్మన్ (42) సత్తా చాటింది. దీప్తిశర్మ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, మంధాన 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. రెండు జట్ల మధ్య ఏకైక టెస్ట్ శుక్రవారం నుంచి చెన్నైలో జరుగుతుంది.

సెమీస్‌లో ఇంగ్లండ్

బట్లర్ తుఫాన్ ఇన్నింగ్స్
జోర్డాన్ హ్యాట్రిక్
యూఎస్‌పై ఘనవిజయం



బట్లర్ (83 నాటౌట్)

బ్రిడ్జ్‌టౌన్: ఓ దశలో సూపర్-8లో చోటు ప్రశ్నార్థకంగా మారిన ఇంగ్లండ్ అందరికన్నా ముందే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. పేసర్ జోర్డాన్ హ్యాట్రిక్ (4/10)తో చెలరేగగా.. ఆ తర్వాత కెప్టెన్ బట్లర్ (38 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 83 నాటౌట్) బాదుడుకు కేవలం 58 బంతుల్లోనే జట్టు తమ ఛేదనను ముగించింది. దీంతో ఆదివారం అమెరికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో బట్లర్ సేన పది వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఎస్ఏ 18.5 ఓవర్లలో 115 పరుగులకు కుప్పకూలింది. ఓ దశలో 115/6 స్కోరుతో నిలిచిన యూఎస్ జట్టు.. బార్బడోస్‌లోనే పుట్టి పెరిగిన జోర్డాన్ జోరుకు అన్నే పరుగుల వద్ద చివరి నాలుగు వికెట్లను కోల్పోవడం విశేషం. ఈ స్వల్ప ఛేదనను ఇంగ్లండ్ 17.4 ఓవర్లలో ఛేదిస్తే సెమీస్‌కు వెళ్లే అవకాశం ఉండగా.. బట్లర్ బాదుడుకు 9.4 ఓవర్లలోనే 117/0 స్కోరుతో నెగ్గింది. ఈ దెబ్బకు విండీస్ రన్‌రేట్‌ను కూడా అధిగమించి టాప్‌నకు చేరింది. తొమ్మిదో ఓవర్‌లోనైతే బట్లర్ ధాటికి వరుసగా ఐదు సిక్సర్లతో స్పిన్నర్ హర్మీత్ 32 పరుగులు ఇచ్చుకున్నాడు. అలాగే మరో ఓపెనర్ సాల్ట్ (25 నాటౌట్)తో కలిసి బట్లర్ తొలి వికెట్‌కు 117 పరుగులు నమోదు చేశాడు.

1 టీ20ల్లో హ్యాట్రిక్ తీసిన తొలి ఇంగ్లండ్ బౌలర్‌గా జోర్డాన్. ఈ మెగా టోర్నీలో ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన రెండో బౌలర్. కాంఫర్ 2021లో ఈ ఫీట్ సాధించాడు.



పాయింట్ల పట్టిక గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఇంగ్లండ్	3	2	1	0	4	1.992
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
వెస్టిండీస్	2	1	1	0	2	1.814
అమెరికా	3	0	3	0	0	-3.906

ఐదేళ్ల క్రితం జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే అనుమతి లేని కట్టడం అంటూ ప్రజావేదికను కూల్చి వేయించారు. అనుమతి లేని కట్టడాలకు ఇకమీదట ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. అదే జగన్ తన పాలనలో వైసీపీ కార్యాలయాల కోసం వందల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కారుచౌకగా అప్పగించారు. ఏ మాత్రం అనుమతులు తీసుకోకుండా రాజప్రసాదాలను తలపించేలా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. మరి జగన్ చెప్పిన రూల్స్ ఆయన పార్టీకి పట్టవా? పార్టీ కార్యాలయాల పేరిట నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు వర్తించవా?

జగన్ సర్కారు అడ్డగోలుగా అప్పగింత

వందల కోట్లు విలువజేసే భూముల్ని ఏడాదికి ఎకరా రూ.1000 చొప్పున లీజుకు

ప్రతి జిల్లా కేంద్రంలో కేటాయింపులు

నాడు వైసీపీ పెద్దల ఆదేశాలతో అధికారులు ఇష్టారాజ్యంగా భూసంతర్పణ

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

ప్యాలెస్‌లను తలపించేలా భవనాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలు హడావుడిగా దరఖాస్తులు

నోటీసులు జారీ చేస్తున్న అధికారులు



మచిలీపట్నంలో...

మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయం

కృష్ణా జిల్లా వైసీపీ కార్యాలయం కోసం మచిలీపట్నం నడిబొడ్డున గజం రూ.40 వేలు పలికే ప్రాంతంలో సుమారు 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈడేపల్లిలో జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని రూ.1000 చొప్పున 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. భవన నిర్మాణానికి నిర్ణీత రుసుం కూడా చెల్లించలేదు.

చిత్తూరులో...



చిత్తూరు జిల్లాలో గంగవరంలో వైసీపీ కార్యాలయం

చిత్తూరు జిల్లా గంగవరం మండల కేంద్రంలో దౌర్జన్యంగా వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారు. వైసీపీ కార్యాలయం ఉన్న స్థలాన్ని గతంలో శ్రీలంక కాలనీవాసులకు ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం తనకిచ్చిన స్థలంలో వైసీపీ నాయకులు దౌర్జన్యంగా కార్యాలయాన్ని నిర్మించారని రాము అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

సాధారణంగా పట్టణాలు, నగరాల్లో చిన్నపాటి టీ బంకు పెట్టుకోవాలన్నా నెలానెలా వేలకు వేలు అద్దె చెల్లించాలి. చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా అవసరమైన అనుమతులన్నీ తీసుకోవాలి. అయితే రూల్స్ సామాన్యులకే తప్ప తమకు వర్తించవన్నట్టుగా గత పాలకులు అడ్డగోలుగా వ్యవహరించారు. విభజిత జిల్లా కేంద్రాల్లో వైసీపీ కార్యాలయాల భవనాల కోసం జగన్ సర్కారు ప్రభుత్వ భూములను పప్పూబెల్లాల్లా ధారాదత్తం చేసింది. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను లీజు పేరిట నామమాత్రపు ధరకు అప్పగించింది. బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర 5 కోట్ల నుంచి 50 కోట్ల రూపాయల వరకు విలువ చేసే భూములను ఏడాదికి ఎకరాకు కేవలం రూ.1000 చొప్పున చెల్లించేలా లీజుకు కేటాయించింది. వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు భూసంతర్పణకు సహకరించారు. ఏ మాత్రం అనుమతులు తీసుకోకుండా ఆయా జిల్లాలలో వైసీపీ కార్యాలయాల నిర్మాణ పనులు చేపట్టినా అడ్డుకోలేదు. వైసీపీ పెద్దలు నిబంధనలు ఉల్లంఘించి మరీ అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాల్లో రాజప్రసాదాలను తలపించేలా పార్టీ కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు. ఇటీవల టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ నేతలు హడావుడిగా అనుమతుల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. మరోవైపు అప్పుడు వైసీపీ అధికారంలో ఉన్న పార్టీ కావడంతో నోరెత్తే సాహసం చేయలేని అధికారుల్లో ఇప్పుడు కదలిక వచ్చింది. అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

కొల్లగొట్టి.. కట్టేశారు!

వైసీపీ కార్యాలయాల భవనాలకు ప్రభుత్వ భూములు ధారాదత్తం

విశాఖపట్నంలో...



విశాఖ నగర పరిధిలోని ఎండాడ సర్వే నంబర్ 175/4లో ప్యాలెస్‌ను తలపిస్తున్న వైసీపీ కార్యాలయం

విశాఖపట్నంలో వైసీపీ కార్యాలయం కోసం ప్రభుత్వ భూమిని లీజు పేరిట కారుచౌకగా కొట్టేశారు. 2022 మే 16న పీఎంపాలెం సమీపాన ఎండాడ సర్వే నంబర్ 175/4లో రెండెకరాలు కేటాయించుకున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ.50 కోట్లు పైగా పలుకుతోంది. అంటే.. రెండు ఎకరాల విలువ రూ.100 కోట్లు. ఏడాదికి కేవలం రూ.రెండు వేలు (ఎకరాకు రూ.వెయ్యి) చెల్లించేలా ఆ భూమిని 33 ఏళ్ల పాటు గత ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వైసీపీ కార్యాలయం కోసం ప్యాలెస్‌ను తలపించేలా భారీ భవనాన్ని నిర్మించారు. గత ఏడాది సెప్టెంబరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

అనకాపల్లిలో...



అనకాపల్లి జిల్లా కొత్తూరు నర్సింగరావుపేటలో పార్టీ కార్యాలయం కోసం నిర్మించిన ప్యాలెస్

అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ కొత్తూరు నర్సింగరావుపేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 75/1లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. జిల్లా పార్టీ కార్యాలయానికి ఆ స్థలం కేటాయించేలా వైసీపీ నాయకులు 2022లో పావులు కదిపారు. రెవెన్యూ అధికారులు 75/1లో ఒక ఎకరా 75 సెంట్ల స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి మరీ పార్టీ కార్యాలయానికి కేటాయించారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.8 కోట్లు నుంచి రూ.10 కోట్లు వరకూ పలుకుతోంది. ఏడాదికి ఎకరాకు కేవలం రూ.వెయ్యి చొప్పున చెల్లించేలా 33 ఏళ్లకు లీజుకు ఇచ్చారు. ఫీజులేవీ చెల్లించకపోవడంతో ఇంతవరకూ అధికారికంగా ప్లాన్ అప్రూవ్ కాలేదు. నిర్మాణం మాత్రం దాదాపు పూర్తిచేసేశారు. ఆ భూమిని వైసీపీ కార్యాలయ భవనానికి కేటాయించవద్దంటూ స్థానికులు కోర్టులో కేసు వేశారు. అది పెండింగ్‌లో ఉండగానే పనులు పూర్తి చేసేశారు.

విజయనగరంలో...



విజయనగరంలోని దాసన్నపేట రింగురోడ్డులో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

విజయనగరంలోని దాసన్నపేట రింగురోడ్డులో పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువు గర్భంగా ఉన్న ప్రాంతాన్ని ప్రభుత్వ భూమిగా మార్పు చేయించి వైసీపీ కార్యాలయం కోసం తీసుకున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూమిని ఏడాదికి ఎకరానికి రూ.వెయ్యి చెల్లించేలా 33 ఏళ్లకు లీజుగా పొందారు. 2022 ఫిబ్రవరిలో స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం విలువ రూ.ఐదు కోట్ల నుంచి ఆరు కోట్లు ఉంటుందని అంచనా.

రాజమహేంద్రవరంలో...



రాజమహేంద్రవరంలో నిర్మిస్తున్న తూర్పుగోదావరి జిల్లా వైసీపీ కార్యాలయం

రాజమహేంద్రవరంలో వైసీపీ కార్యాలయం నిర్మాణం పనులు చేపట్టారు. ఆర్అండ్‌బీకి చెందిన సుమారు రూ.100 కోట్ల విలువైన 2 ఎకరాల భూమిని ఏడాదికి రూ.1000కు లీజుకు ఇచ్చారు. ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణం చేపట్టారు. దాదాపుగా భవన నిర్మాణం పూర్తయింది. ఈ భవనానికి వెనుకే హెలిప్యాడ్ కూడా ఉంది.

విజయవాడలో



విజయవాడలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయం

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయం కోసం విజయవాడ విద్యాధరపురం సితారా జంక్షన్ సమీపంలో గజం లక్ష రూపాయలు పలికే స్థలాన్ని కేటాయించారు. సుమారు 1850 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చారు. సుమారు రూ.20 కోట్లు విలువ చేసే స్థలాన్ని ఏడాదికి కేవలం రూ. 400కు లీజు ప్రాతిపదికన 33 ఏళ్లకు కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న జీవో జారీ చేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ సెల్లార్ స్లాబు పూర్తయింది.

తిరుపతిలో...



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద నిర్మిస్తున్న తిరుపతి జిల్లా వైసీపీ కార్యాలయ భవనం

తిరుపతి జిల్లా వైసీపీ కార్యాలయ భవనం రాజప్రసాదాన్ని తలపిస్తోంది. రేణిగుంట మండలం కుర్రకాల్వ రెవిన్యూ గ్రామం సర్వే నంబర్లు 219-15, 219-16లలో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న ప్రభుత్వం జీవో జారీ చేసింది. తిరుపతి విమానాశ్రయ సమీపంలో కార్బన్, సెల్కాన్ పరిశ్రమలకు చేరువలో ఉన్న ఈ భూమి మార్కెట్‌లో ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ పలుకుతోంది. ఏడాదికి ఎకరాకు రూ.వెయ్యి ధరతో 33 ఏళ్ల పాటు లీజుకు కేటాయించింది. స్థానిక పంచాయతీ, తుడా అనుమతులు లేకుండానే నిర్మాణం దాదాపు పూర్తయింది.

అమలాపురంలో...



అమలాపురం సమీపంలో వైసీపీ కార్యాలయానికి కేటాయించిన స్థలం ఇదే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి సమీపంలో జనుపల్లి గ్రామంలో సర్వే నంబరు 48/1లో ఎకరం భూమిని వైసీపీ జిల్లా కార్యాలయం కోసం కేటాయించారు. వర్షాకాలంలో గ్రామంలో నుంచి వచ్చే నీరంతా ఇక్కడకు చేరుతుంది. ఈ చెరువును రెవెన్యూ అధికారులు ఏడాది క్రితం కేటాయించారు. జిల్లా వైసీపీ నాయకుల అనైక్యత వల్ల ఇక్కడ నిర్మాణాలను చేపట్టలేదు.

ఒంగోలులో...



ఒంగోలులో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

ఒంగోలులో వైసీపీ కార్యాలయ నిర్మాణం కోసం నగర పరిధిలోని ఎన్నెస్పీ స్థలంలో 1.64 ఎకరాలను లీజుకు తీసుకున్నారు. దీని విలువ సుమారు రూ.4.50 కోట్లు. ఏడాదికి ఎకరాకు రూ.1000 అద్దె ప్రకారం 33 ఏళ్ల లీజుకు రాసిచ్చారు. ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేయాలంటే జీవో ప్రకారం మొదటిసారే ఏడు వాయిదాల పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించాలి. అయితే కేవలం ఒక్క వాయిదా చెల్లించేలా ఆన్‌లైన్‌లో సవరణ చేశారు. ఇప్పటి వరకూ రూ.14.35 లక్షల పన్ను బకాయి ఉంది. మరోవైపు భవన నిర్మాణ అనుమతుల విషయంలోనూ సడలింపులు ఇచ్చారు. సుమారు రూ.20 లక్షల వరకూ ఫీజు చెల్లించాల్సి ఉండగా, రూ.7 లక్షలు మాత్రమే చెల్లించారు.

నెల్లూరులో...



నెల్లూరులో భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం

నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో రూ.కోట్లు విలువజేసే రెండెకరాల స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యాలయ నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించింది. ఎకరాకు ఏడాదికి రూ.1000 చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరం విలువ రూ.4 కోట్ల వరకు ఉంది. దాదాపు 80 శాతం వరకు నిర్మాణం పూర్తయ్యింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో శనివారం కార్పొరేషన్ అధికారులు ఆ నిర్మాణాన్ని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేవంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడికి నోటీసులు ఆరీ చేశారు.

కడపలో...



కడప నగరంలో అనుమతి లేకుండా వైసీపీ కార్యాలయ నిర్మాణం

కడప నగరంలో చెన్నై వెళ్లే రహదారి సమీపంలో చిన్నచౌకు రెవెన్యూ పొలం సర్వే నంబరు 424/7లో రెండు ఎకరాలను వైసీపీ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్నారు. ఎకరాకు వెయ్యి రూపాయల చొప్పున 33 సంవత్సరాలు లీజుకు తీసుకున్నారు. ఈ మేరకు 2022 డిసెంబరు 20న జీవో జారీ చేశారు. వైసీపీ కార్యాలయానికి అనుమతి లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. కేవలం ఖాళీ స్థలానికి పన్ను కట్టి నిర్మాణాలు సాగిస్తున్నారు.

రాయచోటిలో...



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయం

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైసీపీ కార్యాలయాన్ని ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారు. రాయచోటి మండలం మాసాపేట సర్వే నంబరు 1022/2లో 1.61 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేస్తున్నారు. 33 ఏళ్ల పాటు ఎకరాకు రూ.1000 చొప్పున లీజుకు 2022 జనవరి 18న ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ ఎకరా కోట్ల విలువ చేస్తుంది. దాదాపు నిర్మాణం పూర్తయింది.

బాపట్లలో...



బాపట్లలో ఏపీఐఐసీ పరిధిలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనం

బాపట్ల ఆర్టీసీ గ్యారేజ్ పక్కన ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ జిల్లా ఆఫీసు కోసం కేటాయిస్తూ 2022 డిసెంబరులో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏపీఐఐసీ పరిధిలోని కోట్ల విలువ గల ప్రభుత్వ స్థలాన్ని ఎకరానికి ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు అప్పగించారు. అయితే, తమకు తెలియకుండా లీజుకు ఇచ్చారని ఆర్టీసీ ఉన్నతాధికారులు పోలీసు, రెవెన్యూ విభాగానికి 2022 లో ఫిర్యాదు చేశారు. ఏమైందో ఏమో ఆ తర్వాత ఆ స్థలాన్ని 2003లోనే ఏపీఐఐసీకి తిరిగి ఇచ్చేశామని ఆర్టీసీ అధికారులు చెప్పారు.

కర్నూలులో...



కర్నూలు ఫైవ్ రోడ్స్ జంక్షన్‌లో వైసీపీ కార్యాలయం నిర్మాణం

కర్నూలు ఐదు రోడ్ల కూడలిలో జలవనరుల శాఖ చెందిన సర్వే నంబరు 95-2బీలో 3.40 ఎకరాలు ఉంది. అందులో 1.60 ఎకరాలు ఏపీ ఆగ్రోస్ సంస్థది. దానిని వైసీపీ కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయం కోసం ఏడాదికి రూ.1,600 చొప్పున చెల్లించేలా 33 ఏళ్లు లీజుకు తీసుకున్నారు. దీని విలువ ప్రస్తుతం వంద కోట్ల పైమాటే. అనుమతులు తీసుకోకుండానే భవనాన్ని దాదాపుగా నిర్మించారు. అనుమతులకోసం ఈ నెల 17న 'కుడా'కు ఆన్‌లైన్ దరఖాస్తు చేశారు. అయితే అవసరమైన ధ్రువపత్రాలు అటాచ్ చేయకపోవడంతో దరఖాస్తు తిరస్కరణకు గురైంది. దీంతో నిబంధనలకు లోబడి చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

నంద్యాలలో



నంద్యాలలో పేదల ఇళ్ల స్థలంలో వైసీపీ కార్యాలయ నిర్మాణ పనులు

నంద్యాల జిల్లాలో వైసీపీ కార్యాలయంపై మొదట్నుంచీ వివాదాలు నడుస్తున్నాయి. కుందూ నది ఒడ్డున పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వేసిన లేఅవుట్‌లో ఎకరా కేటాయించారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారు.

అనంతపురంలో..



అనంతపురం నగరంలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయం

అనంతపురంలో ఇరిగేషన్‌కు చెందిన సర్వే నంబరు 136-1బీ, 1బీ2, ఏ2లోని 1.50 ఎకరాల భూమిలో చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనం దాదాపు పూర్తయింది. కనీసం అనుమతులకు దరఖాస్తు కూడా చేసుకోలేదు. ఈ భూమి విలువ రూ.4 కోట్లకు పైమాటే. 33 ఏళ్లపాటు ఏడాదికి ఎకరానికి రూ.1000 చొప్పున లీజు చెల్లించేలా వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఇప్పుడు ప్లాన్ అప్రూవల్ లేదంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఏలూరులో...



ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కన నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కన 2022 మే నెలలో రెండు ఎకరాల రెవెన్యూ భూమిని వైసీపీ జిల్లా కార్యాలయానికి కేటాయించారు. దాదాపు రూ.20 కోట్ల విలువ చేసే ఈ భూమిని ఏడాదికి రూ.2వేలు చొప్పున (ఎకరాకు రూ.వెయ్యి) లీజుకు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతులు లేకుండానే దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో పార్టీ కార్యాలయ నిర్మాణం దాదాపు 90 శాతం పైనే పూర్తి చేశారు.

కాకినాడలో...



కాకినాడలోని సైడావారి వీధిలో నిర్మించిన వైసీపీ భవనం

కాకినాడలో వైసీపీ జిల్లా కార్యాలయాన్ని అనుమతులేవీ లేకుండా నిర్మించారు. 49వ వార్డు పరిధిలోని సైడావారి వీధిలో జీప్లస్ వన్ విధానంలో 1.92 ఎకరాల స్థలంలో నిర్మాణం చేపట్టారు. పనులన్నీ 99 శాతం పూర్తయ్యాయి. బహిరంగ మార్కెట్లో ఈ భూమి విలువ రూ.50 కోట్లపైనే పలుకుతోంది. ఎకరాకు వెయ్యి రూపాయలు లీజు చొప్పున 33 ఏళ్లపాటు కేటాయించారు.

శ్రీకాకుళంలో...

శ్రీకాకుళం జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకుని పెద్దపాడు వద్ద మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇంటి సమీపంలో ఎకరా యాభై సెంట్ల విస్తీర్ణంలో వైసీపీ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. ప్రసుత్తం తొంభైశాతం నిర్మాణం పూర్తయింది. ఈ కార్యాలయం నిర్మాణానికి అనుమతులు లేవు.

పాడేరులో...

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో పార్టీ కార్యాలయం నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం గిరిజన చట్టాలను ఉల్లంఘించింది. పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ నడిమివీధి గ్రామానికి ఆనుకుని ఉన్న రెండెకరాల భూమిని 33 ఏళ్లకు లీజు ఇచ్చేలా జీవో జారీ చేసింది. ఏడాదికి ఎకరానికి రూ.1000 చొప్పున లీజు చెల్లించేలా జీవోలో పేర్కొన్నారు. అయితే వ్యవహారం హైకోర్టుకు చేరడంతో నిర్మాణానికి బ్రేక్ పడింది.

గుంటూరులో...

గుంటూరులో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి హిందూ ఫార్మసీ కళాశాల ఎదురుగా రూ. పది కోట్ల విలువైన 2,500 చదరపు గజాల నగరపాలకసంస్థ స్థలాన్ని 33 ఏళ్ల పాటు నామమాత్రపు లీజుతో కాజేసే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఈ స్థలానికి అప్రోచ్ రోడ్డు కేవలం 15 అడుగులే ఉండటంతో కొన్ని రోజుల తర్వాత వైసీపీ వెనకడుగు వేసింది.

ఉండి సమీపంలో..

పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ కార్యాలయం భవన నిర్మాణం కోసం ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలో 72 సెంట్లు స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. స్థానిక పంచాయతీలో తీర్మానం తిరస్కరించినా నిర్మాణం ప్రారంభించారు. స్థలం లీజు నెలకు రూ.720గా ఉన్నట్టు సమాచారం.

పార్వతీపురంలో..

పార్వతీపురంలో సర్వే నంబర్ 458 పార్ట్-2లో ఎకరా 18 సెంట్ల విస్తీర్ణంలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం సాగుతోంది. 2022 ఏప్రిల్ 23న ఏడాదికి ఎకరాకు రూ. వెయ్యి లీజు చెల్లించేలా రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని మొదట 33ఏళ్ల లీజుకు ఇస్తూ, దాన్ని 99 సంవత్సరాల వరకు పొడిగించుకునే వెసులుబాటును కల్పించారు. అనుమతులు కూడా పొందని ఈ నిర్మాణం ఇప్పుడు చివరి దశకు చేరుకుంది.

తిరుమలలో మార్పులు అభినందనీయం

ఇక్కడి సంస్కరణలు దేశంలో ఆలయాలకు దిక్సూచి కావాలి

ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి



తిరుమల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో మార్పులు చేసి, భక్తులకు మెరుగైన సేవలు ప్రారంభించిన ప్రభుత్వానికి వేంకటేశ్వర అనుగ్రహ పీఠం(యూఎస్‌పీ) వ్యవస్థాపకురాలు, ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి ఓ ప్రకటన ద్వారా అభినందనలు తెలిపారు. శ్రీవారి దర్శనానికి క్యూలైన్‌లో ఉండే భక్తులకు తిరిగి అన్నప్రసాదాలు అందించడం, కాలినడకన వచ్చే భక్తులకు దివ్యదర్శన టోకెన్లు ఇవ్వడం వంటి వాటికి ప్రవాసాంధ్రులు చాలా ఆనందిస్తున్నారన్నారు. రూ.300 దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లోనే కాకుండా తిరుమలలో కూడా ఇవ్వాలని కోరారు. శ్రీవారి కొలువులో అన్యమతస్తులు ఉన్నారని, వారిని తిరుమల నుంచి మార్చి తిరుమల పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలన్నారు. స్వామి వైభవాన్ని గ్రామగ్రామాలకు చేర్చాలన్నారు. గిరిజన గుడారాల్లో చిన్న దేవాలయాల అర్చన కోసం గతంలో టీటీడీ శిక్షణను అందించిందని, అయితే వారిని సమన్వయం చేసుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఆలయం ద్వారా చేయాల్సిన బాధ్యతలను విస్మరించి తిరుమలను అపనిందల పాలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా చేదు జ్ఞాపకాల నుంచి భక్తులను విముక్తులను చేయాలన్నారు. టీటీడీ సంస్కరణలు దేశంలో ఉన్న ఇతర ఆలయాలకు దిక్సూచి కావాలన్నారు. ప్రపంచంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలను ఒకతాటిపైకి తెచ్చి మార్పులు తీసుకొస్తే రాబోయే తరాలకు మన సనాతన ధర్మాన్ని అందించినవారమవుతామన్నారు. ప్రభుత్వం చేపట్టబోయే చర్యల ద్వారా స్వామి కొలువులో ఎవరు తప్పు చేయాలన్నా భయపడే చట్టాలను కఠినంగా తీసుకురావాలన్నారు. దేవాలయంలో పదవులు అనుభవించేవారు కాకుండా పనిచేసేవారినే నియమించాలని అమెరికాలో స్థిరపడిన తెలుగు ప్రజలు కోరుకుంటున్నారని జ్యోతిర్మయి పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి కన్నుమూత



ఎమ్మెల్యే వెంకటరెడ్డి

ముదిగుబ్బ, జూన్23: శ్రీసత్యసాయి జిల్లాలో గతంలో ఉన్న నల్లమాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి(87) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరెడ్డి స్వగ్రామం జిల్లాలోని ముదిగుబ్బ మండలం మలకవేముల. 1985లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ప్రభుత్వంలో నల్లమాడ నియోజకవర్గ శాసన సభ్యుడిగా గెలుపొందారు. దీనిని తరువాత పుట్టపర్తి నియోజకవర్గంగా మార్చారు.

బైకును అపహరించి చెరువులో పడేశారు

టీడీపీ జెండా కట్టుకుని తిరిగాడని వైసీపీ మూకల ఆగడం

18 రోజుల తర్వాత బయటికి

రాప్తాడు, జూన్ 23: ఎన్నికల్లో వైసీపీ ఓడిన తరువాత కూడా ఆ పార్టీ మూకల ఆగడాలు తగ్గలేదు. ఈనెల 4న వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి ఘన విజయం సాధించడంతో అదేరోజు అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త అంకే హరికృష్ణ తన ద్విచక్రవాహనానికి పార్టీ జెండా కట్టుకుని, గ్రామంలో తిరిగాడు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ మూకలు మరుసటి రోజు 5వ తేదీ రాత్రి హరికృష్ణ ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. గ్రామ సమీపంలోని చెరువు నీటిలో పడేశారు. బైక్ చోరీపై జూన్ 6న రాప్తాడు పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో ఆదివారం ఉదయం బండమీదపల్లికి చెందిన కొంతమంది బాలురు చెరువు నీటిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో ద్విచక్రవాహనం ఉండటాన్ని గమనించి, బయటకు తీశారు. టీడీపీ కార్యకర్త హరికృష్ణకు సమాచారం ఇవ్వడంతో చెరువు వద్దకెళ్లి ద్విచక్రవాహనాన్ని తీసుకున్నాడు. 18 రోజులు నీటిలో ఉండటంతో స్టార్ట్ కాకపోవడంతో ఇంటికి తోసుకుంటూ వచ్చాడు. ద్విచక్రవాహనం ఏడాది క్రితం కొన్నాననీ, ఇంకా ఈఎంఐ వాయిదాలు కూడా పూర్తికాలేదని టీడీపీ కార్యకర్త వాపోయాడు. అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

రాజకీయ ప్రేరేపిత కేసులను ఎత్తివేస్తాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

తుని రూరల్, జూన్ 23: రాజకీయ ప్రేరేపిత కేసులను 100 రోజుల్లో ఎత్తివేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తునిలో ఆదివారం జరిగిన ఎమ్మెల్యే యనమల దివ్య విజయోత్సవసభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ పాలనతో ఎన్ని ఇబ్బందులు, ఆటంకాలు సృష్టించినా కార్యకర్తలు ఎదురొడ్డి నిలబడ్డారని, వారందరినీ పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. అలాంటివారిని తొందరలోనే నామినేటెడ్ పదవులతో సత్కరించి ప్రభుత్వంలో భాగస్వాములను చేస్తామని పల్లా చెప్పారు.

త్వరలో సహకార సంస్థలకు ప్రత్యేక అధికారులు

కొన్ని పాలకవర్గాలు రాజీనామాలు చేయనందునే

అమరావతి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహకార సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గత ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో నియమించిన కమిటీల నుంచి రాజీనామా పత్రాలు తీసుకోవాలని ఇటీవల సాధారణ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలతో దాదాపు 2,050 పీఏసీఎస్, 13 డీసీసీబీ, 13 డీసీఎంఎస్, ఆప్కాబ్ పాలకవర్గాలు రాజీనామాలు చేయాలని సహకారశాఖ అధికారులు మెమోలు జారీ చేశారు. దీంతో ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి, డీసీసీబీలు, డీసీఎంఎస్‌ల కమిటీ సభ్యులు రాజీనామాలు చేశారు. పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల్లో అత్యధిక శాతం రాజీనామాలు సమర్పించగా, కొద్ది మంది రాజీనామాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు సమాచారం. సహజంగా ప్రభుత్వం మారినప్పుడు నామినేటెడ్ పదవులకు రాజీనామాలు చేయడం నైతికత. కానీ జూలై వరకు ఉండొచ్చన్న ఉద్దేశంతో పలువురు పదవుల్ని పట్టుకుని వేలాడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఆ కమిటీలను రద్దు చేసి, ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు తగిన అధికారులతో సహకార శాఖ జాబితాలు సిద్ధం చేస్తోంది. కాగా, రాష్ట్రంలోని సహకార సంస్థలకు దాదాపు ఏడేళ్ల నుంచి ప్రత్యక్ష ఎన్నికలు జరగలేదు. 2018 జనవరి నుంచి ఏడాదిన్నర వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పాత పాలకవర్గాలకు సహకార సంస్థల బాధ్యతలు అప్పగించగా, 2019 జూలై నుంచి వైసీపీ ప్రభుత్వం అధికార పార్టీకి చెందిన నేతలకు నామినేషన్ పద్ధతిలో పగ్గాలు అప్పగించింది. కొత్త ప్రభుత్వం సహకార ఎన్నికలను ఈ ఏడాది నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ

గుంటూరు(విద్య), జూన్ 23: ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం నవ్యాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ బీ. శ్రీరాములు, గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు పాండునాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హేమచంద్రారెడ్డి అక్రమ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రూ.200 కోట్లు రికవరీ చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో తన బినామీలను పెట్టుకుని అక్రమ సంపాదనే ధ్యేయంగా, కాలేజీల యాజమాన్యాలను భయభ్రాంతులకు గురి చేసి రూ.కోట్లు వసూలు చేసి ఉన్నత విద్యావ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు.



పొంగళ్లను తలపై ఉంచుకుని రాజధాని నుంచి కాలినడకన వస్తున్న మహిళలు

దుర్గమ్మా..దండాలమ్మా!

మొక్కులు చెల్లించుకున్న అమరావతి రైతులు

భారీగా కాలినడకన ఇంద్రకీలాద్రికి

విజయవాడ (వన్‌టౌన్), జూన్ 23 : అమరావతి రాజధాని రైతులు ఆదివారం కనకదుర్గమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. జగన్ మూడు రాజధానులు ప్రకటించిన తరువాత.. అమరావతే ఏకైక రాజధాని అంటూ రాజధాని ప్రాంత రైతులు 1600 రోజులకు పైగా ఆందోళన చేపట్టారు. ఈ సమయంలో తమ ఏకైక లక్ష్యమైన అమరావతి రాజధానిగా కొనసాగించాలంటూ వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆ సమయంలో పోలీసుల నుంచి ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా దుర్గమ్మ ఆలయానికి అప్పట్లో కాలినడకన వస్తున్న మహిళా రైతులను సైతం పోలీసులు అడ్డగించారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయి, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయం సాధించి పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అప్పుడు చెల్లించలేని మొక్కులను ఇప్పుడు చెల్లించుకున్నారు. రాజధాని రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఆదివారం కాలినడకన ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. తుళ్లూరు నుంచి మహిళలు పొంగళ్లను నెత్తిన పెట్టుకుని వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలన్న తమ కోరికను కనకదుర్గమ్మ నెరవేర్చిందని, అందుకే మొక్కులు చెల్లించుకున్నామన్నారు. 2020, జనవరి 10న దుర్గమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న సమయంలో పోలీసులు అడ్డగించి లాఠీచార్జి చేశారని, అప్పటి జగన్ ప్రభుత్వం దారి పొడవునా కంచెలు వేసి అడ్డుకుందని, రాయపూడి పెట్రోల్ బంక్ వద్ద అప్పటి జిల్లా ఎస్పీ విజయరావు పెద్ద ఎత్తున పోలీసులతో మోహరించి లాఠీలతో మహిళలను కూడా కొట్టించారని పేర్కొన్నారు. తాజాగా రాక్షసుడి పాలన ముగిసి కూటమి అధికారంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇకపై జగన్‌కు ఆ 11 సీట్లు కూడా లేకుండా వైసీపీ గల్లంతైపోవాలని దుర్గమ్మను వేడుకున్నామన్నారు.

అమెరికాలో పేలిన తూటా.. బాపట్ల వాసి బలి

దుండగుడు జరిపిన కాల్పుల్లో గాయపడి దుర్మరణం

బాపట్ల జిల్లా యాజలి గ్రామంలో విషాదం

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్న సీఎం

కర్లపాలెం, జూన్ 23: అమెరికాలో తుపాకీ తూటాకు తెలుగు యువకుడు బలయ్యాడు. ఇంజనీరింగ్ చదివి విదేశాల్లో మంచి ఉద్యోగం చేసి కుటుంబాన్ని బాగా చూసుకోవాలనే ఆశయంతో అమెరికాకు వెళ్లిన ఆ యువకుడు తన కలను సాకారం చేసుకోకుండానే కన్నుమూశాడు. బాపట్ల జిల్లా కర్లపాలం మండలం యాజలి గ్రామానికి చెందిన నిరుపేద ఇంజనీర్ దాసరి గోపీకృష్ణ (32) టెక్సాస్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తుదిశ్వాస విడిచాడు. యాజలి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు ధనలక్ష్మి దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలనే ఆశయంతో విజ్ఞాన్ లారా కళాశాలలో బీటెక్ చదివించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో మూడేళ్లపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాడు. ఈలోగా వీసా రావడంతో.. తమకున్న ఎకరం పొలం అమ్మేసి 9 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం (అమెరికా కాలమాన ప్రకారం శుక్రవారం రాత్రి 1.30 గంటలకు) గోపీకృష్ణ కౌంటర్‌లో ఉండగా.. ఓ దుండగుడు లోపలికి ప్రవేశించి తుపాకీతో అతనిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత కౌంటర్‌లోకి దూకి తనకు కావాల్సిన ప్యాకెట్ తీసుకుని వెళ్లిపోయాడు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన గోపీకృష్ణ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచాడు. కాల్పుల్లో గోపీకృష్ణ మృతి చెందాడని తల్లిదండ్రులకు ఆదివారం ఉదయం సమాచారం అందింది. ఆ వార్త వినగానే తల్లిదండ్రులు, తాత, నాయనమ్మ, భార్య ప్రవల్లిక శోకసంద్రంలో మునిగిపోయారు. గోపీకి భార్య ప్రవల్లిక, 18 నెలల కుమారుడు రియాంత్ ఉన్నారు. గోపీ మృతి వార్తతో యాజలిలో విషాదఛాయలు అలముకున్నాయి.



యాజలిలో రోదిస్తున్న గోపీకృష్ణ తల్లిదండ్రులు



గోపికృష్ణను దుండగుడు తుపాకీతో కాలుస్తున్న చిత్రం

చంద్రబాబు దిగ్భ్రాంతి.. అండగా ఉంటామని హామీ

గోపీకృష్ణ మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా ఆదివారం ఉదయం యాజలిలోని గోపీకృష్ణ గృహానికి చేరుకుని వివరాలు సేకరించి కలెక్టర్‌కు అందించారు. గోపీ మృతదేహం మంగళవారం ఉదయానికి యాజలి స్వగృహానికి చేరే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. కాగా, మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



బ్రిటన్‌కు పన్ను పాఠాలు

తెలుగు నేలపై పుట్టి... విదేశీ గడ్డపై అడుగుపెట్టి... మన కీర్తిని ఎలుగెత్తి చాటారు అర్చనారావు దన్నమనేని. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) రెవెన్యూ అండ్ కస్టమ్స్ విభాగంలో సీనియర్ సివిల్ సర్వెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె... అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సరికొత్త విధానాలతో ఆ దేశ ఖజానాకు రెండు బిలియన్ పౌండ్స్ ఆదాయం సమకూర్చినందుకు గుర్తింపుగా... ప్రతిష్ఠాత్మక 'మెంబర్స్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఎంబీఈ) అవార్డుకు ఎంపికయ్యారు. ఆ విశేషాలను యూకే నుంచి 38 ఏళ్ల అర్చనారావు 'నవ్య'తో పంచుకున్నారు.

"ఎక్కడో భారత్ నుంచి వచ్చి... ఒంటరిగా ప్రయత్నించి... ఇవాళ ఈ స్థాయిలో నిలబడ్డానంటే ఎంతో సంతోషంగా ఉంది. ఆత్మవిశ్వాసంతో వేసే ప్రతి అడుగూ... అంకితభావంతో చేసే ప్రతి పనీ... నిజాయితీగా పడే కష్టం... మనల్ని విజయానికి చేరువ చేస్తాయి. అందుకు ఇవాళ నాకు దక్కిన 'మెంబర్స్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఎంబీఈ) అవార్డు ప్రత్యక్ష సాక్ష్యం. వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించే పౌరులకు యూకేలో ఈ అవార్డు ఇస్తారు. ఇక్కడ నేను రెవెన్యూ అండ్ కస్టమ్స్ (హెచ్ఎంఆర్సీ) విభాగంలో సీనియర్ సివిల్ సర్వెంట్‌ని. కర్తవ్య నిర్వహణలో నా సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నేను తీసుకువచ్చిన కొన్ని నూతన పద్ధతులవల్ల దేశ ఖజానాకు గతంలో ఎన్నడూ లేని విధంగా మా విభాగం నుంచి రెండు బిలియన్ పౌండ్స్‌కు పైగా ఆదాయం సమకూరింది. ఆ మొత్తం ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు తదితర అవసరాలకు వినియోగిస్తారు. రికార్డు స్థాయిలో ఇంత ఆదాయం రావడానికి ప్రధాన కారణం... గతంలో ఉన్న లోతుపాతులను సవరించి నేను ఒక విధానం రూపొందించాను. ఇది నేను పని చేసే 'వీఏటీ' (వాల్యూ యాడెడ్ ట్యాక్సెస్) శాఖకే కాకుండా... ఇక్కడి అన్ని రకాల పన్నుల వసూలుకూ ఉపయోగకరంగా మారింది. పన్నుల్లో ఉన్న అంతరాలను తగ్గించి, జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది.



అరుదైన గౌరవం...

ఈ అవార్డు ఎంపిక కోసం స్వయంప్రతిపత్తి కలిగిన హానర్స్ కమిటీ ఒకటి ఉంటుంది. ఆ కమిటీ వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను వడపోసి, జాబితాను ప్రధానికి ప్రతిపాదిస్తుంది. ఆ ప్రతిపాదనలను ప్రధాని... కింగ్ చార్లెస్ ముందు ఉంచుతారు. ఆయన ఆమోదంతో నన్ను అవార్డుకు ఎంపిక చేశారు. త్వరలో బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ చేతుల మీదుగా ఎంబీఈ అవార్డు అందుకోబోతున్నాను. భారత్‌లో పద్మ అవార్డుల్లా ఇక్కడ 'నైట్‌హుడ్, ఓబీఈ, ఎంబీఈ' ప్రధానమైనవి. నైట్‌హుడ్ వస్తే వాళ్ల పేరు ముందు 'సర్' అని పెట్టుకోగలుగుతారు. నాకు 'ఎంబీఈ' వచ్చింది కాబట్టి నా పేరు తరువాత 'ఎంబీఈ' అని అఫీషియల్‌గా రాసుకోవచ్చు. యూకేలో వీరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. నాకు ఈ అవార్డు ప్రకటించాక... దేశంలోని రాజకీయ ప్రముఖులు, సన్నిహితుల నుంచి వందల సంఖ్యలో అభినందనల సందేశాలు వస్తున్నాయి. సాధారణంగా నా వయసు వారికి ఈ అవార్డు రావడం చాలా చాలా అరుదు. నేను నా వృత్తికే పరిమితం కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటాను. పేదలు చదివే స్థానిక స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి సివిల్ సర్వీసెస్ అంటే ఏమిటి? మేమేం పని చేస్తాము? ఆ పరీక్షల్లో ఎలా రాణించాలి? తదితర విషయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తుంటాను. వాళ్లకు నన్నొక ఆదర్శంగా చూపి, తద్వారా సివిల్స్ వైపు ప్రోత్సహించడానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నా. అలాగే కొంతమంది కాలేజీ పిల్లలకు 'జాబ్ షాడో', అంటే మా కార్యాలయానికి వచ్చి నేను మా పని చూసే అవకాశం కల్పిస్తున్నాం. వీటితోపాటు మా జూనియర్స్‌కు కూడా శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకున్నాను.

నమ్మలేకపోతున్నాను...

ఈ అవార్డు రావడాన్ని అత్యంత గౌరవంగా భావిస్తున్నా. ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు. ఎందుకంటే ఇప్పటివరకు నేను చూసినవారిలో పెద్ద పెద్ద క్రీడాకారులు, ప్రముఖులు అవార్డు అందుకున్నవారిలో ఉన్నారు. ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్ లాంటివారు దీని కోసం కలలు కంటున్నారు. అంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం నాకు లభించిందంటే చాలా సంతోషంగా ఉంది. వేరే దేశం నుంచి వచ్చి, ఇక్కడ చదువుకొని, ఉద్యోగం చేస్తున్న నాకు దక్కడం నిజంగా అద్భుతంగా అనిపిస్తోంది. మా విభాగంలో 'ఎంబీఈ అవార్డు' అందుకోబోతున్న మొదటి వ్యక్తిని నేనే. నా పనిని నేను ఆస్వాదిస్తాను. అదే నా విజయ రహస్యం. అసలు అవార్డు కమిటీకి నా పేరు ఎవరు ప్రతిపాదించారో కూడా తెలియదు. గెజిట్‌లో ప్రచురితమయ్యాకే నేనూ చూశాను.

అంచెలంచెలుగా...

నేను సీనియర్ ట్యాక్స్ ప్రొఫెషన్ మేనేజర్‌ని. అలాగే 'వీఏటీ'లో మా యార్క్‌షైర్ రీజియన్‌కు సీనియర్ ట్యాక్స్ స్పెషలిస్ట్‌ను కూడా. మా దేశంలోని బడా కంపెనీలు... అంటే మైక్రోసాఫ్ట్, జీఈ క్యాపిటల్ లాంటి రెండొందల బిలియన్ల టర్నోవర్ దాటిన బిజినెస్‌కు సంబంధించి ట్యాక్స్ కలెక్షన్ నా విధి. నేను డీల్ చేసిన ప్రతి కేసులోనూ ఏదో ఒక తప్పు పట్టుకోగలిగాను. అలాంటివి పునరావృతం కాకుండా ఒక విధానం తీసుకువచ్చాను. యూకేలో నేను చేస్తున్న ఈ ఉద్యోగం భారత్‌లో సివిల్ సర్వీస్‌తో సమానం. అక్కడ యూపీపీఎస్‌సీలానే... ఇక్కడా పరీక్ష ఉంటుంది. అందులో ఉత్తీర్ణత సాధించి, 2014లో ఈ పోస్టు సంపాదించాను. అయితే ఎంపికయ్యాక నాలుగేళ్ల శిక్షణ ఉంటుంది. తరువాత మళ్లీ పరీక్ష పెడతారు. అందులో ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం పోతుంది. అన్ని మెట్లూ ఎక్కి... ఇలా స్థిరపడ్డాను. నాటి నుంచి వివిధ హోదాల్లో పని చేస్తూ అంచలంచలుగా ఎదిగాను.

ఒకే ఒక్క లక్ష్యంతో...

నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. టెన్త్ వరకు 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్'లో చదివాను. చెన్నై 'ఎస్ఆర్ఎం'లో ఇంజనీరింగ్ (ఈసీ) చేశాను. స్కాట్‌లాండ్ రాజధాని ఎడిన్‌బరాలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విత్ హ్యూమన్ రీసోర్సెస్ మాస్టర్స్ (2008) చదివాను. అవ్వగానే కొన్నేళ్లు లీడ్స్‌లోని ఓ కంపెనీ హెచ్ఆర్ విభాగంలో పని చేశాను. అప్పుడు కూడా పద్దెనిమిది వేల మంది సిబ్బంది బాధ్యతలు చూసుకొనేదాన్ని. అయితే చిన్నప్పటి నుంచి నా ఆకాంక్ష ఏంటంటే... సివిల్స్ సాధించాలని. భారత్‌లో ఉన్నా కచ్చితంగా దాని కోసమే ప్రయత్నించేదాన్ని. యూకేలో ఉన్నాను కాబట్టి... ఇక్కడ పట్టుబట్టి సాధించాను. అప్పటి నుంచి హెచ్ఎంఆర్సీలో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నాను.

స్వయంకృషితో సాధించాలని...

ఇంజనీరింగ్ చదివేటప్పుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో చాలా కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. కానీ మాస్టర్స్ చేయాలన్నది నా ధ్యేయం. మా అమ్మ నీరజ, నాన్న అశోక్‌రావు కూడా ఓకే అన్నారు. ఏ అమెరికానో వెళ్లకుండా యూకే ఎందుకు వచ్చానంటే... ఇక్కడ మా కుటుంబ స్నేహితులు, బంధువులు ఎవరూ లేరు. యూఎస్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చాలామంది ఉన్నారు. ఎవరి సాయం లేకుండా స్వయంకృషితో ఎదిగి, ఉన్నత స్థానంలో నిలవాలనేది నా సంకల్పం. మా అమ్మానాన్నలకు నేను ఒకేఒక్క కూతుర్ని అయినా... నా అభీష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. ముఖ్యంగా మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. సివిల్స్ లక్ష్యం కనుక... 2014లో యూకే పౌరసత్వం రాగానే పరీక్ష రాశాను. ఎంపికయ్యాను.

నాలాగా మరికొందరిని...

వచ్చిన కొత్తల్లో నాతో చాలామంది చెప్పిందేమంటే... జాతి వివక్ష ఉంటుందని. పరాయి దేశస్తులు ఉన్నత స్థానాల్లో కనిపించడం చాలా అరుదనీ అన్నారు. అలాంటిది నేను సివిల్స్ సర్వెంట్‌ను అయ్యాక... వారంతా నన్ను తమ రోల్ మోడల్‌లా భావిస్తున్నట్టు చెప్పారు. ఇప్పుడు ఈ అవార్డు వచ్చినందుకు నాకంటే వాళ్లే ఎక్కువ సంతోషపడుతున్నారు. వాళ్ల తమ లక్ష్యాలు సాధించడానికి 'లీడర్‌షిప్ ప్రోగ్రామ్' ద్వారా నేను కూడా సహకరిస్తుంటాను. సివిల్స్‌కు సన్నద్ధమయ్యేవారికి మెళకువలు నేర్పి, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటాను.

> **అదే నా బలం...**
>
> కష్టపడేతత్వం, సాధించేవరకు ప్రయత్నించడం... ఇదే నా బలం. నాలో ఇంతటి ఆత్మవిశ్వాసం రావడానికి, నాయకత్వ లక్షణాలు అలవడటానికి కారణం నేను చదివిన హెచ్‌పీఎస్. అప్పట్లో అథ్లెటిక్స్‌లో కూడా ముందుండేదాన్ని. స్కూల్లో ఏది జరిగినా అందులో నేనుండేదాన్ని. ఇప్పుడు కూడా సివిల్ సర్వీస్ స్పోర్ట్స్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్నా. రీజినల్ ఉమెన్ బ్యాడ్మింటన్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌ని.

నేనేంటో నాకు తెలుసు...

నేను నిర్వహించే ఖాతాలన్నీ దేశంలోని టాప్ కంపెనీలవి. వాళ్లకు డబ్బు కావచ్చు, న్యాయకోవిదుల బృందం కావచ్చు... చాలా బలంగా ఉంటాయి. వారికి వ్యతిరేకంగా మనం ఏదైనా వాదించి, నెగ్గుకురావడం సామాన్యమైన విషయం కాదు. ఎందుకంటే సంపన్నులు కనుక ఏదైనా పొందగలమనే ఒక అహంకారం ఉంటుంది వారికి. మనకు సంబంధిత విషయాల మీద పూర్తిస్థాయి అవగాహన, నైపుణ్యం లేకపోతే అడుగు ముందుకు వేయలేం. అలాంటి సవాళ్లు నేను అనేకం ఎదుర్కొన్నాను. చాలా కేసుల్లో నెగ్గాను. ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ సమర్థవంతంగా తిప్పికొట్టగలిగాను. ఇవన్నీ వృత్తిలో భాగం. నేనేంటో నాకు తెలుసు. కనుకనే ఎదుటి వ్యక్తి ఎంతటివారైనా బెదిరేది లేదు. అదేవిధంగా మేమంటే వాళ్లూ భయపడతారు. ఎందుకంటే ఏ చిన్న తప్పు పట్టుకున్నా అది ఆ కంపెనీ మీద పెద్ద ప్రభావం చూపిస్తుంది కదా.

వివక్ష చూశాను...

మావారు కూడా లీడ్స్ యూనివర్సిటీలో చదువుకున్నారు. మా మామగారు సింగరేణిలో పని చేసేవారు. మేం ప్రస్తుతం లీడ్స్‌లో ఉంటున్నాం. మా అమ్మానాన్నలా మావారు కృష్ణకిషోర్ కూడా నాకు ఎంతో మద్దతునిస్తారు. ప్రోత్సహిస్తారు. ఆయనా మంచి పొజిషన్‌లో ఉన్నారు. ఇక్కడ కూడా మహిళల పట్ల వివక్ష కనిపిస్తుంది. నా విషయమే తీసుకొంటే... హఠాత్తుగా ఒక మహిళను ఇలా ఉన్నత స్థానంలో చూసే సరికి కొందరు తట్టుకోలేకపోయారు. మొదట్లో నేను ఒక కంపెనీకి వెళ్లినప్పుడు ఇంగ్లీష్‌వాళ్లు... 'ఏంటీ..! ఇంత చిన్న పిల్లల్ని కూడా ఇప్పుడు బయటకు పంపుతున్నారా' అని అన్నారు. ఇలాంటివెన్నో దాటి ఇవాళ నేను ఈ స్థాయిలో నిలబడ్డానంటే ఎంతో గర్వంగా ఉంది. నేను పని చేస్తున్న విభాగానికే కాదు... మొత్తం సివిల్ సర్వీస్‌కు కూడా ఇక్కడ ఒక హెడ్ ఉంటారు. ఆ స్థాయికి చేరాలన్నది నా ఆశయం."

● హనుమా

కృషి మిత్ర

"వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతులు హుందాగా జీవించాలి. గ్రామాల నుంచి వలసలు ఆగిపోవాలి. ఇవీ నా కలలు" అని చెబుతుంది పద్దెనిమిదేళ్ళ మునీ ముత్కామీ. కరువు గడ్డగా పేరుపడిన తమ ప్రాంతంలో... మార్పుకోసం ఆమె చేపట్టిన చిన్న ప్రయత్నం రైతులకు ఆశారేఖగా మారింది. 'కృషిమిత్ర'గా గుర్తింపు పొందిన మునీ కథ ఇది.




"మాది ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లాలో కుర్తి అనే గ్రామం. కోయ తెగకు చెందిన కుటుంబం. మా జిల్లా దుర్భిక్షానికి మారుపేరైన గిరిజన ప్రాంతం. రైతులు ఎక్కువగా వరినే పండిస్తూ ఉంటారు. వర్షపాతం సరిగ్గా ఉండకపోవడానికి తోడు సంప్రదాయికమైన సాగు పద్ధతులు, పొలాల్లోకి జంతువులు యథేచ్ఛగా ప్రవేశిస్తూ ఉండడం... ఇవన్నీ వారి జీవితాలను దుర్భరం చేశాయి. ఏటా అప్పో సప్పో చేసి పంటలు వేయడం, తీవ్ర నష్టాల పాలు కావడం, యువకులు, మధ్య వయస్కులు తమ కుటుంబాలను గ్రామాల్లోనే వదిలేసి, పొట్టపోసుకోవడం కోసం వేరే ప్రాంతాలకు... ప్రధానంగా సరిహద్దుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళడం మామూలైపోయింది. ఇవన్నీ చూస్తూ పెరిగాను. ఈ పరిస్థితులు మారాలంటే ఏం చెయాలనే ఆలోచన నన్ను వేధించేది. నేను ఎనిమిదో తరగతితో చదువు ఆపేసినా... పత్రికలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడమంటే ఆసక్తి. మూడేళ్ళ కిందట మల్కాన్‌గిరి ప్రాంతంలో... రాష్ట్రప్రభుత్వ భాగస్వామ్యంతో స్వామినాథన్ ఫౌండేషన్ ఒక ప్రాజెక్ట్ ప్రారంభించిందనే వార్త నన్ను ఆకర్షించింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, గిరిజనుల జీవితాలను మెరుగుపరచడానికి రబీ సీజన్ కోసం ఉచితంగా విత్తనాలను, పరికరాలను ఆ ఫౌండేషన్ అందిస్తోందని తెలిసింది. మా ప్రాంతంలో రబీ సాగు చేయరు. దానివల్ల రైతులకు కలిగే లాభాల గురించి తెలుసుకోవడానికి ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రతించాను. క్షేత్రస్థాయిలో అవగాహన పెంచడం కోసం అవగాహన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, ఆసక్తి ఉంటే హాజరు కావచ్చనీ వారు చెప్పారు. నేను ఉత్సాహంగా "సరే" అన్నాను. సేంద్రియ పద్ధతుల ద్వారా ఫలసాయాన్ని పెంచే ఆధునిక పద్ధతులు ఎన్నో నేర్చుకున్నాను. వాటిలో... వ్యవసాయంలో రబీ విత్తనాల ప్రాధాన్యత, భూసారాన్ని పెంచడం, చీడపీడల నివారణ, జంతువులు చొరబడకుండా నిరోధించడానికి పొలం చుట్టూ కంచెల ఏర్పాటు, సేంద్రియ వర్మీ కంపోస్ట్ తయారీ పద్ధతులు... ఇలా ఎన్నో ఉన్నాయి. రబీ సాగు వైపు మా ఊరి రైతులు మొగ్గు చూపిస్తే... విత్తనాలను, ఇతర ప్రాజెక్ట్ ఉపకరణాలను ఉచితంగా అందిస్తామని అధికారుల నుంచి హామీ తీసుకున్నాను.

ఇరు పక్షాలకూ ప్రతినిధిని...

"రైతులను ఒప్పించడం మాకు పెద్ద సమస్యగా మారింది. కొత్త పద్ధతుల్లోకి మారడానికి వారు త్వరగా ఇష్టపడరు. వాళ్ళకూ, మాకూ మధ్య నువ్వు వారధిలా పని చేస్తే... వారిలో అవగాహన పెంచడం, ఈ ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి కోసం చర్యలు చేపట్టడం మాకు సులువవుతుంది" అని అధికారులు చెప్పారు. నాకు మా గిరిజన తెగలు మాట్లాడే మాండలికంతో పాటు ఒరియా కూడా బాగా వచ్చు. అందుకే... సదస్సుల్లో శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పిన విషయాలను స్థానికులకు అర్థమయ్యేలా వివరించేదాన్ని. అధికారులతో పాటు దాదాపు ప్రతి గ్రామం తిరిగాను. అక్కడి రైతుల సమస్యలు తెలుసుకొని, అధికారులకు రాతపూర్వకంగా అందజేస్తూ వచ్చాను. ఒక విధంగా అటు ఆ ప్రాజెక్టుకు, ఇటు రైతులకు... ఇరుపక్షాలకూ నేను ప్రతినిధిని. నేను తెలుసుకున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులన్నీ గ్రామస్తులకు నేర్పాను. పెసర సాగు చేయాలని సూచిస్తే... అయిష్టంగానే వాళ్ళు ఒప్పుకొన్నారు. ముప్పై ఎకరాల్లో వేసిన పెసర పంటకు మంచి ఫలసాయం రావడంతో... మరుసటి ఏడాది ఎక్కువమంది రైతులు పెసర, వినప పంటలను... వరితో పాటు అదనంగా మరో యాభై ఎకరాల్లో వేశారు. జంతువులు చొరబడకుండా కంచె ఏర్పాటు చేశాం. పంటల్లోని వైవిధ్యం లాభసాటి అని మా ప్రాంత గిరిజన రైతులు ఇప్పుడు గ్రహించారు. జొన్న, వేరుశనగ, కూరగాయల సాగుతో అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. వారు పండించినదానిలో వ్యక్తిగత అవసరాలకు సరిపోయేంత దాచుకొని... విగిలినదాన్ని మార్కెట్‌లో లాభానికి అమ్ముకొనేలా ప్రోత్సహిస్తున్నాం. గ్రామాల్లో రైతుల అవసరాలను గుర్తించి, సాగులో వారికి ఎదురవుతున్న సవాళ్ళను అధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురావడానికి మా జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నాను. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి అందించడానికి ప్రయత్నిస్తున్నాను. కిందటి ఏడాది 'ఒడిశా లైవ్‌లీహుడ్ మిషన్' నన్ను 'కృషిమిత్ర'గా గుర్తించి సత్కరించింది. ఏ గ్రామానికి వెళ్ళినా... ప్రజలు నన్ను అభినందిస్తున్నారు, గౌరవిస్తున్నారు. ఇప్పుడు ఆపేసిన నా చదువును మళ్ళీ ప్రారంభించాలనుకుంటున్నాను. తద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవడానికీ, ప్రజలకు మరింత సాయపడడానికీ వీలుంటుంది. ఎవరూ గ్రామాలు విడిచి వెళ్ళకుండా... తమ సొంత భూముల ద్వారానే మంచి ఆదాయం పొందుతూ హుందాగా జీవించాలనేది నా కోరిక. అది నెరవేరేదాకా కృషి చేస్తూనే ఉంటాను."



నవ్య | చిత్రజ్యోతి



కశ్మీర్‌లో డ్యూయెట్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఓ అందమైన డ్యూయెట్ పాటను నాలుగు రోజులుగా కశ్మీర్‌లో షూట్ చేస్తున్నారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్న ఈ పాట అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ:ఆయనంక బోస్, సంగీతం:విక్కీ.జే.మేయర్.

ఘనవిజయం సాధిస్తుంది



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మధురం'. 'ఏ మెమరబుల్ లవ్' అనేది ఉపశీర్షిక. రాజేశ్ చికిలే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎం. బంగార్రాజు నిర్మిస్తున్నారు. టీనేజ్ ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను ఆదివారం హీరో నితిన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ చాలా బాగుంది. కచ్చితంగా 'మధురం' ఘన విజయం సాధిస్తుంది" అని అన్నారు. ఉదయ్‌రాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా యువతరాన్ని, కుటుంబప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌కు మైలురాయిగా మిగులుతుంది" అని చెప్పారు. దర్శకుడు రాజేశ్ చికిలే మాట్లాడుతూ "1990 నేపథ్యంలో సాగే ఈ చిత్రం అందరినీ ఆ కాలానికి తీసుకువెళ్తుంది" అని చెప్పారు. నిర్మాత ఎం. బంగార్రాజు మాట్లాడుతూ "అన్ని వర్గాల వారికి నచ్చేలా 'మధురం' ఉంటుంది" అని అన్నారు.



నటి సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. ముంబైలో జరిగిన ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో షేర్ చేశారు. సోనాక్షి, ఇక్బాల్ వివాహ పత్రాలపై సంతకం చేస్తున్న ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. "సరిగ్గా ఏడేళ్ల క్రితం ఇదే రోజు మా మధ్య ప్రేమ చిగురించింది. ఆ క్షణం నుంచి ఇద్దరం ఎన్నో కష్టసుఖాలను కలసి ఎదుర్కొని.. ఇప్పుడు ఒక్కటయ్యాం. ఇవి మా జీవితాల్లోనే మధుర క్షణాలు. కుటుంబ సభ్యుల ఆశీస్సులతో.. మా ఇద్దరి మధ్యనున్న ప్రేమతో కలకాలం కలిసుంటాం" అని వారు పేర్కొన్నారు. ఈ పెళ్లి వేడుకకు ఇరువురి కుటుంబ సభ్యులతో పాటు సిద్ధార్థ్,అదితి రావు హైదరీ, హ్యుమా ఖురేషి, సకీబ్ సలీమ్, అర్పితా ఖాన్, ఆయుష్ శర్మ విచ్చేశారు.

నేడు పవన్ కల్యాణ్‌తో నిర్మాతల భేటీ

టాలీవుడ్ నిర్మాతల బృందం నేడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను విజయవాడలోని క్యాంప్ ఆఫీసులో కలవనుంది. తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు, నిర్మాత అశ్వనీదత్, డి.వి.వి దానయ్య, చినబాబు, నవీన్ యెర్నేని, రవిశంకర్, నాగవంశీ విశ్వప్రసాద్, వివేక్, దామోదర్ ప్రసాద్, బోగవల్లి ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలపడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని పవన్ కల్యాణ్‌ను కోరనున్నారు. సినిమా టిక్కెట్ ధరల పెంపులో వెసులుబాటు, థియేటర్ల సమస్యలపై చర్చించనున్నారు.

అభిమానికి క్షమాపణ



తనను కలిసేందుకు ప్రయత్నించిన అభిమాని పట్ల తన వ్యక్తిగత సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన తీరుపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆయన ఎయిర్‌పోర్టులో నడుచుకుంటూ వస్తున్న సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా నాగార్జున దగ్గరకు రాబోయాడు. బౌన్సర్లు అతన్ని పక్కకు తోసేశారు. అయితే ఈ విషయాన్ని గమనించని నాగార్జున ముందుకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యి.. నెగెటివ్ కామెంట్స్ వచ్చాయి. దీంతో నాగార్జున ఆ అభిమానికి క్షమాపణలు చెప్పారు. 'ఈ సంఘటన ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. అలా జరిగుండాల్సింది కాదు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటాను' అని ఎక్స్‌లో తెలిపారు.

'రేవు' చెప్పే కథలు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డాక్టర్ మురళీ గింజుపల్లి నిర్మిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం చిత్రబృందం పాత్రికేయ సమావేశం నిర్వహించింది. సీనియర్ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ 'మత్స్యకారుల జీవితాల్లోని ఇబ్బందులను నేపథ్యంగా ఎంచుకొని 'రేవు' సినిమా చేయడం మంచి ప్రయత్నం. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ తెలుగులో పూర్తిగా 'రేవు' నేపథ్యంలో వచ్చిన సినిమా లేదు. ప్రేక్షకులకు ఈ సినిమా సరికొత్త అనుభూతిని అందిస్తుంద'న్నారు. ఫస్ట్‌కాపీ చూశాను, సినిమా బాగా వచ్చింది, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. నటీనటులు అందరూ కొత్తవారే అయినా అద్భుతంగా నటించారని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సినీ పాత్రికేయుడు పర్వతనేని రాంబాబు, ప్రభు ప్రొడక్షన్ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

'రుషికొండ' అక్రమాలపై చర్యలు తీసుకోండి

- టీడీపీ రిసెర్చ్ కమిటీ సభ్యుడు గంగాధర్ డిమాండ్
- గుంటూరు జిల్లా మంగళగిరిలో పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి సిటీ, జూన్ 23: విశాఖలోని రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రిసెర్చ్ కమిటీ సభ్యుడు టి.గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించిన మాజీ సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, మాజీమంత్రులపై కేసులు నమోదు చేయాలంటూ ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారందరిపై తక్షణమే ఐపీసీ సెక్షన్ 409 కింద కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రుషికొండపై పర్యాటక శాఖకు చెందిన రూ.కోట్ల విలువ చేసే భవనాలను కూల్చివేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. రుషికొండపై హోటళ్ల నిర్మాణం పేరుతో 2021 జూలై 6న పిలిచిన టెండర్లలో రెండు సంస్థలు పాల్గొనగా డీఈసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. 9.88 ఎకరాల విస్తీర్ణంలో హోటళ్ల నిర్మాణం జరుగుతున్నట్టు పేర్కొనడంతోపాటు జీవో నెం.5 ద్వారా రూ.421.87 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. హోటల్ నిర్మాణం మొదలుపెట్టే ముందే అన్ని అనుమతులు తీసుకున్నట్లు కోర్టులకు తప్పుడు నివేదిక ఇచ్చారని, పర్యావరణ చట్టాలను, ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని ఆక్షేపించారు. రుషికొండపై గతంలో ఉన్న 58 పడకల రిసార్ట్‌లను అక్రమంగా కూల్చివేశారని, కొత్త నిర్మాణాల పేరిట రూ.420 కోట్లకు పైగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆయన వెంట టీడీపీ ఎస్సీ సెల్ నేతలు ముత్యాల పార్థసారథి, అచ్చయ్య ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు మురళీధర్ రెడ్డి కన్నుమూత

- సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం

న్యూఢిల్లీ, జూన్ 23: సీనియర్ జర్నలిస్టు బీ మురళీధర్ రెడ్డి(64) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మురళీధర్ రెడ్డి ఢిల్లీలోని రామ్‌మనోహర్ లాల్ ఆస్పత్రిలో శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ది హిందూ పత్రికకు సుదీర్ఘ కాలం పని చేసిన మురళీధర్ రెడ్డి.. ఆ వార్తాపత్రిక పాకిస్థాన్, శ్రీలంక కరస్పాండెంట్‌గా పని చేశారు. బాబ్రీ మసీదు విధ్వంసం వంటి ముఖ్యమైన ఘటనలను రిపోర్ట్ చేశారు. మురళీధర్‌రెడ్డి మూడు నెలల క్రితం మోటార్ న్యూరాన్ డిసీజ్(ఎంఎన్‌డీ) బారిన పడ్డారు. ఎంఎన్‌డీకి ప్రస్తుతానికి సరైన చికిత్స లేదు. మురళీధర్ రెడ్డి ఆరోగ్యం క్షీణించడంతో నెల రోజులుగా ఆయన్ను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. రెండు వారాల క్రితం కార్డియాక్ అరెస్ట్‌కు గురైన మురళీధర్ రెడ్డి అప్పట్నించి తుది శ్వాస విడిచే వరకు కోమాలోనే ఉన్నారు. మురళీధర్ రెడ్డికి భార్య, పీటీఐ మాజీ జర్నలిస్టు అపర్ణ శ్రీవాస్తవ, కుమారుడు మనస్ ఉన్నారు. కాగా, సీనియర్ జర్నలిస్టు మురళీధర్ రెడ్డి మరణం బాధాకరమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మురళీధర్ రెడ్డి కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేశారు.

జగన్ ధనదాహానికి అంతులేదా?

- 26 జిల్లాల్లోనూ వైసీపీ ఆఫీసులకు కబ్జాల దందా
- కోర్టులు, ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా?
- గిరిజన శాఖ మంత్రి గుమ్మడి ఆగ్రహం

అమరావతి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జగన్ ధన దాహానికి, ప్యాలెస్‌ల పిచ్చికి అంతం లేదా? అంటూ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన జగన్ అవినీతిని తీవ్రంగా ఎండగట్టారు. 26 జిల్లాలో వైసీపీ నిర్మించే పార్టీ ఆఫీసులు స్థలం కొని నిర్మించినవి కావని, అన్నీ కబ్జాల దందానేనని ఆక్షేపించారు. రాష్ట్రం జగన్ అడ్డా కాదని పేర్కొన్నారు. అధికారం ఉందన్న బలుపుతో 26 జిల్లాల్లో 43 ఎకరాలను రూ.1000ల నామమాత్రపు లీజుకు కేటాయించుకున్న విషయన్ని ప్రజలు గమనించాలని కోరారు. జనం సొమ్ముతో రూ.500 కోట్లతో ప్యాలెస్‌లు కడుతున్నారని, జగన్ భూదాహం కోసం కబ్జాలతోపాటు, రూ.కోట్లకు పైగా విలువైన విలాసవంతమైన ప్యాలెస్‌లు నిర్మించారని పేర్కొన్నారు. 'అనుమతులు లేని కట్టడాలను, సొంత స్థలం కాకుండా కబ్జాలు చేసి కట్టిన భవనాలను కోర్టు ఎన్నడూ ఉపేక్షించదు. ప్రభుత్వమూ ఊరుకోదు. కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాతే ఏ భవనాన్నైనా కూలదోస్తుంది. జగన్ ప్రతి జిల్లాలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్యాలెస్‌ల మాదిరి వైసీపీ కార్యాలయాలకు భవనాలను నిర్మిస్తే కోర్టులు, ప్రభుత్వం ఊరుకోవాలా?' అని నిలదీశారు. అక్రమ కట్టడాలను కూలదోస్తామని ఆనాడు చెప్పిన జగన్ ఈ రోజు లబోదిబోమనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. జగన్ అవినీతిని చూసే ప్రజలు ఆయన్ను ఇంటికి పంపారన్నారు. 151 సీట్ల నుంచి 11కు వచ్చినా బుద్ధిరాలేదా? అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరించడం, బూతులు మాట్లాడటం ఇకనైనా ఆపాలని మంత్రి సంధ్యారాణి హితవు పలికారు.

జగన్ కోవర్టుతో అమరావతి శ్వేతపత్రం!

- బాధ్యతలు అప్పగించిన సీఆర్‌డీఏ
- వైసీపీ హయాంలో నారాయణ, బాబుపై కేసుల నమోదులో కీలకం


అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌కు వీరాభిమానిగా, కోవర్టుగా వ్యవహరించిన ఉద్యోగికి ప్రస్తుత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగించడం విమర్శలకు దారితీస్తోంది. జగన్ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో ప్రస్తుత మంత్రి నారాయణను ఇరికించేందుకు ఓ కాంట్రాక్టు ఉద్యోగి ప్రయత్నించారు. ఆయనకే ఇప్పుడు సీఎం చంద్రబాబు విడుదల చేయాలని భావిస్తున్న అమరావతి శ్వేతపత్రం రూపకల్పన బాధ్యతలు అప్పగించారు. చంద్రబాబు గత పాలనలో సీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేసిన ఈ కాంట్రాక్ట్ ఉద్యోగి.. అప్పట్లో మంత్రి నారాయణ ఇన్నర్ రింగ్‌రోడ్డు విషయంపై అధికారులతో చర్చిస్తూ పెన్సిల్‌తో రఫ్‌గా గీసిన పేపర్‌ను దాచిపెట్టారు. తర్వాత కాలంలో ఆ పేపర్‌ను జగన్‌కు చేరవేసి సీఐడీ అధికారులతో కుమ్మక్కై నారాయణ, చంద్రబాబులపై కేసులు నమోదు చేయడంలో కీలకపాత్ర పోషించారు. అలాంటి కాంట్రాక్ట్ ఉద్యోగితో ఇప్పుడు అమరావతి రాజధానిపై శ్వేతపత్రం రూపకల్పన చేయిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. దీనిని బట్టి ప్రస్తుత అధికారులకు ఇంకా వైసీపీ వాసనలు ఇంకా పోలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన కొంత మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధికారులతో పాటు అధికారుల పట్ల ఈ ప్రభుత్వం అప్రమత్తంగా లేకపోవడంతో ఇలాంటి పరిణామాలు జరుగుతున్నాయని అంటున్నారు. పైగా, ఈ కాంట్రాక్ట్ ఉద్యోగి గతంలో జగన్‌కు అనుకూలంగా, టీడీపీకి వ్యతిరేకంగా పలు పోస్టింగ్‌లు కూడా పెట్టారని సీఆర్‌డీఏ సిబ్బంది పలువురు చెబుతున్నారు.

బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

మోతీహరి, జూన్ 23: బిహార్‌లో మరో బ్రిడ్జి కూలింది. తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన ఆదివారం కూలిపోయింది. ఆ రాష్ట్రంలో గడిచిన వారం రోజుల్లో బ్రిడ్జి కూలిపోవడం ఇది మూడోసారి. ఘోరసహన్ బ్లాక్‌లో జరిగిన ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. రాష్ట్ర గ్రామీణ పనుల శాఖ(ఆర్‌డబ్ల్యూడీ) ఓ కాలువపై రూ. 1.5 కోట్లతో నిర్మిస్తోన్న ఈ బ్రిడ్జి పూర్తవకుండానే కూలింది. ఆర్‌డబ్ల్యూడీ శాఖ చీఫ్ సెక్రటరీ దీపక్ సింగ్ మాట్లాడుతూ... బ్రిడ్జి కూలడంపై శాఖాపరమైన విచారణకు ఆదేశించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రామాపురం తీరంలో మరో విషాదం

- ఇద్దరిని కబళించిన కెరటాలు.. మృతులు మంగళగిరి వాసులు



బాలసాయి, బాలనాగేశ్వరరావు

రామాపురం(చీరాలటౌన్), జూన్ 23 : బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం తీరంలో మరో విషాదం చోటుచేసుకుంది. ఆదివారం సముద్రస్నానం చేసేందుకు వచ్చిన వారిలో ఇద్దరిని కెరటాలు కబళించాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పడవల బాలసాయి(26), కొసనం బాలనాగేశ్వరరావు(27), గోవర్ధన్, బాలు, టపాసు, ప్రేమ్‌కుమార్, జయంత్, రాజా, సాయి, మేకల సాయి మరో ఇద్దరు బంగారు వస్తువులు తయారీ చేస్తుంటారు. వీరంతా ఆదివారం సరదాగా గడిపేందుకు రామాపురం సముద్రతీరానికి వచ్చారు. వీరిలో ఏడుగురు సీబ్రిడ్జ్ సమీపంలో సముద్రంలోకి దిగగా... బాలసాయి, బాల నాగేశ్వరరావు అలలు తాకిడికి కొట్టుకుపోయారు. అదేసమయంలో గోవర్ధన్ కూడా కొట్టుకుపోతుండగా ప్రేమ్‌కుమార్ అతడిని కాపాడాడు. సమాచారం అందుకున్న మెరైన్, రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే బాలసాయి, బాల నాగేశ్వరరావు మృతదేహాలు అదేప్రాంతంలో ఒడ్డుకు కొట్టుకువచ్చాయి.

పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు



27న రాష్ట్రానికి రానున్న అమెరికా, కెనడా ఇంజనీర్లు.. ఏడాదిపాటు సేవలకు ఒప్పందం

- కేంద్రం, పోలవరం అథారిటీ విజ్ఞప్తితో డ్యాం భద్రత పరిశీలన

అమరావతి, జూన్ 23(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించనుంది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టు పరిశీలనకు అమెరికా, కెనడా దేశాలకు చెందిన నలుగురు ఇంజనీరింగ్ నిపుణుల బృందం ఈ నెల 27న రాష్ట్రానికి రానుంది. ఈ బృందానికి డ్యాం నిర్వహణ, భద్రత, సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, కట్టడాలకు సంబంధించిన అంశాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. విదేశీ బృందంలో ఇంజనీర్లు డేవిడ్ బి.పాల్(అమెరికా), రిచర్డ్ జోన్నెల్లీ(కెనడా), డియాన్ ఫ్రాన్స్ డి.సిక్కో(అమెరికా), సీన్ హిచ్‌బర్గర్(కెనడా) ఉన్నారు. ఈ బృందం ఈ నెల 27 నుంచి జూలై 5 వరకు తొమ్మిది రోజులపాటు పోలవరం ప్రాజెక్టులో మకాం వేసి ప్రాజెక్టు నిర్మాణంలో ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణానికి సవాలుగా ఉన్న డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇతర ప్రతిబంధక సమస్యల అంశాలను పరిశీలించనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నివేదికలు సమర్పించనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కటాఫ్ వాల్‌గా నదీ గర్భంలో నిర్మించిన డయాఫ్రంవాల్ 2020లో సంభవించిన వరదలకు కొంతమేర దెబ్బ తినడంతో దానికి సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మించాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రతిపాదించింది. దీనిపై ఈ బృందం అభిప్రాయాన్ని వెల్లడించనుంది. గతంలో జరిగిన అధ్యయనాలు.. ఎగువ కాఫర్ డ్యాం నుంచి అధికంగా వెలువడుతున్న సీపేజీ అరికట్టడానికి రసాయనిక జెట్ గ్రౌటింగ్ ప్రక్రియ, సీపేజీ జలాల తీవ్రత తెలియజేసే పీజియో మీటర్లు ఏర్పాటు చేయడం వంటి వాటి విషయంలో కొన్ని సూచనలు చేశాయి. ఆ సూచనలు ఎంతమేరకు పని చేస్తాయో కూడా ఈ బృందం పరిశీస్తుంది. నదీ గర్భం కోతను పూడ్చేందుకు వైబ్రో కాంపాక్షన్, వైబ్రో స్టోన్ కాలమ్‌ల ఏర్పాటు అంశాలపై కూడా ఈ బృందం అధ్యయనం చేసి తక్కువ ఖర్చుతో ప్రత్యామ్నాయ మార్గాలను చూపవలసి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు అథార్టీల సిఫారసు మేరకు నియమించిన ఈ బృందం ప్రతి మూడు నెలలకు ఒకసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి సాంకేతిక సలహాలు సూచనలు చేయనుంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇంజనీరింగ్ సిబ్బందికి, అధికారులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించనుంది.

నన్ను చంపేయాలనుకున్నారు!



కేఆర్ సూర్యనారాయణ

- వైసీపీ బాధితుల కోసం జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ వేయండి
- ఇంటెలిజెన్స్ డీజీ నన్ను వేధించారు
- నన్ను చంపేయమని సజ్జల.. ఏసీపీకి ఫోన్ చేశారు
- బాబు, పవన్‌ను కలిశాననే వేధించింది
- సీఎస్ జవహర్‌పై విచారణ చేపట్టాలి
- ఏపీజీఈఏ జేఏసీ చైర్మన్ కేఆర్ ఆవేదన

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ విధ్వంస పాలనలో అష్టకష్టాలు పడిన వారికి టీడీపీ కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని, దీని కోసం తొలి కేబినెట్ సమావేశంలోనే జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్‌ను ఏర్పాటు చేసి బాధితులకు అండగా నిలవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపైనా, తమ కుటుంబంపైనా, ఉద్యోగ సంఘాలపైనా, వివిధ వర్గాలపైనా వైసీపీ ప్రభుత్వం సాగించిన దౌర్జన్యకాండపై మండిపడ్డారు. ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన ఆర్థిక చెల్లింపులు సక్రమంగా జరగటం లేదని, రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, జీపీఎఫ్, సీపీఎస్ సొమ్మును వాడుకున్నారని గవర్నర్‌కు 2023, జనవరి 19న నివేదించామని, ఆ తెల్లవారు నుంచే వైసీపీ ప్రభుత్వం తనతో పాటు ఉద్యోగ సంఘాలను ఊచకోత కోయటం ప్రారంభించిందన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీఎన్‌జీవో సంఘాన్ని అడ్డు పెట్టుకుని తనపై బురద చల్లారని, చివరికి అరెస్టు చేయించేందుకు, చంపించేందుకు కూడా కుట్రలు చేశారని పేర్కొన్నారు. తనపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న కేసులు పెట్టడం, కుదరకపోవటంతో వాణిజ్యపన్నుల శాఖలో జరిగిన అక్రమ బదిలీలను ప్రశ్నించినందుకు 2021లో జరిగిన ఓ ఉదంతాన్ని ఆధారంగా చూపి అరెస్టు చేయాలని చూసిందన్నారు. 'ఎఫ్ఐఆర్ పెట్టి అరెస్టు చేయాలని చూశారు. నా భార్య, కూతుళ్లను అర్ధరాత్రి వరకూ విచారణ చేసి హింసించారు. నా భార్య మెడలోని నల్లపూసలను కూడా తీయించారు. భయభ్రాంతులకు గురిచేశారు.' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గవర్నర్‌ను కలిసిన వెంటనే తన ఫోన్లను పీఎస్ఆర్ ఆంజనేయులు ట్యాప్ చేయించారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను తాను కలిసిన సందర్భంలో కూడా తనపై వేధింపులకు పాల్పడ్డారన్నారు. ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న సీతారామాంజనేయులు తనను రెండుసార్లు పిలిపించి, ఏసుపాదం అనే అధికారితో బెదిరించారని తెలిపారు. 'ముఖ్యమంత్రి దగ్గరకెళ్లి, క్షమాపణలు చెప్పి, ఆందోళనలను విరమించకపోతే నిన్ను భగవంతుడు కూడా కాపాడలేడు.' అని బెదిరించారని పేర్కొన్నారు. 'సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని అమలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సీపీఎస్ రాజ్యాంగ విరుద్ధమైన అంశంగా నేను మాత్రమే గ్రహించాను. హైకోర్టులో చాలెంజ్ చేస్తానని కూడా చెప్పాను. ఉద్యోగుల జీపీఎఫ్ సొమ్ము రూ.500 కోట్లను వారి సమ్మతి లేకుండా సొంత అవసరాలకు వాడుకోవటంపై ఆర్థికశాఖ అధికారులైన ఎస్ఎస్ రావత్, కేవీవీ సత్యనారాయణపై క్రిమినల్ కేసులు పెడతానని హెచ్చరించాను. దీంతో వైసీపీ ప్రభుత్వం కక్షగట్టింది' అని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ కట్టారన్న పేరుతో సస్పెండ్ చేసిన గిరిజాశంకర్ అనేక అసమర్థ అధికారి.. ఈ రోజుకూ ఏ కారణంతో సస్పెన్షన్ చేశాడన్న మెమో కూడా ఇవ్వలేదన్నారు. చంద్రబాబును కలిశానని 200 మంది పోలీసులను పంపి తనను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారన్నారు. ఈ సందర్భంలో తాను తప్పించుకున్నానని, తన డ్రైవర్‌ను పట్టుకుని చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. తన డ్రైవర్‌ను కొట్టే సందర్భంలో అక్కడి ఏసీపీకి సజ్జల సార్ అనే నంబర్‌తో ఫోన్ కాల్ వచ్చిందని, ఆ సమయంలో సజ్జల తనను చంపేయమని చెప్పారని తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలో రూ.500 కోట్ల కుంభకోణం జరిగిందని సాక్ష్యాలతో సహా వార్తల్లొస్తే సంవత్సరం గడిచినా అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

పని చేయకుండానే కోటిన్నర బిల్లు



- కడప కాంట్రాక్టరుపై అవ్యాజ ప్రేమ
- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో అవినీతి లీలపై దుమారం
- నిబంధనలకు విరుద్ధంగా రూ.4.50 కోట్ల పని కేటాయింపు
- ఆందోళనకు సిద్ధమవుతున్న వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్లు

విజయవాడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): వడ్డించేవాడు మనవాడైతే.. కడబంతిలో కూర్చున్నా పరవాలేదన్న చందంగా.. పనిచేయకుండానే కడప కాంట్రాక్టర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం రూ.కోటిన్నర మేర బిల్లులు చెల్లించిన అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ దారుణంపై టీడీపీ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ చెల్లింపులపై ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నామినేషన్ల విధానంలో జరిగిన పనులపై ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ విచారణకు కూడా ఆదేశించారు. వివరాలివీ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో 'వింకనే టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే కంపెనీకి ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్ వర్క్ పనులు అప్పగించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ చిరునామాను కలిగిగిన ఈ కంపెనీకి ఎండీగా అనిల్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. రూ.4.50 కోట్ల విలువ చేసే పనిని ఎలాంటి టెండర్లూ పిలవకుండా నామినేషన్ విధానంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి అప్పగించారు. వాస్తవానికి నామినేషన్ విధానంలో రూ.5 లక్షలు, ఆలోపు పనులను మాత్రమే ఇస్తారు. రూ.4.50 కోట్ల పనులను అప్పగించటంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. అయినా ఈఎన్‌సీ కార్యాలయ ఉన్నతాధికారులు ఎన్ని ఆరోపణలు వచ్చినా ముందుకే వెళ్లారు. తీరా చూస్తే ఆ సంస్థ పనులే చేపట్టలేదని తెలుస్తోంది. సదరు కాంట్రాక్టు సంస్థ.. విశాఖ, కడపలో క్లోరినేషన్ పనులు చేపట్టలేదని పలువురు వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ సంస్థ చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులు కూడా జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ బిల్లులు చెల్లించడంపై ఇప్పుడు దుమారం రేపుతోంది. ఏ ప్రాతిపదికన రూ.1.50 కోట్లు చెల్లించారన్నది సందేహంగా మారింది. ఈ చెల్లింపుల వ్యవహారంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయ అధికారులకు వాటాలు అందాయనే ఆరోపణలు వస్తున్నాయి. రక్షిత మంచినీటిని అందించటం కోసం క్లోరినేషన్ ప్రక్రియను నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో ప్రస్తుతం అధునాతన గ్యాస్ క్లోరినేషన్ నిర్వహించాల్సి ఉండగా, పాత పద్ధతిలో ఇన్‌లైన్ క్లోరినేషన్‌కు నామినేషన్‌పై పనులు కల్పించటం చూస్తే భారీగా ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తోంది.

లిక్విడ్ క్లోరినేషన్ విధానంలో..

క్లోరినేషన్ ప్రక్రియలో నాల్గో దశనే ఇప్పుడు చాలామంది అనుసరిస్తున్నారు. మొదటి విధానంలో బ్లీచింగ్ పౌడర్‌ను వడకట్టి, ఆ నీటిని మంచినీటిలో పోసేవారు. ఇదీ చాలా పాత పద్ధతే. ఆ తర్వాత ఉప్పును ఉపయోగించి ఎలక్ట్రోలిసిస్ విధానంలో బ్లీచింగ్‌గా మార్చి మంచి నీటిని శుద్ధి చేసేవారు. ఈ విధానం తర్వాత లిక్విడ్ క్లోరినేషన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. పైపుల్లోకి ప్రత్యేకమైన మిషన్ల ద్వారా లిక్విడ్ క్లోరిన్‌ను డ్రెడ్డింగ్ చేస్తారు. ఈ విధానం తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న నాల్గో విధానం వచ్చింది. అదే గ్యాస్ క్లోరినేషన్. ఈ విధానమే అత్యుత్తమమైనదిగా ప్రపంచం భావిస్తోంది. దేశంలోనూ ఈ విధానం అమలు జరుగుతోంది. మన దగ్గర కూడా అమలవుతోంది. కానీ, గ్యాస్ క్లోరినేషన్ కాకుండా లిక్విడ్ క్లోరినేషన్ విధానంలోనే పనులు చేపట్టడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పాత విధానం ఎంచుకోవటంలో కూడా కాంట్రాక్టు సంస్థ, ఈఎన్‌సీ కార్యాలయ అధికారుల ప్రయోజనాలు దాగున్నాయని తెలుస్తోంది.

ప్రత్యేక హోదాపై కేంద్రం దృష్టి పెట్టాలి!

- ఏపీ, బిహార్‌ల డిమాండ్‌ను పరిశీలించాలి
- నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడి సూచన
- కేంద్రంపై ఆర్థిక భారం పడుతుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 23: ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తగా దృష్టి సారించాలని నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ సూచించారు. అయితే, ఈ విషయంలో తొందరపడితే ఆర్థిక భారంతో ఇబ్బందులు పెరుగుతాయని చెప్పారు. ఆదివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. బిహార్, ఏపీలు కోరుతున్న ప్రత్యేక హోదా డిమాండ్ సుదీర్ఘకాలంగా ఉన్నదేనని తెలిపారు. దీనిని అత్యంత జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే.. ఏయే ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక హోదా కోరుతున్నారనేది కీలకమని తెలిపారు. తొందర పడి నిర్ణయం తీసుకుంటే.. రేపు మరిన్ని రాష్ట్రాలు కూడా హోదా కోసం డిమాండ్ చేస్తాయని రాజీవ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు హోదా కోరుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా విషయాన్ని నిశితంగా సమీక్షించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ పనిని ఆర్థిక సంఘం చేయొచ్చన్నారు. "ప్రత్యేక హోదా కోసం డిమాండ్ ఉంది. కానీ, ప్రధాని మాత్రం ఇప్పటికీ ఈ విషయంలో మౌనంగానే ఉన్నారు" అని రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు.

మరిన్ని విషయాలు

- 2014లో జరిగిన ఉమ్మడి ఏపీ విభజన తర్వాత ఏపీ హైదరాబాద్ నగరాన్ని కోల్పోయి ఆర్థికంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తోంది.
- 2000 సంవత్సరంలో ఉమ్మడి బిహార్ విడిపోయి.. గనులు, భూగర్భ వనరులు ఎక్కువగా ఉన్న జార్ఖండ్ నూతన రాష్ట్రంగా అవతరించింది. దీంతో బిహార్ నష్టపోయింది. ఈ నేపథ్యంలో 2005 నుంచి ప్రత్యేక హోదా కోసం బిహార్ డిమాండ్ చేస్తోంది.
- ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పథకాలకు 90 శాతం నిధులను కేంద్రమే ఇవ్వాల్సి ఉంటుంది. హోదా లేని రాష్ట్రాలకు కేంద్రం 60 శాతమే నిధులు ఇస్తుంది. మిగిలిన నిధులను ఆయా రాష్ట్రాలు కేటాయిస్తాయి.
- కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాల వాటాను 14వ ఆర్థిక సంఘం 32 శాతం నుంచి 42 శాతానికి పెంచింది. కానీ, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలను రద్దు చేసింది.
- 1969లో తొలిసారి రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కేటగిరీని ప్రవేశ పెట్టారు. అప్పట్లో ఐదో ఆర్థిక సంఘం దీనిని సిఫారసు చేసింది.
- ప్రధానంగా కొండ ప్రాంతాలు, అంతర్జాతీయ సరిహద్దులు ఉన్న రాష్ట్రాలు, ఆర్థికంగా, మౌలిక వసతుల పరంగా వెనుకబడిన రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక హోదాను సిఫారసు చేయడం గమనార్హం.

కొత్త ప్రభుత్వంలోనూ అనకొండల జోరు?

- గనుల శాఖలో కీలక పోస్టులపై కన్ను
- ప్రజాప్రతినిధుల ద్వారా రాయబారాలు
- ఎంతైనా సమర్పించుకుంటామని ఆఫర్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారులో గనుల శాఖ కేంద్రంగా అడ్డగోలు అక్రమాలు చేసిన అవినీతి అనకొండలు.. కొత్త ప్రభుత్వంలోనూ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నారు. కీలక స్థానాలు కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో ఇద్దరు ముఖ్య అధికారులు ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. గనుల మంత్రి కొల్లు రవీంద్రకు ఓఎస్డీగా రావాలని ఒకరు.. గనుల శాఖలోనే జాయింట్ డైరెక్టర్ పోస్టుకోసం మరొకరు లాబీయింగ్‌కు దిగారు. తమకు తెలిసిన ప్రజాప్రతినిధుల ద్వారా రాయబారాలు నడుపుతున్నారు. పోస్టులు దక్కించుకునేందుకు ఎంతైనా సమర్పించుకుంటామని ప్రలోభపెడుతున్నారు. వీరిద్దరూ గత ప్రభుత్వంలో ఇసుక, సర్వే రాళ్లు, ఖనిజాల లీజులో అక్రమాలకు పాల్పడిన ఘనులే. మంత్రి ఓఎస్డీ కోసం ప్రయత్నిస్తున్న గనుల శాఖ కీలక అధికారి గత ప్రభుత్వంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. మైనర్ మినరల్స్ లీజులకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)ల జారీ, సర్వే రాళ్ల కొనుగోళ్లలో భారీ అక్రమాలు చేశారు. నాటి సీఎం జగన్ చేపట్టిన భూముల సర్వేకు అవసరమైన కోట్లాది సర్వే రాళ్ల కొనుగోళ్లలో కీలక పాత్ర ఈయనదే. తన బావమరిదితో కంపెనీ ఏర్పాటుచేయించి రాళ్ల సరఫరా టెండర్ ఆయనకే దక్కేలా చక్రం తిప్పారు. సర్వే రాళ్ల పాలిషింగ్, ఎంగ్రేవింగ్ పనుల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.500 కోట్లతో ఐదు యూనిట్లు ఏర్పాటు చేయించాలని ప్రతిపాదించిన ఘనుడు. ఇప్పుడాయన అర్జంటుగా గనుల మంత్రి కొల్లు రవీంద్రకు ఓఎస్డీగా వెళ్లాలనుకుంటున్నారు. తాను పనిచేసే ఆఫీసులను సీజ్ చేయడంతో ఈ పోస్టుపై కన్నేశారు. ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తనకు తెలిసిన ఓ కోస్తాంధ్ర ఎంపీని పట్టుకున్నారు. ఆయన గతంలో వైసీపీ ఎంపీగా పనిచేశారు. ఇప్పుడు గనుల అక్రమార్కుడికి అనుకూలంగా సిఫారసు లేఖ కూడా ఇచ్చారు.

అగ్రి భూముల కబ్జాపై చర్యలు!

- డిప్యూటీ తహసీల్దార్, మండల, గ్రామ సర్వేయర్లపై వేటు
- జోగి రమేశ్ అక్రమాలకు సహకరించిన ఫలితం
- నున్న సబ్ రిజిస్ట్రార్‌పైనా చర్యలకు డిమాండ్

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ సంస్థ భూముల కబ్జాలో మాజీ మంత్రి జోగి రమేశ్‌కు అడ్డగోలుగా సహకరించిన రెవెన్యూ అధికారులపై వేటు పడింది. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో రూ.8 కోట్ల విలువైన 2,160 చదరపు గజాల అగ్రిగోల్డ్ భూమి సీఐడీ అటాచ్‌లో ఉంది. ఆ భూమిని కొట్టేసేందుకు జోగి రమేశ్ పన్నిన కుట్రలో డెప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, అంబాపురం గ్రామ సర్వేయర్ కీలకపాత్ర పోషించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనికి అప్పటి నున్న సబ్ రిజిస్ట్రార్ కూడా సహకరించారు. ఈ వ్యవహారంలో పూర్వాపరాలను తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆ ముగ్గురినీ సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కాగా, జోగి రమేశ్‌కు వీరభక్తుడిగా ఉన్న నున్న సబ్ రిజిస్ట్రార్‌పైనా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఇసుక తోలుతాం.. దమ్ముంటే ఆపుకోండి

- సోషల్ మీడియా గ్రూప్‌లో వైసీపీ కార్యకర్త సవాల్
- చెప్పినట్లే తరలించినట్లు సమాచారం



సోషల్ మీడియా గ్రూపులో ప్రభాకర్ పెట్టిన పోస్టులు

బొమ్మనహాళ్, జూన్ 23: 'ఇసుకను అక్రమంగా తరలిస్తాం. రాత్రి 10.30 గంటలకు ఇసుక లోడ్ చేస్తాం. 12.30 గంటలకు లోడ్ బయల్దేరుతుంది. టైమింగ్‌తో సహా పెట్టాం. మీకు దమ్మూ ధైర్యం ఉంటే ఆపండ్రా.. చూసుకుందాం..' అంటూ ఓ వైసీపీ కార్యకర్త సోషల్ మీడియాలో టీడీపీ శ్రేణులకు సవాల్ విసిరాడు. చెప్పినట్లే ఇసుక తరలించినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఓడినా వైసీపీ దౌర్జన్యాలు ఆగట్లేదు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలో వేదావతి హగరి నది నుంచి వైసీపీ హయాంలో ఇసుక దోపిడీ సాగించారు. వైసీపీ నాయకులు రాత్రింబవళ్లు ఇసుక అక్రమంగా తరలించి రూ.కోట్లు వెనకేసుకున్నారు. అధికారం పోయినా ఇసుక దోపిడీ మాత్రం ఆగట్లేదు. ఈ క్రమంలోనే బొమ్మనహాళ్ మండలం కళ్లుదేవనహళ్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, ఆ పార్టీ మండలస్థాయి ప్రజాప్రతినిధి అనుచరుడు ప్రభాకర్ రెచ్చిపోయాడు. గ్రామ సోషల్ మీడియా గ్రూప్‌లో ఈనెల 22న రాత్రి టీడీపీ వర్గాలను సవాల్ చేస్తూ పోస్టులు పెట్టాడు. వేదావతి హగరి నది నుంచి ఇసుకను తరలిస్తామనీ, దమ్ముంటే పచ్చపార్టీ నాయకులు ఆపాలంటూ రాత్రి 8 గంటల ప్రాంతంలో పోస్టులు పెట్టాడు. పత్రికల్లో రాయలేని పదజాలం వాడాడు. చెప్పినట్లుగానే శనివారం అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇదే విషయం బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులును అడగ్గా.. ఇసుక అక్రమంగా తరలించిన విషయంగానీ, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన విషయంగానీ తమ దృష్టికి రాలేదన్నారు.

దివ్యాంగ బాలికపై లైంగిక దాడి..

- నాలుగు రోజులుగా నిర్బంధం
- బాలికకు మాయమాటలు చెప్పి ఏపీకి తీసుకెళ్లిన యువకుడు
- కృష్ణా జిల్లా కోడూరులో గుర్తింపు
- నిందితుడిపై కిడ్నాప్, పోక్సో, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులు
- మిర్యాలగూడలో ఘటన..

మిర్యాలగూడ అర్బన్, జూన్ 23: దివ్యాంగ బాలికను మాయమాటలతో లోబరుచుకున్న ఓ యువకుడు రాష్ట్ర సరిహద్దు దాటించాడు. రహస్య ప్రదేశంలో నాలుగు రోజులుగా నిర్బంధించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా ఈ విషయం వెలుగుచూసింది. ఏపీలోని కృష్ణా జిల్లా కోడూరు మండల కేంద్రానికి చెందిన బొట్టు బేబీరావు రెండేళ్లుగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఉంటూ ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. దానికి ఎదురుగా నివసించే దివ్యాంగ బాలికతో అతడు పరిచయం పెంచుకున్నాడు. అయితే ఈనెల 18వ తేదీ నుంచి బాలిక కనపడకపోవటంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమెతో సన్నిహితంగా మెలిగే బేబీరావుపై అనుమానం వ్యక్తం చేయగా.. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో పోలీసు బృందం బేబీరావును గుర్తించేందుకు దర్యాప్తు మొదలుపెట్టింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా బేబీరావు కోడూరు మండల కేంద్రంలో ఉన్నట్లుగా నిర్ధారించుకొని అక్కడికి చేరుకున్నారు. శనివారం రాత్రి బేబీరావును అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. దివ్యాంగ మైనర్ బాలిక ఆచూకీ లభ్యమైంది. నాలుగు రోజులుగా బాలికను నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాలికను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షల అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు బేబీరావుపై కిడ్నాప్, పోక్సో, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.